అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 3-8-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 163 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

మణిపూర్‌లో శాంతి స్థాపనకు జోక్యం చేసుకోండి

ప్రజలు భయం, అభద్రతలో ఉన్నారు : రాష్ట్రపతికి ప్రతిపక్షాల వినతి



వివరాలు 9లో..



వరద సాయం పెంచాలి

జాతీయ విపత్తు నిధులు విడుదలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి : సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ
- ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ(ఎం) బృందాల పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరద సాయం రూ.రెండు వేల కోట్లకు పెంచాలనీ, బాధితులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వరద నష్టానికి క్యాబినెట్‌లో ప్రకటించిన రూ.500 కోట్లు ఏ మాత్రం సరిపోవని తెలిపారు. క్షేత్రస్థాయిలో వరదనష్టాన్ని అంచనా వేసి జాతీయ విపత్తు నిధులను విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో పదిరోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదలొచ్చిన ప్రాంతాల్లో తమ పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు గతనెల 29, 30 తేదీల్లో పర్యటించి, పలు అంశాలను పరిశీలించారని తెలిపారు. బాధితులతో మాట్లాడి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి జిల్లాల్లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, ములుగు జిల్లాలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, డీజీ నరసింహారావు, జనగామ జిల్లాలో అఖిల భారత నాయకులు హన్నన్‌మొల్ల, బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, భద్రాద్రి కొత్తగూడెంలో ...10లో

రైతు రుణమాఫీ షురూ

నేటి నుంచి విడతలవారీగా.. సెప్టెంబర్ రెండో వారానికి పూర్తి



సీఎం కేసీఆర్ ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చాలా కాలంగా రైతులు ఎదురుచూస్తున్న రుణమాఫీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం రైతు రుణమాఫీని పున:ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. ఇప్పటికే అందించిన రుణమాఫీ పోను మరో రూ.19వేల కోట్ల రుణమాఫీని రైతులకు అందించాల్సి ఉందని పేర్కొన్నారు. రైతుబంధు తరహాలో విడతల వారీగా కొనసాగిస్తూ...సెప్టెంబర్ రెండో వారంలోపు పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో రైతు రుణమాఫీపై సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, సీఎం ముఖ్య సలహాదారు సోమేష్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హెచ్ ఎండీఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ అర్వింద్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సంక్షేమం, ...9లో

15 నుంచి డబుల్ ఇండ్ల పంపిణీ

మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరే.. : మంత్రి కేటీఆర్

- జీవో 118 కింద పట్టాల పంపిణీ

వివరాలు 2లో..

హిందూ ట్రిక్స్!

అందులో భాగమే మత ఘర్షణలు

యోగి ప్రకటన ఆ ఎత్తుగడలో భాగమే.. మౌనంలోనే మోడీ

హర్యానాలో చెలరేగిన మతపరమైన ఘర్షణలు ఓట్ల రాజకీయంలో భాగమేనని చెప్పాలి. గురుగ్రామ్‌లోని ఓ మసీదును తగలబెట్టి 19 సంవత్సరాల ఇమామ్‌ను దారుణంగా చంపేశారు. మాంసం దుకాణాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. నూహ్ జిల్లాలో వీహెచ్‌పీ చేపట్టిన బల ప్రదర్శన హింసకు దారి తీసింది. ఆరుగురి ప్రాణాలు తీసింది. మరెందరినో గాయపరిచింది. వాస్తవం ఇలా ఉంటే వీహెచ్‌పీ ప్రదర్శనపై దుండగులు దాడి చేశారని, దీనివల్లే ఘర్షణలు చెలరేగాయని ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ చేసిన ప్రకటన అగ్నికి ఆజ్యం పోసింది. నిజానికిసంఘ్ పరివార్ పథకంలో భాగంగానే నూహ్, గురుగ్రామ్‌లో హింస చెలరేగింది. బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లో గతంలోనూ, ఇప్పుడు హర్యానాలోనూ ఎక్కడ మత ఘర్షణలు జరిగినా అవి ఎన్నికల నేపథ్యంలో జరగటం గమనార్హం.

ఏ అవకాశాన్నీ వదులుకోని బీజేపీ నేతలు హర్యానాలో చెలరేగిన హింస దానికి తాజా ఉదాహరణే



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో విజయం కోసం బీజేపీ, సంఘ్ పరివార్ సరికొత్త ఎత్తులు వేస్తున్నాయి. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి సొమ్ము చేసుకునేందుకు అడ్డదారులు వెతుకుతున్నాయి. వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వివాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన ప్రకటనను ఈ కోణం నుండే చూడాల్సి ఉంటుంది. ముస్లింలు గతంలో చేసిన చారిత్రక తప్పిదాలను గుర్తించి, అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన సుద్దులు చెప్పారు. ఆదిత్యనాథ్ ప్రకటన బీజేపీ ఊహించినట్లుగానే రాజకీయ వివాదానికి తెర లేపింది. ఆదిత్యనాథ్ ప్రకటన రాజకీయ ఎత్తుగడేనని పరిశీలకులు సైతం భావిస్తున్నారు. తన ప్రకటనను మైనారిటీలు ఎలాగూ వ్యతిరేకిస్తారని ఆయనకు తెలుసు. అయితే మైనారిటీలకు వ్యతిరేకంగా హిందూ ఓట్లను సంఘటితం చేసేందుకే ఆదిత్యనాథ్ ఈ పాచిక వేశారనడంలో ఎలాంటి సందేహం లేదు. జ్ఞానవాపి మసీదుపై నెలకొన్న వివాదానికి సంబంధించిన వేర్వేరు కేసులలో అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఇవ్వనున్న కీలక తరుణంలో ఆదిత్యనాథ్ ఈ ప్రకటన చేశారు. తీర్పులు వెలువడనున్న సమయంలో రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి చేసిన ప్రకటన కచ్చితంగా న్యాయ వ్యవస్థను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అంతేకాక న్యాయస్థానాలలో వ్యాజ్యాలు వేసిన హిందూ సంస్థల అభ్యర్థనలను ఈ ప్రకటన సమర్థించింది.

కేసుల మీద కేసులు...



ఇక వారణాసిలోని ఓ మసీదుపై కూడా వివాదం నడుస్తోంది. పైగా అది ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ స్థానం లోనిది. బీజేపీ, సంఘ్ పరివార్ అనుబంధ సంస్థల ప్రోత్సాహంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వివాదాన్ని గత మూడు సంవత్సరాలుగా రగిలిస్తూనే ఉన్నాయి. న్యాయ ప్రక్రియను మరింత సంక్లిష్టం చేసేందుకు సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు వాటికి వంత పాడుతున్నారు. కాశీ విశ్వనాథ దేవాలయం, గంగా నది ...9లో

ఓట్ల కోసం పాట్లు

ఇక్కడ ఓ విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. 2021 డిసెంబర్‌లో ప్రధాని మోడీ కాశీ విశ్వనాథ దేవాలయ కారిడార్‌ను ప్రారంభించారు. ఫలితంగా 2022 మార్చిలో జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించింది. 2017 ఎన్నికల సమయంలో కూడా మోడీ ప్రజలలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి బీజేపీకి ఓట్ల వర్షం కురిపించారు. బీజేపీ నాయకులు కూడా మోడీనే అనుసరిస్తూ తమ వంతు పాత్ర పోషించారు. కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యన్ గత నెలలో 80 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. హిందువులకు పవిత్ర మాసంగా భావించే జూలై నెలలో ఆయన గ్రామాలు, పట్టణాలు, నగరాలలో కాలినడకను చుట్టి వచ్చి, ఉమ్మడి పౌరస్మృతి వంటి వివాదాస్పద అంశాలను ప్రస్తావించి, హిందూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. గత నెల 30న జరిగిన 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో కూడా మోడీ సంస్కృతి, మతం వంటి విషయాలను ప్రస్తావించారు. 'బనారస్ చేరుకునే యాత్రికుల సంఖ్య రికార్డు సృష్టించింది. ఇప్పుడు ప్రతి ఏటా పది కోట్ల మంది కాశీ వస్తున్నారు. అయోధ్య, మధుర, ఉజ్జయినికి వెళ్లే సందర్శకుల సంఖ్య కూడా పెరుగుతోంది. దీనివల్ల పేదలకు ఉపాధి లభిస్తోంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఇలా ఎక్కడ అవకాశం వచ్చినా మోడీ మతాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నారు. అందువల్ల దేశంలో తలెత్తుతున్న మత ఘర్షణలన్నీ యాధృశ్చికం అనుకోలేం. ఇప్పుడు హర్యానా ఘటనలు సైతం అందుకు మినహాయింపు కాదు.

నేటి నుంచి అసెంబ్లీ

ఉదయం 11.30 గంటలకు ఉభయసభలు ప్రారంభం

- సభ ముందుకు పలు బిల్లులు
- కీలక నిర్ణయాలు ప్రకటించనున్న సీఎం కేసీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలనుఎండగట్టేందుకు విపక్షాల వ్యూహం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉభయ సభలు ఉదయం 11.30 గంటలకు సమావేశమవుతాయి. ఎన్నికలకు ముందు జరుగుతున్న చివరి సమావేశాలు కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ సెషన్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. రాజకీయంగా మైలేజ్ కోసం అసెంబ్లీ సమావేశాలను ఉపయోగించుకోవాలని చూస్తున్నాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింతగా ప్రచారం చేసుకునేందుకు అధికార పక్షం ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోనుంది. సంక్షేమ పథకాలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేయనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ భవిష్యత్ లక్ష్యాలు, ప్రణాళికలను సభా వేదికగా సీఎం ప్రజలకు వెల్లడించే అవకాశముంది. అదేసమయంలో, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రతిపక్షాలు వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నాయి.

ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. గత సమావేశాల్లో సభ ఆమోదం పొందిన తెలంగాణ రాష్ట్ర ప్రయివేటు యూనివర్సిటీల సవరణ బిల్లు 2022, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చట్ట సవరణ బిల్లు 2022, తెలంగాణ రాష్ట్ర



పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు 2023 బిల్లులను గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ తిరస్కరించారు. ఈ మూడు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి సభలో ప్రవేశపెట్టనుంది. ఈసారి సభ ఆమోదంతో గవర్నర్ అనుమతి లేకుండానే ఆ మూడు బిల్లులకు చట్టబద్ధతరానుంది. టీఎస్ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వ ఉగ్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, తదనుగుణంగా బిల్లును ప్రభుత్వం సభ ముందుంచనుంది. ఇటీవల మృతిచెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే సాయన్నకు శాసనసభ సంతాపం ప్రకటించనుంది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక ...9లో



హింస - విద్వేష ప్రసంగాలు వద్దు : సుప్రీం

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రదర్శనలపై స్టే ఇవ్వని బెంచ్



న్యూఢిల్లీ : మతోన్మాద హింస చోటు చేసుకున్న హర్యానాలోని నుహ్ జిల్లాలో విహెచ్‌పి, బజరంగ్‌దళ్ సంస్థల "ప్రదర్శనలపై" సుప్రీం కోర్టు ప్రత్యేక బెంచ్ బుధవారం స్టే ఇవ్వలేదు. అయితే, ఎలాంటి హింస జరగకుండా, ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు చేయకుండా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని, పోలీసులను కోరింది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. "ద్వేషపూరిత ప్రసంగం వాతావరణాన్ని దెబ్బ తీస్తుందనే అంశంపై ఎలాంటి తగాదా వుండరాదు. ఎలాంటి హింస జరగకుండా, విద్వేష ప్రసంగాలు చేయకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. సంబంధిత రాష్ట్ర అధికారులతో కేంద్రం వెంటనే మాట్లాడాలి. చట్టబద్ధ పాలన ...9లో

సర్కారు బడుల్లో సమస్యలు పరిష్కరించాలి



- గ్రామాల అభివృద్ధిపై పాలకులు శ్రద్ధ పెట్టాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ- చౌటుప్పల్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, గ్రామాల అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ...9లో

నేను నిర్దోషిని..

పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనే అవకాశమివ్వండి : రాహుల్



న్యూఢిల్లీ: పరువు నష్టం కేసులో ఎలాంటి నేరానికీ పాల్పడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాను నిర్దోషినని, తనకు విధించిన రెండేండ్ల శిక్షపై స్టే విధించాలని సుప్రీంకోర్టును కోరారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ సమావేశాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. 'మోడీ ఇంటి పేరు' కేసులో ఈ మేరకు ఆయన సుప్రీంకోర్టులో తాజాగా అఫిడవిట్ దాఖలు చేశారు.కర్నాటకలో జరిగిన ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ.. 'దొంగలందరికీ మోడీ ఇంటి పేరే ఎందుకుంటుంది' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీనిపై గుజరాత్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోడీ పరువు నష్టం దావా వేశారు. దీంతో సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేండ్ల శిక్ష విధించింది. ఫలితంగా ప్రాతినిధ్య చట్టం కింద వయనాడ్ ఎంపీ పదవి కోల్పోయారు. సూరత్ కోర్టు ...9లో

చితికిన చిన్నారి..

స్కూల్ బస్సు కింది నలిగి మరణం

- బాచుపల్లిలో గుంతల రోడ్డుపై స్కిడ్ అయిన స్కూటీ



(ఫైల్)



నవతెలంగాణ- దుండిగల్

భారీ వర్షాలకు గుంతలమయమైన మహానగర రోడ్డు చిన్నారి ప్రాణం పోవడానికి కారణమైంది. ఇందుకు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు వేగమూ తోడైంది. రోడ్డుపై ...9లో

తలో దారిలో ఆర్ఆర్ఆర్

అసెంబ్లీకి కలిసిరావడం కష్టమే

- బీజేపీ ఎల్పీ నేత నియామకం ఇంకా పెండింగ్‌లోనే



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్ఆర్ఆర్ సినిమా పేరు సబ్‌టైటిల్ రౌద్రం..రుధిరం..రణం.తమ ముగ్గురు ఎమ్మెల్యేలు (రాజాసింగ్,రఘునందన్‌రావు, రాజేందర్) కూడా అసెంబ్లీలో ఆర్ఆర్ఆర్‌ను తలపించేలా ఉగ్రరూపం దాల్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతారని బీజేపీ గొప్పలకు పోయింది. ఆ సినిమా సబ్ టైటిల్‌లోని లక్షణాలేవీ వారిలో కనిపించట్లేదు. అసలు ఆ ముగ్గురూ అసెంబ్లీ సమావేశాల్లో కలిసిపోవడమనేదే కుదిరేటట్టు కనిపించడం లేదు. సస్పెండ్ అయిన రాజాసింగ్...బీజేపీ ఎల్పీ నేత పదవి ఇవ్వలేదన్న ఆగ్రహంతో రఘునందన్‌రావు, పేరుకే చేరికల కమిటీ చైర్మెన్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ తోకలు తగిలించి తనకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే నైరాశ్యంలో ఈటల రాజేందర్ ఉన్నారు. ఆ ముగ్గురూ ఎవరికి వారే ...10లో

జయసుధ చేరిక సరే... మా మాటేందంటున్న బండా 10లో

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,110	▲ 330
22 క్యారెట్లు	- 55,100	▲ 300
కిలో వెండి	- 80,300	▲ 700

చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 108
రిటైల్ (లైవ్)	రూ. 130
స్కిన్‌తో	రూ. 189
స్కిన్‌లెస్	రూ. 215

నీట మునిగిన పంటలు, దెబ్బతిన్న చెరువులు, రోడ్లు

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ నష్టం
- వివరాలను కేంద్ర బృందానికి వెల్లడించిన కలెక్టర్లు



నవతెలంగాణ - ములుగు/భూపాలపల్లి

భూపాలపల్లి, ములుగు, జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయని, చెరువులు, రోడ్లు దెబ్బతిన్నాయంటూ వాటి నష్టం వివరాలను బుధవారం కేంద్ర బృందానికి జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు వివరించారు. కేంద్ర బృందం.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలు, ఇండ్లు, రహదారులతో పాటు వివిధ శాఖలకు జరిగిన నష్టాన్ని వరద పరిస్థితులను పరిశీలించింది.

ములుగు జిల్లాలో జరిగిన నష్టాన్ని.. జిల్లా ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.. కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలోని 9 మండలాల్లో జులై 18 నుంచి 28 వరకు 776.3 ఎంఎం వర్షపాతం నమోదయిందన్నారు. 3135 ఎకరాల్లో వరి, పత్తి 3020 ఎకరాలు, మిర్చి 124 ఎకరాలు, హార్టికల్చర్ క్రాప్స్ 38 ఎకరాలు, శ్యాండ్ కాస్టింగ్ 1450 ఎకరాలు.. మొత్తంగా 7766 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. వరదల వల్ల 54 గ్రామాలు, 27 లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని వివరించారు. 17మంది మృతిచెందినట్టు తెలిపారు. 642 పశువులు మృత్యువాతపడ్డాయన్నారు. 10 చెరువులు దెబ్బతిన్నాయని, కెనాల్స్, బ్రిడ్జీలు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. పీఆర్ రోడ్లు 100.5 కి.మీ, ఆర్ అండ్ బీ రోడ్లు 24.05 కి.మీ, టీడబ్ల్యూఈ రోడ్లు 7.12 కి.మీ దెబ్బతిన్నాయన్నారు. 33 కేవీ 94, 11కేవీ 373, ఎల్టీ 621, డీటీఆర్ 172 విద్యుత్ పోల్స్ దెబ్బతిన్నాయన్నారు. 1829 కేజీల మత్స్య సంపద, 21 హెక్టార్లలో చేపల చెరువులు దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రయివేట్ బోట్లు, స్విమ్మర్లను అన్ని మండలాల్లో ఏర్పాటు చేశామన్నారు.

నిబంధనల మేరకే వరద నష్టం ప్రతిపాదనలు : భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందానికి జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా వరద నష్టాన్ని వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో నిబంధనల మేరకు వరద నష్టం అంచనాలను పకడ్బందీగా రూపొందించామని తెలిపారు. ఆరు మండలాల పరిధిలోని 32 గ్రామాలు దెబ్బతిన్నాయని, నలుగురు మృతిచెందారని, మరో వ్యక్తి గల్లంతయినట్టు చెప్పారు. పశువులు కోళ్లు కలిపి 1164 పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. జిల్లాలో 10,528 విద్యుత్ స్తంభాలు, 1532 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 23 సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయని, నీటిపారుదల శాఖకు సంబంధించి 162 నీటి వనరులు నష్టపోయాయని, 10 కి.మీ మేర ఆర్ అండ్ బీ రోడ్డు, 100 కి.మీ మేర పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. 15,690 ఎకరాల్లో వరి, 15,381 ఎకరాల్లో పత్తి, 2500 ఎకరాల్లో మిర్చి, 264 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. కేంద్ర బృందం టీం లీడర్, ఎన్‌డీఎంఏ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి మాట్లాడుతూ.. వరదల వల్ల జరిగిన నష్టంపై నిబంధనల ప్రకారం అంచనా వేస్తూ పకడ్బందీ నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. అయితే తక్షణ సాయంపై కేంద్ర బృందం హామీ ఇవ్వలేదు. మోరంచపల్లి గ్రామంలో కేంద్ర బృందం పర్యటించింది. కేంద్ర బృందంలో.. ఎన్డీఎంఏ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి (టీం లీడర్), డిప్యూటీ సెక్రటరీ అనిల్ గైరోలా, రీజనల్ ఆఫీసర్ కుష్వా, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి డైరెక్టర్ రమేష్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పూను స్వామి, హైదరాబాద్ ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ శ్రీనివాసులు, పవర్ భవ్య పాండే ఉన్నారు. సమావేశాల్లో వివిధ జిల్లాల సంబంధింత అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీపై కేంద్రం ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆర్డినెన్సును తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం ఇటీవల ప్రతిపాదించిన జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీ ప్రభుత్వం (సవరణ) బిల్లు-2023 గురించి తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు. దేశ పౌరుడిగా, రాజ్యాంగ విలువలను, సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకోవడం చాలా కీలకమనీ, అది ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని తాను నమ్ముతున్నానని తెలిపారు. ప్రతిపాదిత బిల్లు ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (ఎన్‌సీటీడీ)లో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను బలహీన పరుస్తూ, నగర ప్రభుత్వంలో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు సంపూర్ణ నియంత్రణను మంజూరు చేయడానికి ప్రయత్నిస్తున్నదని వివరించారు. ఈ చర్యను ఆమోదించడానికి అనుమతిస్తే ఎన్నికైన ప్రతినిధులకు ఇచ్చిన ప్రజాస్వామ్య ఆదేశాన్ని బలహీన పరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలకు కేంద్రం నిర్ణయం విరుద్ధమని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయం, సంగారెడ్డి

టెండరు ప్రకటన

లేఖ సంఖ్య 457/ఎస్5/2020, తేది: 31.07.2023

తెలియచేయునదేమనగా సంగారెడ్డి రేంజ్ విభాగము సంగారెడ్డి జిల్లా నల్లవల్లి మరియు మంబాపూర్ రిజర్వు ఫారెస్ట్ గుమ్మడిదల పరిధిలో పురపాలక వ్యర్థల శుద్ధి మరియు పారవేసే సౌకర్యము కొరకు వివిధ రకాల (453) చెట్ల నరికివేత కొరకు ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. టెండర్ ఫారాము కార్యాలయ పని వేళల్లో స్వీకరించగలరు.

మిగతా వివరములకు 9573870666 dfosangareddy@gmail.com ను సంప్రదించగలరు.

సం/- జిల్లా అటవీశాఖాధికారి

DIPR R.O.No. 1182-DP/CL/ADVT/1/2023-24, Dt. 02-08-2023

తెలంగాణ ప్రభుత్వం
ఆసక్తి వ్యక్తీకరణ

ఐ2/వెహికిల్స్/ఐఓఐ/2023, తేది:.... -07-2023

దిగువ పేర్కొన్న సంతకందారు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పనుల నిర్వహణ నిమిత్తం ఆసక్తి వ్యక్తీకరణ కోసం వాహనాల యొక్క సరఫరాను తయారీ ఏజెంట్ల నుంచి లేదా అధీకృత డీలర్ల నుంచి ఆహ్వానిస్తున్నారు. 1) వాటర్ ట్యాంకర్లు (25000 లీటర్లు) 2)ఇచ్చిన 3) స్వచ్ఛ ఆటోలు 4) స్ట్రీట్ క్లీనింగ్ మెషీన్ 5) గార్బేజ్ సీవింగ్ మెషీన్ 6) నిర్మితమైన ఫాగింగ్ మెషీన్ 100 లీటర్ సామర్థ్యం 7) ఎర్త్ మూవర్ ఎక్స్‌కవేటర్ 8) బ్లోవర్ మెషిన్ 9) ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనం 10) శానిటరీ వాష్ట్‌మెన (200లీ) 11) 10కిలోల సామర్థ్యమున్న పల్వరైజర్ మెషిన్. ఆసక్తి కలిగిన ఏజెన్సీలు వారి యొక్క ఫైనాన్షియల్ ఆఫర్‌ను (సీల్డ్ కొటేషన్లలో) వివరాలతో పాటుగా సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలను మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ వారి చిరునామాకు 05-08-2023 తేదీన ఉదయం గం.11-00 లోపు చేరే విధంగా పంపించాలి. ఎలాంటి కారణాలను చూపకుండా ప్రతిపాదనలను అంగీకరించడం లేదా రద్దు చేసే అధికారం మున్సిపల్ కమిషనర్‌కు ఉంటుందని తెలియజేయడమైనది. ఆసక్తి కలిగిన కొటేషన్ల కోసం దయచేసి 9849905920 నెంబర్‌లో సంప్రదించి పూర్తి వివరాలను పొందవచ్చును.

సం/- కమిషనర్
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

DIPR R.O.No.4910-PP/CL/ADVT/1/2023-24, Dt.02-08-2023

ఆగస్టు 15 నుంచి 'డబుల్' ఇండ్ల పంపిణీ

మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరే.. : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-వనస్థలిపురం



జీవో 118 కింద పట్టాల పంపిణీ

ఆగస్టు 15 నుంచి డబుల్ బెడ్‌రూమ్స్ పంపిణీ మొదలెట్టి అక్టోబర్‌లోగా లక్ష ఇండ్ల పంపిణీ పూర్తి చేస్తామని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అత్యంత ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని చెప్పారు. హైదరాబాద్ ఎల్బీనగర్ నియోజకవర్గంలో జీవో నెం.118 కింద రెగ్యులరైజ్ చేసి పట్టాలను బుధవారం వనస్థలిపురం జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యను 118 జీవోతో పరిష్కరించినట్టు తెలిపారు.

ఇందులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి చాలా ఉందని చెప్పారు. దీని వల్ల 18 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇండ్లు ఇస్తామన్న హామీని నెరవేర్చుకుంటాపోతుంటే.. పనీ పాట లేని కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆగస్టు 15 నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీని ప్రారంభిస్తామని, అక్టోబర్‌లోపు లక్ష ఇండ్ల పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు.

పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. సంక్షేమ కార్యక్రమాలే కాకుండా, శాశ్వత సమస్యల పరిష్కారంపై ముందుకు సాగుతున్నామన్నారు. కరోనా అనంతరం ప్రతి ప్రాంతంలో అత్యాధునిక ఆస్పత్రుల నిర్మాణం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే.. వారిని ప్రజలు వదులుకోరని, రాష్ట్రానికి మూడో ముఖ్యమంత్రిగా కేసీఆరే ఉంటారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాచకొండ సీపీడీఎస్ చౌహన్, బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్, అమరవాది లక్ష్మీనారాయణ, జీహెచ్ఎంసీ కమిషనర్, సుష్మ, గజ్జల మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి డివిజన్ల అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి, వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, మాజీ కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

టెట్ దరఖాస్తుల స్వీకరణ షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. టెట్ నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసిన విషయం తెలిసిందే.

దరఖాస్తుల సమర్పణ కు తుది గడువు ఈనెల 16 వరకు ఉన్నది. వచ్చేనెల 15న టెట్ రాతపరీక్షను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలుంటాయి. ఇతర వివరాలకు https://tstet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. మొదటిరోజు 16 వేల మంది దరఖాస్తు చేసినట్టు సమాచారం.

మద్యం షాపులకు రేపే నోటిఫికేషన్

- ఈనెల 21న లాటరీ
- షెడ్యూల్ ప్రకటించిన ఆబ్కారీ శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 2023-25 సంవత్సరానికిగాను మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి ఆబ్కారీ శాఖ కసరత్తు చేస్తున్నది. ముందుగా ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు సంబంధించిన షాపులను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో గుర్తించనున్నారు. అనంతరం లైసెన్స్‌ల జారీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 4న జారీచేయనుంది. ఆ రోజు నుంచే దరఖాస్తులను స్వీకరించనున్నది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 18వ తేదీ సాయంత్రం 6గంటలకు ముగియనుంది. 21వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లాటరీ ద్వారా దుకాణాలను అధికారులు కేటాయించనున్నారు. లైసెన్స్ ఫీజులో మొదటి వాయిదాను 21, 22 తేదీల్లో చెల్లించాలని ఆబ్కారీ శాఖ నిర్ణయించింది. అయితే లాటరీ ద్వారా దక్కించుకున్న కొత్త షాపులకు నవంబర్ 30 తర్వాతనే స్టాక్ పంపించాలని, డిసెంబర్ 1న వాటిని తెరవాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది.

PRISM JOHNSON LIMITED

CIN : L26942TG1992PLC014033

Registered Office : 305, Laxmi Niwas Apartments, Ameerpet, Hyderabad - 500 016
Phone : +91-40-23400218 ; Fax : +91-40-23402249
e-mail : investor@prismjohnson.in ; website : www.prismjohnson.in
Corporate Office : Rahejas, Main Avenue, V. P. Road, Santacruz (West), Mumbai - 400 054

EXTRACT OF CONSOLIDATED UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED JUNE 30, 2023

₹ Crores

Particulars	Unaudited Quarter ended		Audited Year ended
	June 30, 2023	June 30, 2022	March 31, 2023
Total Income from operations	1,942.15	1,811.17	7,360.52
Net Profit/(Loss) before share in Profit of Associates & Joint Ventures, Exceptional item and Tax	24.57	(10.09)	(180.60)
Net Profit/(Loss) for the period before tax and after Exceptional item	27.34	(7.30)	(177.79)
Net Profit/(Loss) for the period after tax	20.76	(16.01)	(157.73)
Total Comprehensive Income/(Loss) for the period *(comprising profit/(loss) for the period after tax and other comprehensive income after tax)*	29.25	(33.93)	(182.71)
Paid-up Equity Share Capital (Face value ₹ 10/- per share)	503.36	503.36	503.36
Reserves	725.63	819.81	703.33
Net Worth	1,228.99	1,323.17	1,206.69
Earnings Per Share (of ₹ 10/- each) (Not Annualised) Basic & Diluted (₹)	0.36	0.19	-2.05
Outstanding Debt	1,446.72	1,571.55	1,467.65
Capital Redemption Reserve	12.69	12.69	12.69
Debt Service Coverage Ratio (times)	1.25	1.94	0.99
Interest Service Coverage Ratio (times)	3.79	3.37	2.33
Debt - Equity Ratio (times)	1.18	1.19	1.22

Notes :

(1) Key Standalone Financial information :

₹ Crores

Particulars	Unaudited Quarter ended		Audited Year ended
	June 30, 2023	June 30, 2022	March 31, 2023
Total Income from operations	1,792.06	1,639.83	6,711.46
Net Profit/(Loss) before Tax	13.71	43.87	(84.18)
Net Profit/(Loss) after Tax	10.26	32.83	(58.86)

(2) The above is an extract of the detailed format of Unaudited Financial Results filed with the Stock Exchanges under Regulations 33 and 52 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the Unaudited Financial Results is available on the Stock Exchange's websites viz. www.nseindia.com, www.bseindia.com and on the Company's website www.prismjohnson.in.

(3) For other line items referred in Regulations 52(4) and 54(3) of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, pertinent disclosures have been made to the Stock Exchanges and can be accessed on the Stock Exchange's websites viz. www.nseindia.com, www.bseindia.com and on the Company's website www.prismjohnson.in.

For and on behalf of the Board of Directors

Place : Mumbai
Date : August 2, 2023

Vijay Aggarwal
Managing Director

PRISM CEMENT दूर की सोच | JOHNSON Not just tiles, Lifestyles. | PRISM RMC Complete Concrete Solutions

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం-VI

(సబ్ రూల్(1) ఆఫ్ రూల్ 19-సెక్షన్11(1) ఆఫ్ ది యాక్ట్ 30/2013 చూడుము)

ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టర్ ఫైల్ సంఖ్య జి/2430/2021 తేది: 27.07.2023
ఆర్‌డీఓ. ఫైల్ సంఖ్య సి/1435/2021 తేది: 21.07.2023
గెజిట్ సంఖ్య 36/2023 తేది: 27.07.2023

తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇరిగేషన్ డివిజన్-2 తిరుమలగిరి, సూర్యాపేట గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారం ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్ట పరచిన నాగారం మండలం, డి-కొత్తపల్లి గ్రామ శివారులో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.7.1475 గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా 6ఆర్ ట్రైల్ ఎండ్ డిబియం70. 2ఆర్/6ఆర్/డిబియం70 & 1ఎల్/7ఆర్/డిబియం70 ఆఫ్ ఎస్ఆర్ఎస్పి స్టేజ్-II కాకతీయ మెయిన్ కెనాల్ విస్తరణ కొరకు అవసరమైనది భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్దమైన పరిహారాన్ని పొందు హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీచేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్దమైన పరిహారాన్ని పొందు హక్కు చట్టం, 2013 (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21 ఆఫ్ 2017)ను అనుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున నాగారం మండలం డి-కొత్తపల్లి గ్రామ శివారు పరిధిలో ఉన్న విస్తీర్ణం ఎ.7.1475 గుంటలు మరియు ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము: డి-కొత్తపల్లి మండలం: నాగారం జిల్లా: సూర్యాపేట

6ఆర్ ట్రైల్ ఎండ్ ఆఫ్ డిబియం70 ఆఫ్ ఎస్ఆర్ఎస్పి స్టేజ్-II

షెడ్యూల్

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూయజమాన్య రకం	భూమి రకము	సేకరించవలసిన భూమి	పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు	హద్దులు ఉ	హద్దులు ద	హద్దులు తూ	హద్దులు ప	చెట్లు/ నిర్మాణములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	122	పట్టా	ఖుష్కి	0.0375	గుంటకండ్ల రామ చంద్రా రెడ్డి తండ్రి లచ్చి రెడ్డి (పట్టా)	124 126	123	126 127	123	పామాయిల్ చెట్లు -3 ఎర్ర చందనం చెట్లు-1 టేకు చెట్లు-3 వేప చెట్లు-2
2	124	పట్టా	ఖుష్కి	0.3375	కట్లా శేఖర్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి (పట్టా)	147 124	126 123	128 126	124 123	మామిడి చెట్లు -6 సిల్వర్ ఓక్ చెట్లు-10 టేకు చెట్లు-6 వేప చెట్లు-14 చింత చెట్లు-1 నారా చెట్లు-2
3	126	పట్టా	ఖుష్కి	0.0625	గుంటకండ్ల రామ చంద్రా రెడ్డి తండ్రి లచ్చి రెడ్డి (పట్టా)	124 126	123 127	126	123	పామాయిల్ చెట్లు -6
4	127	పట్టా	ఖుష్కి	0.3750	గుంటకండ్ల రామ చంద్రా రెడ్డి తండ్రి లచ్చి రెడ్డి (పట్టా)	126	113 112	127	123 127	వేప చెట్లు-3
5	147	పట్టా	ఖుష్కి	0.0950	కట్లా శేఖర్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి (పట్టా)	148	124	146	147	
6	148	పట్టా	ఖుష్కి	0.1725	కట్లా శేఖర్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి (పట్టా)	152	148	145	149	మామిడి చెట్లు -1, కుంకుడు చెట్లు-4 సిల్వర్ ఓక్ చెట్లు-6 టేకు చెట్లు-8 వేప చెట్లు-4
7	149	పట్టా	ఖుష్కి	0.11	గుంటకండ్ల రమేశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి (పట్టా)	150	149	148	149	సీతాఫలం-6
8	150	పట్టా	ఖుష్కి	0.1550 0.0600 0.0425 0.0450	గుంటకండ్ల రమేశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి (పట్టా) బానోత్ సోమప్ప సోమి భర్త సోమ్లా (పట్టా) మాలోతు శ్రీలాల్ తండ్రి సోమ్లా (పట్టా) బానోతు మంగమ్మ భర్త బాషా (పట్టా)	2 శి	149	150	150	
				3.2725						

2ఆర్/6ఆర్/ డిబియం70 ఆఫ్ ఎస్ఆర్ఎస్పి స్టేజ్-II

షెడ్యూల్

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూయజమాన్య రకం	భూమి రకము	సేకరించవలసిన భూమి	పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు	హద్దులు ఉ	హద్దులు ద	హద్దులు తూ	హద్దులు ప	చెట్లు/ నిర్మాణములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	124	పట్టా	ఖుష్కి	0.32	గుంటకండ్ల రమేశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి (పట్టా)	149 147	124	124	124	పామాయిల్ చెట్లు-27
2	149	పట్టా	ఖుష్కి	0.0550	గుంటకండ్ల రమేశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి (పట్టా)	150	147 124	149	149	
3	150	పట్టా	ఖుష్కి	0.0525	గుంటకండ్ల రమేశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి (పట్టా)	150	149	150	150	
		మొత్తం:		1.0275						

1ఎల్/7ఆర్/ డిబియం70 ఆఫ్ ఎస్ఆర్ఎస్పి స్టేజ్-II

షెడ్యూల్

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూయజమాన్య రకం	భూమి రకము	సేకరించవలసిన భూమి	పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు	హద్దులు ఉ	హద్దులు ద	హద్దులు తూ	హద్దులు ప	చెట్లు/ నిర్మాణములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	159	పట్టా	ఖుష్కి	0.0550 0.0700 0.0150 0.0500	షేక్ చాంద్ సాహెబ్ తండ్రి పకీర్ సాబ్(ప) షేక్ కమల్ తండ్రి సుభాన్ సాబ్(అ) మోదాల రామలమ్మ తండ్రి రాములు (ప) మోదాల పాపమ్మ తండ్రి వీరయ్య (అ) మోదాల రవీందర్ తండ్రి లింగయ్య (పట్టా) మోదాల రాం మూర్తి తండ్రి లింగయ్య (ప) మోదాల రామలింగం తండ్రి లింగయ్య (అ)	159 163	159	160 163	159	
2	160	పట్టా	ఖుష్కి	0.0650	షేక్ ఉదారబడిసాహెబ్ తండ్రి అక్బుసాబ్ (ప) మోదాల పాపమ్మ తండ్రి వీరయ్య (అ)	160 162	159 160	162	159	
3	162	పట్టా	ఖుష్కి	0.0900 0.0150 0.0100	ఊకోటి వంగోష్ చారి తండ్రి యశానందచారి(ప) మోదాల పాపమ్మ తండ్రి వీరయ్య (అ) మోదాల రాంమూర్తి తండ్రి లింగయ్య (అ) మోదాల రవీందర్ తండ్రి లింగయ్య (అ)	162	162	163	160	
4	163	పట్టా	ఖుష్కి	0.0875 0.1425	మోదాల రాంమూర్తి తండ్రి లింగయ్య (అ) మోదాల రామలింగం తండ్రి లింగయ్య (పట్టా)	163	159	163	162	
5	165	పట్టా	ఖుష్కి	0.0775 0.1050 0.0250	బొడ్డు వీరయ్య తండ్రి మల్లయ్య (పట్టా) మోదాల అనూష భర్త రవీందర్ (పట్టా) గైగుళ్ళ వీరమల్లు తండ్రి సత్తయ్య(పట్టా)	165	167	165	166	
6	167	పట్టా	ఖుష్కి	0.2150	గైగుళ్ళ సత్తయ్య తండ్రి వీరమల్లు (ప) గైగుళ్ళ వీరమల్లు తండ్రి సత్తయ్య (అ)	165	171 178	167 178	167	
7	171	అసైన్డ్ పట్టా	ఖుష్కి	0.0400 0.0250 0.0250	బొజుగాని సర్వయ్య తండ్రి అంజయ్య (ప) గైగుళ్ళ వీరమల్లు తండ్రి సత్తయ్య (అ) రావుల పెద్ద లింగయ్య తండ్రి మల్లయ్య(పట్టా) రావుల చిన్న లింగయ్య తండ్రి మల్లయ్య (పట్టా)	167 178	183	171 178	171	
8	178	పట్టా	ఖుష్కి	0.0650	గైగుళ్ళ వీరయ్య తండ్రి యెల్లారెడ్డి (ప) గైగుళ్ళ వీరమల్లు తండ్రి సత్తయ్య (అ)	167	171	178	167 171	
			మొత్తం	2.2475						

ఇట్టి ప్రకటన భూసేకరణ, పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్దమైన పరిహారాన్ని పొందేహక్కు చట్టం, 2013 (నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారము చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి సూర్యాపేట గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారు రాజస్వ మండలాధికారి సూర్యాపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణ సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేయుటకు అనుమతించనైనది. సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణ ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరమున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి సూర్యాపేట గార్లకు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీచేసి (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారికి లిఖిత పూర్వకముగా తెలియచేయవలయును.

సం/- రాజస్వ మండలాధికారి, సూర్యాపేట | సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట | సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR Ro.No.518/LA-PP/Advt/Pub/2023-24

వరద సవాల్..!



ఎమ్మెల్యేలకు ముంపు చిక్కులు

- శాశ్వత పరిష్కారానికి డిమాండ్
- మున్నేరుపై ఆర్‌సీసీ వాల్ సాకారమేనా..?
- గోదావరి ముంపు ఊసేలేని క్యాబినెట్ భేటీ
- వరద తక్షణ సాయంపైనా విమర్శలు
- అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు వచ్చేనా..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జులై 18 నుంచి మొదలైన వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. 27వ తేదీ నుంచి భారీగా వరదలు పోటెత్తడంతో ఖమ్మం జిల్లా మున్నేరు పరివాహక ప్రాంతం.. అటు కొత్తగూడెం జిల్లాలోని గోదావరి పరిసరాలు ముంపు బారిన పడిన విషయం తెలిసిందే. ఇటీవల క్యాబినెట్ భేటీలో ముంపు బాధితులకు తక్షణ సహాయార్థం రూ.500 కోట్లు కేటాయించింది. కానీ ఇవి ఏమేరకు సరిపోతాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గురువారం నిర్వహించే చిట్టచివరి అసెంబ్లీ సమావేశాల్లోనైనా ఉమ్మడి ఖమ్మం జిల్లా నదీ తీర ప్రాంత వాసుల సమస్యలు పరిష్కారం అవుతాయో.. లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి. ఈ సమావేశాల్లో ఏ మేరకు ముంపు ప్రాంత ఎమ్మెల్యేలు మాట్లాడతారు.. శాశ్వత పరిష్కారం చూపుతారు అనే ప్రశ్నలకు సమాధానం కోసం వరద బాధితులు ఎదురుచూస్తున్నారు.

మున్నేరుకు అడ్డుగోడ సాకారమయ్యేనా..?

ఖమ్మం నగరానికి సరిహద్దున ఉన్న మున్నేరు పరివాహంలోనూ ఇటీవల వరదలు భారీగా పోటెత్తాయి. 2005లో ఎగువన బయ్యారం, పదుల సంఖ్యలో చెరువులకు గండ్లు పడటంతో ఉగ్రరూపం దాల్చిన మున్నేరు చేసిన నష్టానికన్నా ఈసారి రెట్టింపు స్థాయిలో ముంపు సంభవించింది. నగరానికి ఎగువన రెండు, మూడుచోట్ల చెక్‌డ్యాంలు నిర్మించినా అవీ వరదలను నియంత్రించలేకపోయాయి. మున్నేరు ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో పైన ఏ చెరువుకూ గండిపడకపోయినా ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లోని మూడువేలకు పైగా ఇండ్లు జలమయమయ్యాయి. పదివేల మందికి పైగా ప్రజలు ముంపు బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన క్యాబినెట్ భేటీలో మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ మంజూరు చేస్తూ రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. గతంలో పలుమార్లు కరకట్ట గురించి హామీ ఇచ్చినప్పటికీ అది కలగానే మిగిలింది. టీడీపీ హయాంలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నప్పుడు కరకట్టలకు ప్రతిపాదనలు పంపించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ప్రతిపాదనలు వెళ్లాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా మాజీ మంత్రి తుమ్మల, ప్రస్తుత మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సీఎం, కేటీఆర్‌లలో ఎవరూ వచ్చినా కరకట్టల విషయం ప్రస్తావించారు. రెండేండ్ల క్రితం కార్పొరేషన్ ఎన్నికల ముందు మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత వెంటనే రూ.146 కోట్లు కేటాయిస్తూ అనుమతులు జారీ చేశారు. కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇలా మూడు దశాబ్దాలుగా మున్నేరుకు అడ్డుగోడ కలగానే మిగిలింది. ఇప్పుడు కూడా సాకారం అవుతుందో లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి.

మంత్రి, ఎమ్మెల్యేలు చొరవ చూపాలి..



అటు గోదావరి, ఇటు మున్నేరు కరకట్టల విషయంలో ఉమ్మడి జిల్లా మంత్రి, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, భద్రాచలం, పాలేరు ఎమ్మెల్యేలు పోడెం వీరయ్య కందాల ఉపేందర్‌రెడ్డి చొరవ చూపి కరకట్టలపై ఈ అసెంబ్లీ సమావేశాల్లో గట్టిగా మాట్లాడాలి. నష్టాల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ముంపు వాసులకు ప్రభుత్వం కేటాయించిన తక్షణ సహాయం రూ.500 కోట్లను మూడింతలు పెంచాలి.

- నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి

వరదల నియంత్రణకు శాశ్వత పరిష్కారం లేదా..?

సాధారణంగా భద్రాచలానికి ఆగస్టులో భారీగా వరదలు పోటెత్తుతాయి. కానీ ఈ ఏడాది జూన్, జులైలోనే గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వానలతో వరదలు పోటెత్తాయి. పోలవరం ఎత్తు పెంచడం.. కాపర్ డ్యామ్ నిర్మాణంతో బ్యాక్‌వాటర్ భద్రాచలం వరకు ఎగపోటు వేస్తున్నా కేంద్ర జలమండలి, రాష్ట్ర ప్రభుత్వాలు దాని ప్రస్తావనే తేవడం లేదు. రెండు, మూడేండ్లుగా కొద్దిపాటి వర్షానికే భద్రాచలం జలమయం అవుతుండటం.. మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలో నీరు ప్రవహిస్తున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు.

భద్రాచలం వరదలకు కరకట్టల నిర్మాణం అసాధ్యమని జలసౌధలో మంగళవారం నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్షలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ చేసిన ప్రకటన వల్ల ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది వరదల సందర్భంగా భద్రాద్రిలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వరదల నియంత్రణ, భద్రాద్రి అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానన్న హామీ అమలుకాలేదు. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలోనూ భద్రాచలం వరదల ఊసే ఎలేకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తంతో ఉన్నారు.

తెలంగాణలో వరద నష్టాన్ని పూడ్చండి

- పది లక్షలకు పైగా పంట నష్టం
- కేంద్ర వ్యవసాయ మంత్రికి లేఖ : మీడియాతో హన్నన్ మొల్లా, బి. వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో వరద నష్టాన్ని పూడ్చాలని ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు హన్నన్ మొల్లా (ఏఐకేఎస్), బి.వెంకట్ (ఎఐఏడబ్ల్యూయూ) సంయుక్తంగా లేఖ రాశారు. అనంతరం ఏపీ, తెలంగాణ భవన్‌లో హన్నన్ మొల్లా మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఇటీవలి వచ్చిన వరదలతో పది జిల్లాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాగునీటి సమస్య ఏర్పడిందని, రోడ్లు కొట్టుకుపోయాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వరద సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. పది లక్షలకు పైగా పంట నష్టం జరిగిందని, 40 మంది చనిపోయారని తెలిపారు.

ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఎఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. వరదల వల్ల తెలుగు రాష్ట్రాలు భారీగా నష్టపోయాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు రాష్ట్రాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశంలోనే అధికంగా వరి పండించే తెలుగు రాష్ట్రాల్లో వచ్చిన వరదల గురించి కేంద్రం కనీసం స్పందించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అంటే గుజరాత్ ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. జీఎస్టీ పేరుతో లక్షల కోట్లు తీసుకుని రాష్ట్రానికి కష్టం వచ్చినపుడు నిధులు ఇవ్వరా? అని ప్రశ్నించారు. వరదలు సంభవించిన రాష్ట్రాల్లో పరిస్థితి దారుణంగా ఉందని, వ్యవసాయ పంటలకు భారీగా నష్టం జరిగిందని అన్నారు. విపత్తు సహాయ నిధి నుంచి, పిఎం కేర్ నిధి నుంచి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వరదలు సంభవించిన రాష్ట్రాల్లో పర్యటించి నష్టంపై అంచనా వేసి వరద సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సినీనటులను పార్టీలు చేర్చుకునే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకోవడంలో లేదని విమర్శించారు. తెలంగాణకు కేంద్ర మంత్రి ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు.

అర్హత లేని వారు మందులిస్తే రూ.ఐదు లక్షల జరిమానా

- డాక్టర్ సంజయ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మసీ, మెడికల్ షాపుల్లో అర్హత లేని వ్యక్తులు, నకిలీలు ప్రజలకు మందులిస్తే అత్యధికంగా రూ.ఐదు లక్షలకుపైగా జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష పడుతుందని తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ సంజయ్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు లోక్ సభ ఆమోదించిన జన్ విశ్వాస్ బిల్లు ఫార్మసీ చట్టం 1948లోని సెక్షన్ 42 ఉల్లంఘిస్తే మూడు నెలల జైలు శిక్ష, రూ.2 లక్షల వరకు జరిమానా విధించవచ్చని తెలిపారు. ఫార్మసీ యాక్ట్ 1948 ప్రకారం... ఫార్మసీల్లో ఫార్మసిస్టుల (ఔషద నిపుణుల) ద్వారా మాత్రమే నాణ్యమైన మందులను తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. జన్ విశ్వాస్ బిల్లు డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టంలోని 27డీ ప్రకారం... ఫార్మసీలు, మెడికల్ దుకాణాల్లో అర్హత లేని వ్యక్తులు, నకిలీలు ప్రజలకు మందులిస్తే రూ.ఐదు లక్షలు, అంతకన్నా ఎక్కువ జరిమానా విధిస్తారని హెచ్చరించారు.

బాధితులు అభద్రతాభావానికి లోనుకావొద్దు

- కష్టసుఖాల్లో ఎల్లవేళలా అండగా సీపీఐ(ఎం) ఉంటుంది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

వరద బాధితులు అభద్రతాభావానికి లోనుకావొద్దని, మీ కష్టసుఖాల్లో సీపీఐ(ఎం) అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హన్మకొండ పట్టణంలో ముంపునకు గురైన గుడిసెవాసులను పరామర్శించారు. వారికి సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యాలయంలో బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. జిల్లాలో వారం రోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక భూపోరాటాల్లోని చాలా మంది ఆశ్రయం కోల్పోయారన్నారు. గుడిసెల్లోకి వరద నీరు వచ్చి బియ్యం, నిత్యావసర సరుకులు, బట్టలు తడిచి పూర్తిగా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బీభత్సం కారణంగా నగరం అతలాకుతలమై పలు కాలనీల్లో ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, వారందరినీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, కట్టలు మరమ్మతులు చేయాలని కోరారు. కాలువలు ఆక్రమించి నిర్మించిన వాటిని తొలగించాలని, భవిష్యత్తులో వరద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సూదర్శన్, జిల్లా కన్వీనర్ చక్రపాణి, జిల్లా నాయకులు ఎస్.వాసుదేవరెడ్డి, జి.ప్రభాకర్ రెడ్డి, ఎం.చుక్కయ్య, టీ.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, మంద సంపత్, కె.లింగయ్య, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం ఆదివాసుల పోరుయాత్ర



- 12 కి.మీ పాదయాత్రగా.. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-చర్ల

తాగునీటి కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని కలివేరు పంచాయతీ రాజబల్ కాలనీ ఆదివాసీలు పోరుబాట పట్టారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలివేరు రజబలి కాలనీ నుంచి చర్ల ఎంపీడీవో కార్యాలయం వరకు సుమారు 200 మంది ఆదివాసులు ఖాళీ బిందెలతో, ఎర్రజెండా చేతబట్టి సుమారు 12 కి.మీ పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మండల ప్రజా పరిషత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి మాట్లాడుతూ.. ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులు ఏమయ్యాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాలకు మిషన్ భగీరథ పైప్ లైన్లు వేయకుండానే బిల్లులు మాయం చేశారని విమర్శించారు. వెంటనే కాలనీకి మిషన్ భగీరథ పైప్ లైన్లు వేసి ప్రతి ఇంటికి నీరు సరఫరా చేయాలని, అలాగే, రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసులకు అండగా సీపీఐ(ఎం) పోరాడుతుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలు, వలస ఆదివాసుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు జిలకర పద్మ, మండల కార్యదర్శి కారం నరేష్, జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు, తాళ్లూరి కృష్ణ, కొమరం కాంతారావు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు కావాలి

- నూతన మోటార్ వాహన చట్టం -2019ను రద్దు చేయాలి : ఆల్ ఇండియా కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య



నవతెలంగాణ- యాదగిరి గుట్ట

రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని మున్నురుకాపు సంఘం భవనంలో రాష్ట్ర కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం అధ్యక్షత బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశ వ్యాపితంగా ఎనిమిది కోట్ల మంది రవాణా రంగంలో పనిచేస్తున్నారని, నిత్యం ప్రమాదాలకు గురవుతూ ఎంతో మంది చనిపోతున్నారని తెలిపారు. 2019లో లక్షా 54 వేలమంది, గంటకు 17 మంది కార్మికులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని తెలిపారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మోటార్ వాహన చట్టం - 2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసేవిధంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ఉపసంహరించే వరకు కార్మికులు పెద్దఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ బాబు, రుద్ర కుమార్, కోటయ్య రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులు పున్నం రవి, రవికుమార్, విజేందర్, యాదాద్రి జిల్లా అధ్యక్షులు యండి పాషా, నాయకులు కుమాస్వామి, గోవర్ధన్, రాజమౌళి, నాగరాజు, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

సర్కార్‌కు జీపీ కార్మికుల పొర్లుదండాలు

- దమ్మపేటలో పోటీ కార్మికులతో పని చేయించే యత్నం అడ్డుకున్న పంచాయతీ కార్మికులు

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం కోసం సుమారు నెల రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం సర్కార్‌కు పొర్లు దండాలు పెట్టారు. "మాతో వెట్టిచాకిరీ చేయించుకోని.. మా కడుపులు మాడ్చుతారా" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపకపోగా.. పలుచోట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులు పోటీ కార్మికులతో పని చేయించేందుకు యత్నించగా కార్మికులు అడ్డుకున్నారు.

నల్లగొండ జిల్లా చండూరులో దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. మునుగోడులో కార్మికులు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో కార్మికులకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాండ్లపల్లి మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించారు. దమ్మపేటలో పోటీ కార్మికులను అడ్డుకున్నారు. అశ్వారావుపేటలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు.

శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

- వరంగల్, హన్మకొండ జిల్లాల వరద ప్రాంతాల్లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్
- 'రెడ్ క్రాస్' ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ



నవతెలంగాణ- హనుమకొండ/ఎన్జీఓస్‌కాలనీ/మట్టెవాడ/హనుమకొండ చౌరస్తా


భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఈ ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రభుత్వానికి సూచించనున్నట్టు రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ తెలిపారు. హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ బుధవారం పర్యటించి పరిశీలించారు. ఉదయం 8:30 గంటలకు ఎన్ఐటీకి చేరుకున్న గవర్నర్‌కు హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఆర్డీఓలు రమేష్ కుమార్, వాసు చంద్ర స్వాగతం పలికారు. అలాగే, వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్, పాలకవర్గ సభ్యులు గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అక్కడి నుంచి శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వరంగల్, హన్మకొండలోని జవహర్ నగర్, నయీమ్ నగర్, భద్రకాళి బండ్, ఎన్టీఆర్ నగర్, ఎస్.ఎస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద నష్టం వివరాలను గవర్నర్‌కు అధికారులు వివరించారు. భద్రకాళి చెరువు కట్ట మరమ్మతు పనులు, నయీమ్ నగర్ పెద్ద మోరి నాలాను పరిశీలించారు. ఎన్టీఆర్ నగర్ బృందావన కాలనీలో మోకాలు లోతు నీటిలో నడుస్తూ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ అందించిన హెల్త్ కిట్స్, నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవహర్ నగర్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా పేరున్న వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన పాలకుల నిర్లక్ష్యమే నేడు ఈ నష్టానికి కారణమని విమర్శించారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు వరంగల్, హన్మకొండ నగరాల్లో అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, అక్కడి ప్రజలను ఆదుకునేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానిక రెడ్ క్రాస్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశానని తెలిపారు. అనేక ముంపు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరదలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా నగరాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని, తక్షణ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాయమందేలా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్, అధికారులు తదితరులు ఉన్నారు.

కస్తూర్బాలో కండ్ల కలక

- వైద్య శిబిరం ఏర్పాటు
- పాఠశాలల్లో వేగంగా ప్రబలుతున్న వ్యాధి

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం



నల్లగొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో కండ్ల కలక కలకలం రేపుతోంది. నారాయణపురం, సర్వేలు, శేరిగూడెం, గుజ్జ జనగాం తదితర గ్రామాల్లో ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు కండ్ల కలకతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలతో పాటు సర్వేల గ్రామంలోని బాలుర వసతి గృహం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కండ్ల కలక ప్రబలింది. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో మొత్తం 200 మంది విద్యార్థినులు ఉండగా.. 15 మందికి కండ్ల కలక వచ్చిందని ప్రిన్సిపాల్ శివరంజని తెలిపారు. ఇందులో ఐదుగురికి తీవ్ర ఇబ్బంది ఉన్నందున ఇండ్లకు పంపించినట్టు చెప్పారు. బుధవారం పీహెచ్‌సీ డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలు అందించారు. కండ్ల కలకలు వచ్చినవారు మిగతా విద్యార్థులకు దూరంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడూ చేతులను సబ్బుతో కడుక్కోవాలని, కండ్ల అద్దాలు పెట్టుకుంటే మంచిదని సూచించారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య క్యాంపులు నిర్వహించి మందులు అందజేస్తామని డాక్టర్ జ్యోత్స్న తెలిపారు.

నల్లమల్లలో పోడు రగడ

- రైతులను అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ- అచ్చంపేట

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమలలో పోడు వివాదం మళ్లీ రాజుకుంది. అటవీ శాఖ అధికారులు, పోడు రైతుల మధ్యన ఘర్షణ జరిగింది. కొన్నేండ్లుగా అక్కడ పోడు ఘర్షణ కొనసాగుతోంది. మండల పరిధిలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది దళితులు తాటి చేలుక అడవి ప్రాంతంలో పోడు సాగు చేసేవారు. మూడేండ్లుగా అటవీశాఖ అధికారులు నిబంధనల పేరుతో వారిని సాగు చేయకుండా అడ్డంకులు సృష్టించారు. దాంతో ఆ పొలాల్లో ఎవరూ సాగు చేయలేదు. అయితే, ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అటవీశాఖ అధికారులతో మాట్లాడి పోడు రైతులను సాగు చేసుకోనివ్వాలని చెప్పారు. దాంతో తాటిచెలక ప్రాంతంలో సాగు చేసేందుకు వెళ్లిన రైతులను బుధవారం అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. అయితే తాటిచెలకలో ఎలాంటి సాగుకు అనుమతించేది లేదని అటవీశాఖ ఉన్నతాధికారులు తెగేసి చెప్పారు. అయినా.. ఇటీవల ఎమ్మెల్యే చెప్పారనే సమాచారంతో రైతులు సాగుకు సిద్ధపడటంతో అధికారులు అడ్డుకున్నారు. రాష్ట్రమంతా పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం తమను విస్మరించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంక్షలు లేకుండా..

- బీడీ కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలి
- కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలి : తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి నూర్జహాన్



నవతెలంగాణ-కంఠేశ్వర్

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బీడీ పరిశ్రమలో పని చేసే ప్యాకర్స్, గంప చాటాన్ బట్టి, బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలూ లేకుండా జీవనభృతి అమలు చేయాలని తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో బీడీ ప్యాకర్లు ధర్నా చేపట్టి అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమలో పనిచేస్తూ పీఎఫ్ ఉన్న ప్రతి ఒక్కరికీ జీవన భృతి అమలు చేస్తామని చెప్పారని, కానీ జిల్లాలో ప్యాకర్స్ కార్మికులకు అమలు కావడం లేదని తెలిపారు. పరిశ్రమలో పనిచేసే కార్మికులు అనేకసార్లు వినతి పత్రాలు, ధర్నాలు, రాస్తారోకోలు, వ్యక్తిగత దరఖాస్తులు పెట్టుకొని విసిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనియెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం మోహన్, ప్యాకర్స్ జిల్లా నాయకులు జమీల్, విశ్వనాథ్, నారాయణ, మైనుద్దీన్, ప్రమీల, మోహన్ రామచందర్, హమీద్ హైమద్, దేవదాస్ గని, రజాక్ చిన్నయ్య, రవి, గణేష్, లింగం శ్రీనివాస్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ చేసినట్టుగానే... టీవీవీపీ యాక్ట్‌ను రద్దు చేయాలి

- టీఎస్ సెకండరీ హెల్త్ కేర్ సర్వీసెస్‌గా మార్చాలి : టీవీవీపీ జీడీఏ, టీవీవీపీ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ యాక్ట్‌ను రద్దు చేసినట్టుగానే తెలంగాణలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ యాక్ట్‌ను రద్దు చేయాలని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీవీవీపీ జీడీఏ) , టీవీవీపీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం టీవీవీపీ జీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఎం.కె.రవూఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పొరుగు రాష్ట్రంలో వైద్య విధాన పరిషత్ సేవలను ఏపీ హెల్త్ కేర్ సర్వీసెస్ గా మార్చి పూర్తిగా ప్రభుత్వ ఆరోగ్య విభాగంగా మారుస్తూ అక్కడి క్యాబినెంట్ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. తెలంగాణలోనూ టీఎస్ సెకెండరీ హెల్త్ సర్వీసెస్ ను ఏర్పాటు చేసి ఉద్యోగుల జీతాలు ట్రెజరీ ద్వారా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా పరిషత్ లో జిల్లాకు ఒక డీసీహెచ్ఎస్ పోస్టులను సృష్టించాలని కోరారు.

సంపాదకీయం


హక్కులకు సమాధి!

ఆదివాసీల జీవితాలతో ఆది నుంచి చెలగాటమాడుతూ వస్తోన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం అడవితల్లిపై గొడ్డలి వేటు లాంటి సవరణలతో ఇప్పుడు అటవీ సంరక్షణ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు వ్యూహం పన్నడం దారుణం. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం మణిపూర్‌లో గిరిజన తెగల మధ్య విద్వేషాగ్ని రాజేసి... అక్కడ

'వన (సంరక్షణ్ ఏవం సంవర్ధన్) అధినీయం-1980గా పేరు మారుస్తున్న ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా అటవీ విధ్వంసానికి దారితీసే సవరణలతో నయవంచనకు పాల్పడుతోంది. కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం, అటవీ విస్తరణ కోసం ప్రస్తుత నిబంధనలు అడ్డుగా ఉన్నాయట! దేశ భద్రత కోసం సరిహద్దులో సైనికులకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు అటవీ చట్టం అడ్డువస్తోందట. పర్యావరణ హిత పర్యాటక ప్రాజెక్టులకు నిబంధనలు అడ్డేనట! ఈ అడ్డులన్నింటినీ తొలగించేసి కొత్త చట్టాన్ని తీసుకురావడం అంటే అడవి బిడ్డలకు ఉన్న రక్షణ కవచాలను తొలగించడమే.

అంతులేని అరాచకాలు కొనసాగుతుంటే మౌనం దాల్చిన మోడీ సర్కార్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాసం ప్రకటించిన సమయంలోనే లోక్‌సభలో అటవీ సంరక్షణ (సవరణ) చట్టం బిల్లును ఆమోదింపజేసుకోవడం బీజేపీ బరితెగింపునకు మరో ఉదాహరణ.

ముసాయిదా బిల్లులో ప్రతిపాదించిన సవరణలపై గిరిజనులు, పర్యావరణ వేత్తలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినా మోడీ సర్కార్ ఖాతరు చేయలేదు. వేలాది మంది తమ అభ్యంతరాలను, విజ్ఞాపనలను పంపినా.. బీజేపీ ఎంపి రాజేంద్ర అగర్వాల్ నేతృత్వంలోని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వాటిని బుట్టదాఖలు చేసింది. జెపిసి తీరును నిరసిస్తూ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులందరూ ముక్తకంఠంతో బహిరంగంగానే అసమ్మతి ప్రకటించాల్సి వచ్చిందంటే జెపిసి ఎవరి కనుసన్నల్లో పనిచేసిందో అర్థం చేసుకోవచ్చు.



కేంద్రం ప్రతిపాదించిన సవరణలన్నీ కూడా అటవీ సంరక్షణ (కన్జర్వేషన్) చట్టాన్ని అటవీ కార్పొరేటీకరణ చట్టంగా మార్చే కుట్రపూరిత వ్యూహాలను ప్రస్ఫుటం చేస్తున్నాయి. కార్పొరేట్, ప్రయివేటు కంపెనీలు అడవితల్లిని తమ కబంధహస్తాల్లో బంధించేందుకు వీల్లేకుండా అడ్డుపడుతున్న నిబంధనలను నీరుగార్చేలా సవరణలు తీసుకొచ్చింది. అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాల కోసం వినియోగించడానికి బదలాయింపునకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న '100 హెక్టార్లు లేదా అంతకు మించి' అని ఉన్న నిబంధనను సవరించి '1000 హెక్టార్లు పైగా' అని మార్చారు. అంటే ఇక నుంచి వెయ్యి హెక్టార్లలోపు అటవీ భూమిని వేరే వాటికి వినియోగించడానికి ఎటువంటి అనుమతులూ అక్కర్లేదు. ఇంత పెద్ద మొత్తంలో భూమిని అటవీయేతర ప్రయోజనాలకు బదిలీ చేస్తే జీవావరణం దెబ్బతింటుందని 2019లో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖే అభ్యంతరాలు, ఆందోళన తెలిపింది. అలాగే అటవీ భూసేకరణలో గ్రామసభ సమ్మతి తీసుకోవడం అత్యంత కీలకమైనది. కానీ ప్రస్తుత సవరణలతో గ్రామసభ హక్కులకు మోడీ సర్కార్ సమాధి కట్టేసింది.

అటవీ ప్రాంతంలో చేపట్టే ఏదైనా ప్రాజెక్టుకు అనుమతి కావాలన్నా, తుది ఆమోదం పొందాలన్నా... గ్రామసభ నుంచి ముందస్తు సమ్మతి తీసుకోవడం తప్పనిసరి అని 2009 ఆగస్టు 3న కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ఒక ప్రత్యేక సర్క్యులర్ కూడా జారీ చేసింది. అయితే ఈ సర్క్యులర్‌ను 2017లో ఇదే మోడీ సర్కార్ వెనక్కి తీసుకున్నా.. గ్రామసభ ఆమోదం పొందాలనే నిబంధన మాత్రం అలానే ఉంది. దానిని ఇప్పుడు నీరుగార్చేసింది. అలాగే అటవీ భూమి బదలాయింపునకు అనుమతులు ఇవ్వడానికి ముందుగానే ప్రతిపాదిత ప్రాంతంలోని గిరిజనులందరికీ షెడ్యూల్డు తెగలు, సంప్రదాయ అటవీ నివాసుల చట్టం 2006 ప్రకారం దక్కాల్సిన ప్రయోజనాలన్నిటినీ సంబంధిత కలెక్టర్లు చేకూర్చాలి. నూతన సవరణల్లో ఈ నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి అడవి తల్లికి, అడవి బిడ్డలకి, గ్రామసభకు ఉన్న హక్కులను గంగలో కలిపేశారు.

'వన (సంరక్షణ్ ఏవం సంవర్ధన్) అధినీయం-1980గా పేరు మారుస్తున్న ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా అటవీ విధ్వంసానికి దారితీసే సవరణలతో నయవంచనకు పాల్పడుతోంది. కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం, అటవీ విస్తరణ కోసం ప్రస్తుత నిబంధనలు అడ్డుగా ఉన్నాయట! దేశ భద్రత కోసం సరిహద్దులో సైనికులకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు అటవీ చట్టం అడ్డువస్తోందట. పర్యావరణ హిత పర్యాటక ప్రాజెక్టులకు నిబంధనలు అడ్డేనట! ఈ అడ్డులన్నింటినీ తొలగించేసి కొత్త చట్టాన్ని తీసుకురావడం అంటే అడవి బిడ్డలకు ఉన్న రక్షణ కవచాలను తొలగించడమే. పదికోట్ల మంది అమాయక గిరిజనులను ఇప్పటికే టైగర్ జోన్ల పేరిట, రిజర్వు ఫారెస్టుల పేరిట, మైనింగ్ లీజులు, సౌర విద్యుత్ జోన్ల పేరిట అడవి నుంచి తరిమేస్తున్నారు. మోడీ సర్కార్ సాగిస్తున్న ఈ దురాగతాలను తిప్పికొట్టి అడవిని, అడవి బిడ్డలను రక్షించుకునేందుకు సమస్త ప్రజానీకం ముందుకు కదలాలి.

అనుచిత వ్యాఖ్యలు ఎవరికి లాభం?

రాష్ట్రంలో కమ్యూనిస్టులకేమున్నదనీ, కార్యకర్తలే లేరనీ, జెండాలు మోసేందుకు ఆశాలను, అంగన్‌వాడీలను వాడుకుంటున్నారనీ సీపీఐ, సీపీఐ(ఎం) ఉచ్చులో పడొద్దనీ హరీశ్‌రావు అన్నట్టు వార్తలు వచ్చాయి. సహజంగానే కమ్యూనిస్టు శ్రేణులకూ, ప్రజాస్వామ్యవాదులకూ ఆగ్రహం తెచ్చే విషయమిది. రాష్ట్ర మంత్రివర్గంలోనూ, బీఆర్‌ఎస్‌లోనూ కీలక స్థానాలలో ఉన్న నాయకుల మాటల ప్రభావం తక్కువేమీ ఉండదు. అనాలోచితంగా అనవల్సిన మాటలు కాదు. అట్లా అనే నాయకుడు కూడా కాదు ఆయన. దీనికి తోడు, ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ 'రానున్న ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని' అన్నారు. 'వామపక్షాలతో సర్దుబాట్లు ఉండవా?' అన్న ప్రశ్నకు 'చూస్తారుగా...' అని దాటవేసారు. సహజంగానే ఈ వ్యాఖ్యలన్నీ అనేక అనుమానాలకు అవకాశమిస్తాయి.


ఎస్. వీరయ్య

ప్రతి రాజకీయ పార్టీకీ, తమ గురించే కాకుండా, ఇతర పార్టీల బలాబలాల గురించి కూడా అంచనాలు ఉంటాయి. ఆయా అంచనాల తప్పొప్పులు ఆచరణలో తేలుతాయి. కొన్నింటిని కాలం పరిష్కరిస్తుంది. బీఆర్‌ఎస్ నాయకులకు కూడా కమ్యూనిస్టుల పట్ల అంచనానే ఉండకూడదని ఎవరూ అనజాలరు. కానీ హరీశ్‌రావు వ్యాఖ్యలు అసందర్భం... అవాంఛనీయం. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ముసురుకుంటున్న సమయంలో మాట్లాడవల్సిన తీరు కాదు. ఒకవైపు దేశంలో బీజేపీ పాలన దుష్ప్రభావాలు చూస్తున్నాం. ధరల పెరుగుదల,

దేశ ప్రయోజనాల కోసం విశాల దృక్పథంతోనే, రాజకీయ లక్ష్యంతోనే బీఆర్‌ఎస్‌తో సర్దుబాటుకు వామపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. దేశంలో మతోన్మాద ప్రమాదాన్ని ఎదుర్కోవల్సిన బాధ్యత కేవలం వామపక్షాలదే అనుకోరాదు. ఆ బాధ్యత బీఆర్‌ఎస్ మీద కూడా ఉన్నదని గుర్తించాలి. ఈ బాధ్యతను ఏమాత్రం విస్మరించినా దేశ సమైక్యతకు, ప్రజా ప్రయోజనాలకు కలిగే హానిని విస్మరించడమే అవుతుంది.

ఉపాధి సమస్యలు, ఆర్థిక అసమానతలు, మహిళలమీద లైంగిక దాడులు, కులదురహంకార దాడులు పెరుగుతున్నాయి. రాష్ట్రాల హక్కులు హరిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా మిలటరీ పదఘట్టనల కింద నలుగుతున్నది కాశ్మీర్. ఇప్పుడు మణిపూర్ మండుతున్నది. దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలు మంటగలుపుతున్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణలో కూడా తిష్టవేయాలని బీజేపీ అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. తాత్కాలికంగా, ఈ ఎన్నికల సందర్భంగా అవకాశాలు తగ్గి ఉండవచ్చు. ఎత్తుగడలు మారుతున్నాయి తప్ప బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నాలు ఆగలేదు. ఆగవు కూడా. ఇలాంటి రాజకీయ వాతావరణంలో బీఆర్‌ఎస్ నాయకత్వం కమ్యూనిస్టులతో కయ్యం కోరుకుంటున్నదనుకోలేం. పైగా మునుగోడు ఎన్నికల ఫలితాల అనంతరం, 'రానున్న ఎన్నికల్లో కూడా కమ్యూనిస్టులు, మేమూ కలిసే పనిచేస్తామ'ని ముఖ్యమంత్రి బహిరంగంగా చెప్పారు. ఇప్పుడు సహజంగానే బీఆర్‌ఎస్-వామపక్షాల మధ్య సర్దుబాట్లుంటాయని ప్రజలు భావిస్తారు. వామపక్షాలకు కూడా అందుకేమీ అభ్యంతరాలు లేవు. మరోవైపు త్వరలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను కూడా ప్రకటించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇలాంటి కీలక సమయంలో, సాధ్యమైనంత త్వరగా వామపక్షాలతో సర్దుబాట్లు చేసుకోవాల్సిన సమయంలో బీఆర్‌ఎస్‌లో కీలక నేతల వ్యాఖ్యలు అనుమానాలకు అవకాశం ఇస్తున్నాయి. సర్దుబాట్లు జరగటం తమ ప్రయోజనాలకు నష్టమని భావిస్తున్న పార్టీలు "బీఆర్‌ఎస్ నాయకత్వం ఇతరులను వాడుకుని వదిలేస్తారనీ... మునుగోడులో కమ్యూనిస్టులను అట్లానే వాడుకున్నార"నీ ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు, బీజేపీ-బీఆర్‌ఎస్‌ల మధ్య అంతర్గత బంధం ఉన్నదని కూడా కాంగ్రెసుగానీ, మీడియాలో ఒక భాగంగానీ బహిరంగంగానే ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో కమ్యూనిస్టుల పట్ల చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు ఎవరికి ఉపయోగపడతాయి? ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్) సహా కీలకమైన, విధానపరమైన అంశాలన్నింటిలో బీఆర్‌ఎస్ నాయకత్వం స్పష్టంగానే బీజేపీ విధానాలకు వ్యతిరేక వైఖరి తీసుకుంటున్నది. అదే సమయంలో వాడుకోవటం కాదనీ, కలిసి నడిచామనీ... కలిసే నడుస్తామనే సంకేతాలు పోవాల్సిన సమయమిది. ప్రజలకు విశ్వాసం కల్పించవల్సిన సందర్భం.



ఏ పార్టీ చరిత్ర ఏమిటో తెలియనివారు కాదు ప్రజలు. కీలకమైన రాజకీయాంశాలు మాట్లాడేటప్పుడు సంకుచిత ధోరణి పనికిరాదు. దూరదృష్టి కావాలి. శాసనసభ ఎన్నికలలో బీఆర్‌ఎస్ నాయకత్వం ఒంటరిగానే పోటీ చేస్తుందని రాజకీయాలు పరిశీలిస్తున్నవారెవరూ భావించజాలరు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద ప్రభావం ఒకవైపూ, కాంగ్రెసు ప్రచారం మరోవైపూ ఉన్న తరుణంలో ఒంటరి పోరుకు సిద్ధపడతారని అనుకోలేం. కొన్ని తరగతులలో, సమూహాలలో బీఆర్‌ఎస్ పట్ల అసంతృప్తి ఉన్నమాట నిజం. అలాంటివారి సమస్యలు పరిష్కరించటం, నచ్చజెప్పటం ద్వారా మాత్రమే ముందుకు సాగగలరు. అంతే తప్ప, ఆ ప్రజలు గౌరవించే పార్టీలను హేళన చేయటం ద్వారా ఏమి సాధించగలరు? సాధారణ ప్రజలలో వామపక్షాల పట్ల సదభిప్రాయం, గౌరవం ఉన్నవారిలో వ్యతిరేకత పెంచుకోడానికే ఇలాంటి వ్యాఖ్యలు తోడ్పడతాయి. రాష్ట్రంలో మతోన్మాదం ప్రమాదాన్ని తక్కువ అంచనావేయటం తగదు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రధాన పోటీదారు బీజేపీ కానంతమాత్రాన నిర్లక్ష్యం పనికిరాదు. దీర్ఘకాలిక ప్రమాదాన్ని విస్మరించకూడదు. పార్లమెంటు ఎన్నికల లక్ష్యం కూడా మరువరానిది. ఇప్పుడు ఓట్లు పెరిగినా భవిష్యత్తుకు ముప్పు. రాష్ట్రంలో మతసామరస్యం చాలా సున్నితమైంది. ఏ క్షణంలోనైనా చిచ్చుపెట్టవచ్చు. భావోద్వేగాలు రెచ్చగొట్టవచ్చు. ఈ ప్రయత్నంలో భాగంగానే 'రజాకార్ ఫైల్స్' పేరుతో సినిమా నిర్మిస్తున్నారు. ఇప్పటికే 'కాశ్మీర్ ఫైల్స్', 'కేరళ స్టోరీ' పేరుతో చేసిన ప్రయత్నాలు చూసాం కదా! కేంద్రంలో మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందో అంచనా అవసరం. వామపక్షాలతో కలిసి నడిచే ప్రయత్నం కేవలం ఓట్ల కోసమేనా! ఓట్ల దృష్టితోనే మాట్లాడుకోవాలా! కాదు. రాష్ట్రాల హక్కులు, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు వంటి విస్తృత ప్రయోజనాల కోసం పనిచేయాలి. అంతేకాదు, 'ఉచితాల' పేరుమీద బీజేపీ సంక్షేమ పథకాల మీద కూడా దాడి చేస్తున్నది. ప్రజల సంక్షేమం కోసం వామపక్షాలు, బీఆర్‌ఎస్ కలిసి పనిచేయాలి.

ఎన్నికలలో బీఆర్‌ఎస్‌తో కలిసి పని చేయటమంటే వామపక్షాలకు అధికార పార్టీతో విభేదాలేమీ లేవని కాదు. రాష్ట్రంలో కోటిమంది కార్మికులకు వర్తించే కనీస వేతనాలు సవరించలేదు. గ్రామపంచాయతీ కార్మికులు పోరాడుతున్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు, ఐకేపీ వీఓఏలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, మున్సిపల్ కార్మికులు, వీఆర్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడవల్సి వచ్చింది. ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కావల్సి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నారు. 'ధరణి' సమస్యలు , రుణమాఫీ కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ కార్మికుల గురించిన మాటే పాలకులనుంచి రావటంలేదు. ఇండ్లు, ఇండ్లస్థలాలు, డబల్ బెడ్రూమ్ ఇండ్ల సమస్యలు పరిష్కారం కావాలి. అనేక సందర్భాలలో పాలకుల అప్రజాస్వామిక ధోరణుల మీద కూడా పోరాడవల్సి వస్తున్నది. కార్మికుల సమిష్టి బేరసారాల హక్కును గుర్తించకపోవటం చూస్తున్నాం. ధర్నాచౌక్ పరిరక్షణ కోసం కూడా పోరాడక తప్పలేదు. అవకాశవాద ధోరణులు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి సమస్యలు అనేకం ఉన్నప్పటికీ, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడుతూనే, దేశ ప్రయోజనాల కోసం విశాల దృక్పథంతోనే, రాజకీయ లక్ష్యంతోనే బీఆర్‌ఎస్‌తో సర్దుబాటుకు వామపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. దేశంలో మతోన్మాద ప్రమాదాన్ని ఎదుర్కోవల్సిన బాధ్యత కేవలం వామపక్షాలదే అనుకోరాదు. ఆ బాధ్యత బీఆర్‌ఎస్ మీద కూడా ఉన్నదని గుర్తించాలి. ఈ బాధ్యతను ఏమాత్రం విస్మరించినా దేశ సమైక్యతకు, ప్రజా ప్రయోజనాలకు కలిగే హానిని విస్మరించడమే అవుతుంది.

మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్, వామపక్షాల మధ్య సహకారం ప్రజాస్వామ్యవాదుల మన్ననలు పొందింది. మతోన్మాదుల స్పీడుకు బ్రేకులు వేసింది. ఈ సహకార ధోరణి కొనసాగాలని కోరుకుంటున్నారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితుల ప్రాధాన్యత రీత్యా బీఆర్‌ఎస్ కూడా వామపక్షాలతో కలిసి నడిచేందుకు సిద్ధపడవచ్చు. అది సాధ్యం కానప్పుడు సహజంగానే సీపీఐ-సీపీఐ(ఎం) కలిసి నడుస్తాయి. ఏం జరుగనున్నదో వేచి చూడవల్సిందే.

ప్రజా పోరాటాల పట్ల అసహనం, కమ్యూనిస్టుల పట్ల చులకనగా మాట్లాడటం రాష్ట్రంలో ఏ శక్తులు వినియోగించుకుంటాయో గమనించాలి. కమ్యూనిస్టులది ఘనమైన చరిత్ర. స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిది. పేదల హక్కుల కోసం, ప్రజల ప్రయోజనాల కోసం కమ్యూనిస్టుల త్యాగాలు అనితర సాధ్యం. శత్రువులు కూడా ఈ విషయంలో విభేదించజాలరు. కమ్యూనిస్టు ఉద్యమంలో తాత్కాలికంగా కొన్ని ఒడిదుడుకులు వచ్చి ఉండవచ్చు. అవే శాశ్వతం అనుకోవటం పొరపాటు. చరిత్రను విస్మరించడమే! శత్రుపక్షంలో ఉన్నవారు ప్రత్యక్ష దాడులతో దెబ్బతీస్తారు. కలిసి నడవవల్సిన వారు నిర్లక్ష్యం, హేళనతో బలహీన పరచాలనుకుంటే నష్టం ప్రజలకూ, ప్రజాస్వామ్యానికీ... ప్రాంతీయ పార్టీల అస్తిత్వానికి కూడా. దేశంలో వామపక్ష ఉద్యమం ప్రాధాన్యత గురించి అనేక సందర్భాలలో వామపక్ష వ్యతిరేకులు కూడా గుర్తిస్తారు. బెంగాల్‌లో వామపక్ష సంఘటన ఓడిపోయిననాడు వామపక్ష వ్యతిరేకులు కూడా దుర్దినంగానే భావించారు. వామపక్షం బలహీనపడితే ప్రజల గురించి ఈమాత్రం ఆలోచించే పరిస్థితి కూడా పోతుందన్నారు. అనేకమంది విశ్లేషకులు బహిరంగంగానే చెప్పారు. అందువల్ల వామపక్షం గురించి ఆషామాషీ ఆలోచనలూ, అంచనాలు తగవు. విస్తృత ప్రయోజనాల కోసం విశాల దృక్పథం అవసరం.

మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్, వామపక్షాల మధ్య సహకారం ప్రజాస్వామ్యవాదుల మన్ననలు పొందింది. మతోన్మాదుల స్పీడుకు బ్రేకులు వేసింది. ఈ సహకార ధోరణి కొనసాగాలని కోరుకుంటున్నారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితుల ప్రాధాన్యత రీత్యా బీఆర్‌ఎస్ కూడా వామపక్షాలతో కలిసి నడిచేందుకు సిద్ధపడవచ్చు. అది సాధ్యం కానప్పుడు సహజంగానే సీపీఐ-సీపీఐ(ఎం) కలిసి నడుస్తాయి. ఏం జరుగనున్నదో వేచి చూడవల్సిందే. •



దాదాపు 1920 వరకూ దేశ స్వాతంత్ర్యం కోసం అందరూ ఒకతాటిపై నడిచిన భారతీయులు, తరువాత తలెత్తిన రాజకీయ నాయకుల మధ్య ఆలోచనా ధోరణులు, ప్రత్యేక మతాధారిత నియోజకవర్గాలు, పార్టీలు, అగ్గికి ఆజ్యం పోశాయి. బ్రిటిష్ వారి "విభజించు - పాలించు" విధానాలు కూడా దేశ విభజనకు దారి తీశాయి. అప్పటి నుంచి నేటి వరకూ అనేక రూపాల్లో హింసాత్మక సంఘటనలు దేశంలో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోవడం, అదే సందర్భంలో అనేక కోట్ల రూపాయల ఆస్తి బుగ్గిపాలవడం జరుగుతోంది... దీనికి పరాకాష్టగా దేశ విభజన సందర్భంగా దేశంలో చెలరేగిన హింసాత్మక ఘటనలు దేశ చరిత్రలో నల్లటి మచ్చలుగా నేటికీ, ముమ్ముందు కదలాడుతూనే ఉంటాయి. దేశ స్వాతంత్ర్యం అనంతరం దేశంలో జరుగుతున్న అత్యధిక హింసాత్మక ఘటనలు మతపరమైనవే... 1960లో గుజరాత్ అల్లర్లు, 1984లో సిక్కు అల్లర్లు, 2002లో దేశాన్ని కుదిపేసిన గుజరాత్, గోద్రా అల్లర్లు, ఇక ఇటీవల యావత్ దేశాన్ని ఆ మాటకొస్తే ప్రపంచ దేశాలు చర్చిస్తున్న అవమానకరమైన "మణిపూర్ హింసాత్మక సంఘటనలు" ఆ కోవకు చెందినవే.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, లౌకికదేశంగా పరిగణిస్తున్న మనదేశంలో ఇటీవల కాలంలో మతపరమైన హింసాత్మక ఘటనలు తరచూ దేశవ్యాప్తంగా సంభవిస్తున్న వేళ దేశమంతటా ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా దేశంలో శాంతి భద్రతలు కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వం, హింసలు చెలరేగుతున్న రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజల మధ్య శాంతి భద్రతలు కాపాడాల్సినది పోయి, ఉదాసీనతతో వ్యవహరించి, హింసలను ప్రోత్సహించేటట్లు చేయటం అత్యంత బాధాకరమైన విషయం. అంతేకాదు రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసిన ప్రభుత్వ పాలకులు ఒక వర్గ ప్రజానీకానికి కొమ్ము కాయడం క్షమించరాని నేరం. ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి మణిపూర్ ఘటనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అందుచేతనే "సుప్రీంకోర్టు" కూడా తీవ్రంగా పరిగణిస్తున్న విషయం మనం గమనించాల్సిన అంశం.

మోడీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి నేటి వరకూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, డబుల్ ఇంజన్ సర్కారు ఉన్న వివిధ రాష్ట్రాల్లో ఈ కమ్యునల్ అల్లర్లు ఎక్కువగా చేసుకున్నాయి. 2016 నుంచి 2020 మధ్య కాలంలో దేశంలో నమోదైన మతపరమైన అల్లర్లు 3400 అని సమాచారం. యన్.సి.ఆర్.బి నివేదికల ప్రకారం గత ఐదేండ్లుగా దేశవ్యాప్తంగా నమోదైన కమ్యునల్ అల్లర్లు 2017లో 723, 2018లో 512, 2019లో 438, 2020లో 857, 2021లో 378 ఈ విధంగా అధికారికంగా గణాంకాలు యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ హోం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ కూడా వెల్లడించారు. ఇక అనధికార హింసలు, దాడులు, దోపిడీలు మనం ఊహించవచ్చు. ముఖ్యంగా దేశంలో అధికారంలో ఉన్న పాలకులు ఒక మతం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మైనారిటీలు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజలపై అధికార పక్షం అండదండలతో కొందరు రెచ్చిపోయి, హింసాత్మక సంఘటనలు పెచ్చుమీరుతున్నాయి అని అనేక మంది మేధావులు, విశ్లేషణకర్తల అభిప్రాయం. అదే సమయంలో ఎన్ఆర్‌సీ, సిఏఏ అనే పేరుతో కొంతమంది ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా దేశంలో ఇటీవల కాలంలో మతపరమైన, కుల, ప్రాంతీయ, భాషా, లింగ వివక్షతల ఆధారంగా అనేక చోట్ల అలజడులు జరుగుతున్నాయి.

ఇకనైనా దేశ ప్రజల్లో ప్రస్తుతం ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజ్యాంగ ప్రకారం పరిపాలన అందరికీ పారదర్శకంగా అందివ్వాలి. ప్రతిపక్ష పార్టీల నాయకుల సూచనలు సలహాలు తీసుకోవాలి. కానీ అదేమి పట్టించుకోకపోగా మందబలంతో చట్టాలను చేసి ప్రజల మీద రుద్దడం ఏలికలకు సమంజసం అనిపించుకోదు. ప్రజల చేత ఎన్నుకోబడిన పాలకులు ప్రజలకు రక్షణ, భద్రత కల్పించాలి. కానీ వారు ఏమాత్రం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని మణిపూర్‌ను చూస్తే అర్థం చేసుకోవచ్చు. సమస్యలు శాంతియుతంగా పరిష్కరించాలి. రక్షణ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ రాజ్యాంగం ప్రకారం సమన్యాయం అందించాలి. అంతేకాని, అధికారాన్ని ఆసరాగా చేసుకుని, రాజ్యాంగ సంస్థలను, ప్రభుత్వ సంస్థలను తమ ఆధీనంలో ఉంచుకుని, వారికి అనుకూలంగా పాలన చేయరాదు. అలా వ్యవహరించడం వల్లనే ప్రస్తుతం మణిపూర్ ఆందోళన పాలకుల స్థాయి దాటి, న్యాయం కోసం సుప్రీంకోర్టుకు చేరింది. ప్రభుత్వాల పనితీరు, డొల్లతనం బయటపడింది. ఇకనైనా పాలకులు రాజ్యాంగ పరిపాలన అందరికీ పారదర్శకంగా అందివ్వాలి. లేనట్లయితే న్యాయస్థానాలే ప్రజలకు ఆశాదీపంగా, హక్కులను కాపాడే దారిదీపాలుగా వెలుగొందుతాయి... - ఐ.పి.రావు

మెయిల్ @ నవతెలంగాణ

సొంతింటి కల నిజమయ్యేనా..?

రాష్ట్రంలో ప్రభుత్వం ఇండ్లు నిర్మిస్తుందని ఆశతో నిరుపేదలు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రకటించిన గృహలక్ష్మి పథకంతో ఆనందపడ్డారు. అయితే ఈ మధ్య కాలంలో పేదలకు ఇల్లు కావాలి అనే డిమాండ్ కూడా బాగా పెరిగింది. ఇండ్లు, ఇండ్ల స్థలాలకై పోరాటాలు కూడా జరుగు తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపించడంతో కండ్లు తెరిచిన ప్రభుత్వం 'గృహలక్ష్మి'ని తీసుకొచ్చింది. పథకానికి విధివిధానాలు రూపొందించింది. మూడు విడతల్లో ఒక్కో విడతకు రూ.లక్ష చొప్పున రూ.3లక్షలు సాయమందిస్తామని చెప్పింది. మంచిదే కానీ.. ప్రకటించి రెండు నెలలు కావస్తున్నా రాష్ట్రంలో ఎక్కడ కూడా లబ్దిదారుల ఎంపికకాని, మంజూరు పత్రాలు కాని ఏ ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదు. ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని కట్టడి చేసేందుకు ప్రకటించినట్టుగా ఉంది తప్ప పథకాన్ని వేగవంతంగా అమలు చేయాలని చిత్తశుద్ధి ఉన్నట్లు కనపడటం లేదు. ఎందుకంటే గత పదేండ్లుగా రాష్ట్రం ఏర్పడి నప్పటి నుంచి నేటి వరకు ఏ ఒక్కరికి ఇండ్లు కట్టించిన దాఖలు లేవు. ఈ పదేండ్ల కాలంలో అనేక మందికి వివాహాలు జరిగి ఉమ్మడి కుటుంబాల ద్వారా విడిపోయిన వారి సంఖ్య లక్షల్లో ఉంది. అలా చూసుకుంటే ప్రతి నియోజక వర్గానికి కనీసం ఏడు నియోజకవర్గాల చొప్పున లెక్కించినా ఇరవై వేల పైచిలుకు ఇండ్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా చూస్తే గ్రామానికి గ్రామానికి రెండు లేక మూడు ఇండ్లకంటే ఎక్కువ రావు. దీనికితోడు పథకం అర్హతకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా ప్రకటించింది. చాలామందికి రేషన్‌కార్డులు లేవు. ప్రభుత్వం ఇదిగో అదిగో ఇస్తున్నామని చెప్పడమే తప్ప ఆ వైపు దృష్టి సారించడం లేదు. నూతన కార్డుల కోసం దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా రేషన్‌కార్డులతో పాటు అర్హులైన అందరికీ ఆర్థిక సాయం అందించి సొంతింటి కలను నెరవేర్చాలి.

- మట్టిపెల్లి సైదులు, సెల్ 8106778287

జవాబుదారీతనం లేని ప్రధాని

2002 అల్లర్లు, హింసాకాండ సమయంలో గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోడీ ఏ రీతిన వ్యవహరించారో, అదే రీతిలో బీరేన్‌సింగ్ కూడా వ్యవహరిస్తున్నారు. మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితు లకు మూల కారణమేమిటనేదీ మోడీకి బాగా తెలుసు. జాతుల పరంగా వైవిధ్యభరితమైన, సున్నితమైన రాష్ట్రంలో విచ్ఛిన్నకర హిందూత్వ రాజకీయాలే దీనికి కారణం అనే విషయం నిరంకుశ నేతగా మోడీ తానెవరికీ చివరకు పార్లమెంట్‌కు సైతం జవాబుదారీ వహించాలని అనుకోవడం లేదు.

దాదాపు గత మూడు మాసాలుగా జాతీయ రాజకీయ పరిణామాల్లో తీవ్ర చర్చనీయాంశంగా ఉన్న మణిపూర్ ఘటనలు నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలన ఎంత ముదనష్టంగా ఉందో కండ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఈ నిరంకుశ ప్రభుత్వం ఎవరికీ జవాబుదారీ వహించడం లేదు. జాతులు, తెగల మధ్య హింసాకాండతో మణిపూర్ అట్టుడుకుతోంది. ఇంతవరకు 150మందికి పైగా చనిపోయారు. వేలాదిమంది నిరాశ్రయు లయ్యారు. ముఖ్యంగా మహిళలపై భీతిగొలిపే రీతిలో నేరాలు జరుగు తున్నాయి. ఈ పరిణామాలను యావద్దేశం తీవ్ర ఆందోళనతో తిలకిస్తున్నది. అడ్డు అదుపు లేకుండా సాగుతున్న ఈ హింసను అరికట్టి, శాంతిని తిరిగి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. వాస్తవంగా అక్కడ జరుగుతున్నది ఎవరూ ఊహించనిది. సున్నితమైన ఈ ఈశాన్య రాష్ట్రంలో చెలరేగుతున్న విషాదాన్ని గురించి మాట్లాడేందుకు దేశ ప్రధాని మొండిగా తిరస్కరిస్తున్నారు. డబులింజన్ ప్రభుత్వం (కేంద్ర రాష్ట్రాల్లో రెండు చోట్లా బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయి) ప్రధానిగా మణిపూర్‌లో జరుగుతున్న నరమేధానికి ఎలాంటి జవాబుదారీ వహించడం లేదు.

సాయుధులైన మెయితీ పురుషులు ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, అందునా పార్లమెంట్ సమావేశాల ప్రారంభ సమయం కావడంతో ప్రధాని మోడీ మణిపూర్‌పై నోరువిప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది. అది కూడా పార్లమెంట్ వెలుపల మాట్లాడారు. ఆ ఇద్దరు మహిళలకు జరిగిన దాని పట్ల దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. కానీ ఆ వెంటనే, మహిళలపై ఇటువంటి నేరాలు జరిగినప్పుడు రాజస్థాన్, చత్తీస్‌గఢ్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కఠినంగా అణచివేయాలంటూ సమస్యను పక్కదారి పట్టించే యత్నం చేశారు. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్ వంటి ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగే దాడులు, నేరాల విషయాన్ని ప్రస్తావించాలని తన పార్టీ నేతలకు, పార్టీ అధీనంలోని ఐటి విభాగానికి ఆయన ఈ విధంగా ఒక సంకేతమిచ్చినట్లైంది.

మణిపూర్‌లో తలెత్తిన పరిస్థితుల తీవ్రతను ప్రధాని, బీజేపీ గుర్తించ నిరాకరించే ఈ ధోరణి ఒక మానసికోన్మత్తత నుంచి వచ్చిందే తప్ప మరొకటి కాదు. మహిళలపై దాడులు ఏ రాష్ట్రంలో జరిగినా వాటిని నిర్దిష్ట నేరాలుగానే చూడాలి. మణిపూర్‌లో పరిస్థితి అలాంటిది కాదు. ఇక్కడ, ఒక ప్రత్యేక తెగకు చెందిన మహిళలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. వారు ఆ కమ్యూనిటీకి చెందడమే నేరం అన్నట్టుగా ఉంది. కుకీ మహిళలపై జరుగుతున్న హింస, అకృత్యాలన్నీ ముందస్తు పథకం ప్రకారం జరిగినవే. ఫాసిస్టు ఆరెస్సెస్ ప్రవచించే జాతుల ప్రక్షాళనా కార్యక్రమంలో భాగమే ఇదంతా. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఘటనలతో మణిపూర్



ఘటనలను ప్రధాని పోల్చడమే తప్పు. మణిపూర్ పరిస్థితులపై ప్రధాని ఒక ప్రకటన చేయాలంటూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ అత్యంత సముచితమైనది. ప్రధానిగా ఆయన పార్లమెంట్‌కు వచ్చి కీలకమైన మణిపూర్‌పై ఒక ప్రకటన చేయాల్సి ఉంది. ప్రధాని, పార్లమెంటుకు జవాబుదారీ అన్న మౌలిక సూత్రాన్ని సైతం ఆయన గుర్తించడం లేదు. అందుకే ప్రధాని, పాలక పార్టీ ఇటువంటి ప్రకటన చేయడానికి ససేమిరా అంటున్నాయి. అలా ప్రకటన చేసినట్లైతే ఉభయసభల్లోనూ చర్చకు అది ఒక ప్రాతిపదికగా ఉంటుంది. అందుకు ప్రధాని తిరస్కరిస్తుండడం వల్లే అది పార్లమెంటులో ప్రతిష్టంభనకు దారి తీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం నుండీ ఇదే పరిస్థితి.

హిందూత్వ-నిరంకుశ ప్రభుత్వ స్వభావాన్ని సరిగా గ్రహించలేకపోతే, మణిపూర్‌పై ప్రధాని మాట్లాడడానికి, పార్లమెంటుకు జవాబుదారీ వహించడానికి ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం చేసుకోలేరు. మణిపూర్‌లో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ కుకీ గిరిజన మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని మెయితీలలో మత దురహం కారాన్ని రెచ్చగొడుతున్నారు. కుకీ కమ్యూనిటీకి బహిరంగంగానే వ్యతి రేకంగా మాట్లాడుతూ వారిని విదేశీ యులుగా, గంజాయి సాగుచేసే వారిగా ముద్ర వేశారు. "విదేశీయు లైన కుకీ వలసవాదులు సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై ఆధిపత్యం సాధించిన తర్వాత ఆది వాసులైన రాష్ట్ర ప్రజలు రెండో తరగతి పౌరుల స్థాయికి కుదించబడ్డారు" అంటూ మేలో ఈ అల్లర్లు తలెత్తడానికి కేవలం ఒక నెల రోజుల ముందే ముఖ్య మంత్రి ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక అయిన ఆర్గనైజర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అస్సాం, ఈశాన్య ప్రాంతాల నుండి అక్రమంగా వలసవాదులు వెల్లువెత్తారన్న ఆర్‌ఎస్‌ఎస్ సుదీర్ఘకాల ప్రచారాన్నే ఆయన కూడా పునరుద్ఘాటించారు.

మెయితీ తీవ్రవాద సంస్థ అయిన ఆరంబై తెంగోల్‌ను బీరేన్ సింగ్ ప్రోత్సహిస్తున్నారు. ఈ సంస్థకి చెందిన వారే లోయలో కుకీ మహిళలపై, ఇళ్ళపై జరిగే దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. దాడులు, ప్రతిదాడులతో మెయితీ, కుకీ కమ్యూనిటీలకు చెందినవారు బాధితులుగా మారుతున్నారు. జాతుల మధ్య హింసను ప్రేరేపించడంలో బీరేన్‌సింగ్ చేసిన నేరం ఇది. నరేంద్ర మోడీ, బీజేపీ ఈ అంశాన్ని కప్పిపుచ్చాలని చూస్తున్నాయి. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడ్డారని, వారు నిష్పాక్షికంగా వ్యవహరించలేక పోతున్నారని, పరిస్థితిని అదుపుచేయలేక పోతున్నారని తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వమే పరిస్థితిని అదుపు చేయగలదనే రీతిలో కేంద్ర ప్రభుత్వం మాట్లాడు తోంది. 2002 అల్లర్లు, హింసాకాండ సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోడీ ఏ రీతిన వ్యవహరించారో, అదే రీతిలో బీరేన్‌సింగ్ కూడా వ్యవహరిస్తున్నారు. మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితులకు మూల కారణమేంటనేదీ మోడీకి బాగా తెలుసు. జాతులపరంగా వైవిధ్య భరితమైన, సున్నితమైన రాష్ట్రంలో విచ్ఛిన్నకర హిందూత్వ రాజకీయాలే దీనికి కారణం అనే విషయం నిరంకుశ నేతగా మోడీ తానెవరికీ చివరకు పార్లమెంట్‌కు సైతం జవాబుదారీ వహించాలని అనుకోవడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాయి. చర్చ ద్వారా మణిపూర్‌లో పరిస్థితిని ప్రముఖంగా ప్రస్తావించడానికి, ఆచర్చకు స్పందించేలా మోడీ మెడలు వంచడానికి ఇదొక్కటే మార్గం.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

నేటినుంచి రుణమాఫీ అమలుకు శ్రీకారం

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఇచ్చిన రుణమాఫీ అమలు నేటినుంచి (గురువారం) నుంచి మొదలవుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలిపారు. తెలంగాణ రైతాంగ సంక్షేమం, అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందన్నారు. ఎన్ని కష్టనష్టాలున్నా రైతు సంక్షేమం కోసం ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు అందాల్సిన రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు వంటి పథకాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో నిరాటంకంగా కొనసాగించడం జరుగుతుందన్నారు. వ్యవసాయాభివృద్ధి కోసం ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు వంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే అందించిన రుణమాఫీ పోను ఇంకను రూ.19వేల కోట్లు రుణమాఫీని రైతులకు అందించాల్సి ఉందని సండ్ర తెలిపారు. రైతుబంధు తరహాలో విడతల వారీగా రుణమాఫీని అమలును కొనసాగిస్తూ నెలా పదిహేను రోజుల (సెప్టెంబరు రెండో వారం) కల్లా రుణమాఫీ కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని సండ్ర తెలిపారు.

రైల్వే లైన్ అలైన్మెంట్ మార్పుకు చర్యలు

ఎంపీ నామ రాసిన లేఖలకు రైల్వే జీఎం సమాధానం

నవతెలంగాణ-ఖమ్మంప్రతినిధి



ఖమ్మం జిల్లా ప్రజలకు, రైతులకు ఎంతో నష్ట దాయకంగా పరిణమించిన డోర్నకల్-మిర్యాలగూడ నూతన రైల్వే లైన్ అలైన్మెంట్ మార్పు అంశాన్ని పునః పరిశీలిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ జైన్ తెలియజేశారని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈమేరకు రైల్వే జీఎం నుంచి తనకు ప్రత్యేకించి లేఖ అందిందని నామ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ఎటువంటి ఉపయోగమూ లేని ఈ రైల్వే లైన్ను ఖమ్మం జిల్లాతో సంబంధం లేకుండా బయట నుంచి తీసుకెళితే తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, ఈ కొత్త రైల్వే లైన్ వల్ల ఖమ్మం జిల్లాకు చెందిన రైతాంగం, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నూతన రైల్వే మార్గాన్ని ఖమ్మం జిల్లాలో అనుమతించే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెబుతూ నామ గతంలో రైల్వే మంత్రిని, రైల్వే బోర్డు చైర్మన్ ను, జనరల్ మేనేజర్ను కలిసి, లేఖలు అందజేసిన సంగతి తెలిసిందే. ఎంపీ నామ అందజేసిన లేఖలను పరిశీలించిన రైల్వే జీఎం తాజాగా తిరుగు సమాధానం ఇచ్చారు. ఎంపీ నామ తాజాగా చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుని, సమస్య పరిష్కరిస్తామని రైల్వే జీఎం సమాధానం ఇచ్చారు. గతంలో నామ తన పార్లమెంట్ పరిధిలోని ఏ ఒక్క రైతుకు కానీ, ప్రజలకు కానీ ఈ కొత్త రైలుమార్గం వల్ల నష్టం జరిగితే సహించేది లేదని, అడ్డుకుని తీరుతానన్నారు. ఇప్పటికే జాతీయ రహదారులు, నాగార్జున సాగర్, ఇతర వాటి వల్ల రైతులు తమ విలువైన భూములను కోల్పోయి, నష్టపో యారని, మళ్లీ ఇప్పుడు తమ విలువైన భూములను కోల్పోయి, నష్టపో యారని, మళ్లీ ఇప్పుడు ఈ కొత్త రైలు మార్గం వల్ల తమ విలువైన భూము లను కోల్పోవడానికి సిద్ధంగా లేరని నామ రైల్వే జీఎం దష్టికి తీసుకెళ్ళారు. రైలు మార్గం ప్రతిపాదించిన ఏరియాల్లోని భూములు ఎంతో విలువైనవని, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పేదల ఇండ్లు భూముల్లో ఉన్నాయని తెలిపారు. తాను మొదటి నుంచి కూడా జిల్లాలో ఈ రైలు మార్గానికి వ్యతిరేకమని చెబుతూనే ఉన్నానని చెప్పారు. గతంలో జరిగిన దిశ సమావేశంలో కూడా ఈ విషయమై సంబంధింత రైల్వే అధికారులను పిలిపించి, మాట్లాడడం జరిగిందని, ఖమ్మం జిల్లాతో సంబంధం లేకుండా బయట నుంచి ఈ నూతన రైలు మార్గాన్ని నిర్మించుకోవచ్చని తాను స్వయంగా రైల్వే మంత్రిని కలసి స్పష్టం చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికే పలుమార్లు రైల్వే మంత్రితోను, సంబంధిత రైల్వే ఉన్నతాధికారులతోను ఈ విషయమై చర్చించడం జరిగిందని నామ చెప్పారు. ఖమ్మం జిల్లా ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేని ఈ కొత్త రైల్వే లైన్ ఖమ్మం జిల్లాకు అవసరం లేదని తాను ఖరా ఖండిగా రైల్వే మంత్రికి, రైల్వే బోర్డు చైర్మన్కు, జనరల్ మేనేజర్కు స్పష్టం చేయడం జరిగిందన్నారు. ప్రజల అభీష్టమే తన అభిమతమని ప్రజలకు నష్టం జరిగే దేనిని సహించనని నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

4న నోటిఫికేషన్ విడుదల

టెలీ కాన్ఫరెన్స్లో కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



జిల్లాలోని 2023-25 సంవత్సరాలకు ఏ4 రిటైల్ షాపుల లైసెన్స్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఏ4 రిటైల్ షాపుల లైసెన్స్లపై ప్రక్రియపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-25నకు గాను షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్లు, గౌడ, ఎస్సి, ఎస్టీలకు కేటాయించే షాపుల లాటరీలు తీయాలన్నారు. ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయాలని ఆమె అన్నారు. ఈ నెల 4న నోటిఫికేషన్ విడుదల చేసి, అదే రోజు నుండి ఈ నెల 18 సాయంత్రం 6 గంటల వరకు అన్ని పని దినాలలో దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. లైసెన్సుల లాటరీ ప్రక్రియ ఈ నెల 21న చేపట్టాలని తెలిపారు. ఏ4 రిటైల్ షాపులకు ఎక్సైజ్ ట్యాక్స్ మొదటి వాయిదా మొత్తం ఈ నెల 21, 22 తేదీల్లో చెల్లించాల్సి ఉంటుందని, నవంబర్ 30 నుండి కొత్త షాపులకు స్టాక్ విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ 1 నుండి షాపులు ప్రారంభం కానున్నట్లు ఆమె అన్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ ఏ4 రిటైల్ షాపుల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 122 ఏ4 రిటైల్ షాపులకు గాను 18 గౌడలకు, 14 ఎస్సిలకు, 8 ఎస్టీలకు, 82 జనరల్కు కేటాయించినట్లు ఆయన అన్నారు. గౌడ, ఎస్సి, ఎస్టీలకు షాపుల కేటాయింపుకు గురువారం లాటరీ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టి, పూర్తిచేయనున్నట్లు అన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్రెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కృష్ణానాయక్, జిల్లా బిసి సంక్షేమ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహేంద్ర ఫైనాన్స్ కార్యాలయం బాధితుల ఆందోళన

నవతెలంగాణ- మధిర



మధిర పట్టణంలోని మహేంద్ర ఫైనాన్స్ వాళ్ల వేధింపుల వల్ల ఇటీవల ఖమ్మంపాడు గ్రామం నందు ముగ్గురు చిన్నసన్నకారు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మరి కొంతమంది తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు రీత్యా ఒకటి లేదా రెండు కిస్తీలు చెల్లింపులో జాప్యం జరిగినప్పుడు సిబ్బంది సరాసరి ఇంటికి వెళ్లి ఇంటి లోపలికి వెళ్లి మహిళలను, పిల్లలను బయటకు వెళ్ళండి తలుపులు వేస్తామని బెదిరిస్తున్నారు అని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన మహిళ రైతు వజ్రమ్మ తెలిపారు. ఫైనాన్స్ వాళ్ళు చేస్తున్న ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఫైనాన్స్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం వల్ల రైతుల ప్రైవేటు అప్పులకు వెళ్లి అవమాన పడుతున్నారని, అధిక వడ్డీలతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధిర మండలంలో ఫైనాన్స్ కంపెనీల వేధింపులు పెరిగాయని, ఈ సమస్యను రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చారని, పెండింగ్లో ఉన్న కిస్తీలను చెల్లింపుల కొరకు ఫైనాన్స్ సిబ్బంది చట్టపరంగా వ్యవహరించాలి తప్ప భౌతికంగా వెళ్లి రైతులను, రైతు కుటుంబ సభ్యులను అవమానపరచడం, అగౌరవపరచడం, బెదిరించటం ఒత్తిడి చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. మహేంద్ర ఫైనాన్స్ వేధింపుల వల్ల చనిపోయిన కుటుంబాలకు 10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, మహేంద్ర ఫైనాన్స్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, సిఐటియు మండల కన్వీనర్ పడకంటి మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వడ్రణపు మధు, బడిత్య లాలు నాయుడు శ్రీరాములు, అంకే శివయ్య, అంగడాల అమరయ్య, తొలికొండ రామ కిషోర్ పాల్గొన్నారు.

తహశీల్దార్గా పున్నం చందర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ మండల నూతన తహశీల్దార్గా పున్నం చందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నేటి వరకు తాసిల్దారిగా పనిచేసిన చివుకుల రమణి నుంచి ఆయన అధికార బాధ్యతలు స్వీకరించారు. నూతన తాసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన పున్నం చందర్ కు తాహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఫోక్సో యాక్ట్ ద్వారా రక్షణ : జడ్జి

నవతెలంగాణ - ఎర్రుపాలెం

18 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు లైంగిక వేధింపులకు గురైనట్లయితే ఫోక్సో యాక్ట్ ద్వారా వారికి రక్షణ కల్పించబడుతుందని మధిర అడిషనల్ కోర్ట్ జడ్జి టి.కార్తీక్రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఎర్రుపాలెం సర్దార్ జమలాపురపు కేశవరావు మెమోరియల్ జూనియర్ కళాశాల నందు మధిర కోర్టు లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో పోక్సో యాక్ట్పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన బాధితులు పోలీసులను, కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎం.సురేష్, న్యాయవాది గంధం శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ నాగిరెడ్డి సౌజన్య, లీగల్ సెల్ అథారిటీ అధికారి సూర్యనారాయణ, హ్యూమన్ రైట్స్ కమిషన్ ఫౌండేషన్ సభ్యులు వెంకట్, యశోద పాల్గొన్నారు.



రహదారి కబ్జా..రైతుల అవస్థలు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

సుబ్లేడ్ గ్రామంలో వందల చరిత్ర కలిగిన రైతుల రహదారిని కొందరు వ్యక్తులు తమ పొలాల్లోకి వెళ్లే రహదారిని కొందరు వ్యక్తులు వేరే మార్గం ద్వారా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గతంలో ఉన్న రహదారిని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి తమ భూముల్లో కలుపుకోగా కాలినడక ఉన్న దారిని కూడా కలుపుకోవాలని చూస్తున్నారని సుబ్లేడ్ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. సుబ్లేడు గ్రామానికి చెందిన వంగ వెంకన్న అనే వ్యక్తి ప్రభుత్వ రహదారిని ఆక్రమించుకొని మిగతా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటినుంచో ఉన్న దారిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిని కాకుండా పట్టాదారుని ఇబ్బందులు పెడుతున్నారని అదే గ్రామానికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని అధికారులకు తెలియజేయగా అధికారులు పట్టించుకోకపోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని సీపీఐ(ఎం) నాయకుల దృష్టికి తీసుకెళ్లగా వారు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు జియావుద్దీన్, పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, తుళ్లూరు నాగేశ్వరరావు, వెంకన్న, పోషపొంగు వీరన్న, మాజీ ఎంపిటిసి పోలిపొంగు సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞలో మాన్సూన్ డే

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో మాన్సూన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కే.నీలిమ మాట్లాడుతూ ఈ మాన్సూన్ డేనే రెయిన్ డే అంటారని, ప్రాణికోటికి జీవాధారం నీరు అని, నీరు మనకు వర్షాల మూలంగా పొందుతామని కనుక వర్షపు నీటి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయటం కోసం ఈ మాన్సూన్ డేను ఘనంగా నిర్వహించామన్నారు. వర్షం కురుస్తుంటే చిన్న పిల్లల దగ్గర నుండి పెద్దవారి వరకు అందరూ ఆనందిస్తుంటారని, పశువులు, పక్షులు వర్షంతో పులకరిస్తా యన్నారు. వర్షాల వల్ల అన్నివర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. వర్షాల వల్లే బావులు, చెరువులు నిండి మంచినీటికి ఇబ్బందులను లేకుండా చేస్తాయన్నారు. నదులు నిండుగా ప్రవహించి సాగునీటి కొరత తీరుస్తాయన్నారు. అంతేకాక ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి పడుకునేంత వరకు అన్ని అవసరాలకు నీరు చాలా అవసరం అవుతుందని విద్యార్థులకు వివరించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేద్దాం : చైర్మెన్

నవతెలంగాణ-కారేపల్లి

దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోని కారేపల్లి సంత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య అన్నారు. బుధవారం ఆలయ కమిటీ సమావేశం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈసమావేశంలో ఐలయ్య మాట్లాడుతూ ఆలయ ఆధీనంలోని కారేపల్లి వారంతపు సంత ఆదాయాన్ని పెంపొందించటానికి తీసుకోవల్సిన చర్యలను చర్చించారు. సంతకు పూర్వవైభవం తీసుకరావటానికి వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఎంపీ నామా నాగేశ్వరరావు ల సహకారం కోరుదామన్నారు. ఇప్పటికే వైరా ఎమ్మెల్యేను కలిసి సంత సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఈవో ఎస్.శేషయ్య, ఆలయ సిబ్బంది పడగాల మోహన్ కృష్ణ, గణితి నారాయణ, జవ్వాజి రంగయ్య, అర్చకులు శ్రీనివాసచార్యులు, కమిటీ సభ్యులు నాగండ్ల సీతయ్య, బానోత్ మంగీలాల్, చింతా సుజాత, సోమందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఎక్కాలు' కంఠస్థం చేయించండి

- జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

నవతెలంగాణ-సత్తుపల్లి

బడివదిలే ముందు ప్రతిరోజూ విద్యార్థులకు ఎక్కాలను కంఠస్థం చేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సోమశేఖరశర్మ ఉపాధ్యాయులను కోరారు. స్థానిక జ్యోతి నిలయం పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తెలుగు సబ్జెక్టుపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎక్కాలతో పాటు ఇంగ్లీష్ నూతన పదాలు, ఇంగ్లీష్ వాక్యాలను ఐదైదు చొప్పున నేర్పించాలన్నారు. తెలుగు పద్యాలను కంఠస్థం చేయించడం వంటి కృత్యాలను తప్పని సరిగా చేయడం ద్వారా విద్యార్థుల్లో మెరుగైన ప్రగతి తప్పక కనపడుందని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. ఈ తొలిమెట్టు శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో బి.రాములు, మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

పశువైద్యాధికారి డాక్టర్ సంజయ్ రెడ్డి

నవతెలంగాణ- నేలకొండపల్లి

గాలికుంటు, లంపి వ్యాధి నివారణ టీకాలను రైతులు చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ అన్నారు. బుధవారం మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ వజ్జా రమ్య ప్రారంభించారు.కార్యక్రమంలో పశు వైద్య సహాయకుడు టీ మురళి, గోపాలమిత్రులు నరేష్, తాజ్ పాషా, పాండురంగయ్య, విఎల్ఓ విశాలాక్షి పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు.

ప్రతి వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి

నగర మేయర్ పునకొల్లు నీరజ

నవతెలంగాణ- ఖమ్మం

వాహనాలు నడిపే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇది మన ప్రాథమిక బాధ్యత అని మేయర్ పునుకొల్లు నీరజ, డిటివో కిషన్రావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ వల్లభనేని రామారావు, సుడా చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని వీడియోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దోరేపల్లి శ్వేత, దండా జ్యోతిరెడ్డి, మక్బూల్, నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

19 కుటుంబాలకు ఎంఎల్ఏ ఆర్థికసాయం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మండల పరిధిలోని తిప్పారెడ్డిగూడెం, మేడిదపల్లి, కుక్కలతండా, మేకలతండా, మహ్మదాపురం, మాదిరిపురం, ఇస్లావత్తండా గ్రామాలకు చెందిన 19 మంది ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. ఆ కుటుంబాలను ఎంఎల్ఏ కందాళ ఉపేందర్రెడ్డి కుమార్తె దీప్తి బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయ అందజేశారు. అండగా ఉంటామని ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చారు. అనంతరం వివిధ గ్రామాలలో స్కూల్లోని అంగన్వాడి స్కూల్లో ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోడ మంగీ లాల్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు



అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: వ్యకాస

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పొన్నెకంటి సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్లో వ్యకాస మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సంగయ్య మాట్లాడారు. రైతు బంధు, దళితు బంధు తరహాలోనే వ్యవసాయ కూలీలకు కూడా కూలీ బంధు ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, నాయకులు ఉపేందర్, వెంకట్రావు, లక్ష్మణ్, నాగయ్య, రమేశ్, రాంబాబు, యాదగిరి పాల్గొన్నారు.

రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

బుచ్చిరెడ్డి పాలెం గ్రామంలో ఖమ్మం వ్యవసాయ పరిశోధనశాఖ శాస్త్రవేత్తలు రుక్మిణి దేవి ఆధ్వర్యంలో వానాకాలం పంటలలో రైతులు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త భరత్, శాస్త్రవేత్త డాక్టర్ ఝాన్సీ రాణి, ఏఈఓ సుష్మ రైతులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించకండి : సీఐ

నవతెలంగాణ-కారేపల్లి

ఫ్రెండ్లీ పోలీసింగ్, సామాజిక చైతన్యంకు తాము ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం సింగరేణి సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారు ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. పిర్యాదుదారులు దళారులను ఆశ్రయించ వద్దని, సమస్యలు నేరుగా పోలీసు అధికారులకు పిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజాచైతన్య జాతాలు నిర్వహించి మూఢనమ్మకాలపై చైతన్యం చేయటం జరుగుతుందన్నారు. కారేపల్లి, కామేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యక్రమాలపై నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగినట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు వివరాలు ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు పాల్గొన్నారు.

పొలం దుగాలు ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

నవతెలంగాణ-కారేపల్లి

అక్రమంగా పంటపొలంలోకి ప్రవేశించి దుగాల(గెట్లు)ను ధ్వంసం చేసిన 14 మంది వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. ఎస్సై తెల్పిన వివరాల ఇలా ఉన్నాయి. కారేపల్లి మండలం భాగ్యనగర్తండాకు చెందిన ఇస్లావత్ తారాచంద్ 2003వ సంవత్సరంలో సూర్యాతండాకు చెందిన బానోత్ హుస్సెన్ నద్ద సాదాబైనామాతో 4.28 ఎకరాలు భూమి కోనుగోలు చేశారు. అప్పటి నుండి ఇస్లావత్ తారాచంద్ సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో సూర్యతండాకు చెందిన గుగులోత్ సోమ్లా, బానోత్ హుస్సెన్ ఆధ్వర్యంలో 12 మంది పోలంలోకి అక్రమంగా ప్రవేశంచి పొలం దుగాలు(గెట్లు), వరి నారు మడులను ధ్వంసం చేశారు. తారాచంద్ కుటుంబ సభ్యులను అంతు చూస్తామని బెదిరించారు. దీనికి సంబంధించి బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటిని ఢీకొన్న లారీ..యువతి మృతి

నవతెలంగాణ- ఖమ్మం



స్కూటిని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన సంఘటన బుధవారం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపెడ బంగ్లా నీలకుర్తి గ్రామానికి చెందిన పాకా శ్రీకన్య (26), గుర్రాలపాడు తండాకు చెందిన మాలోత్ రాణి ఖమ్మంలో ఓ గ్యాస్ కంపెనీలో పని చేస్తున్నారు. విధుల నిమిత్తం స్కూటీపై రోటరీనగర్ నుంచి వైరా వైపు వెళ్తూ శ్రీశ్రీ సర్కిల్ వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా వైరా వైపు నుంచి వస్తున్న లారీ శ్రీశ్రీ సర్కిల్ వద్ద బైపాస్ రోడ్డుకు టర్నింగ్ తీసుకుంటూ స్కూటిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకన్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. రాణికి గాయాలయ్యాయి. ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్కూటిని ఢీకొన్న లారీ అక్కడి నుంచి ముందుకు వచ్చి ఓ కారును కూడా ఢీ కొట్టింది. టేకులపల్లి బ్రిడ్జి సమీపంలో లారీని రోడ్డు పక్కకు వదిలి డ్రైవర్ పరారయ్యాడు. అన్నం ఫౌండేషన్ నిర్వహకులు అన్నం శ్రీనివాసరావు బృందం శ్రీకన్య మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటపొలంలో నేలకూలిన వృక్షం

పట్టించుకోని ఆర్అండ్బి అధికారులు

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని అమ్మపేట క్రాస్ రోడ్డు, ముదిగొండ, వల్లభి వెళ్లే ఆర్అండ్బీ ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ వృక్షం ఇటీవల కాలంలో భారీగా కురిసిన వర్షాలకు, ఈదురుగాలులకు నేలకూలి రైతు పంట పొలంలో మొక్క దశలో ఉన్న పత్తి మొక్కలపై పడటంతో పత్తి ధ్వంసమైంది. భారీ వృక్షం నేలకూలి పది రోజుల అయినా అలానే ఉంది. ఆర్అండ్బి అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. పత్తిపాటు చేసుకునేందుకు వృక్షం అడ్డురావడంతో రైతు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్బీ అధికారులు జోక్యం చేసుకొని పంటపొలంలో నేలకూలి ఉన్న వృక్షాన్ని తొలగించి పత్తి పంటను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

గంధసిరి గ్రామాన్ని సందర్శించిన సీఐ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని గంధసిరి గ్రామాన్ని ఖమ్మంరూరల్ సిఐ సిహెచ్ రాజిరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చెమట కొండలు ప్రమాదవశాత్తు మున్నేరులో పడి గల్లంతైన సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. సంఘటన వివరాలను ఎస్సై జి.నరేష్ను ఆయన అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన కొండలు ఆచూకీకై గాలింపు చర్యలు కొనసాగుతునాయని ఎస్ఐ గజ్జెల నరేష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ రాజుల సీతమ్మ, కోటయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

నవతెలంగాణ- ఖమ్మంరూరల్



మండల పరిధిలో జలగంనగర్లోని 75 మంది వరద బాధితుల కుటుంబాలకు టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు నిత్యావసరాలను బుధవారం అందజేశారు. వరద బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ప్రజలు నష్టపోయారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దుర్గా నాగేందర్ కు భూక్య వీరభద్రం నివాళి

నవతెలంగాణ-కూసుమంచి

ఇటీవల జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యుత్ షాక్ తో మృతి చెందిన విద్యార్థి హలవత్ దుర్గా నాగేందర్ చిత్ర పటానికి కోక్య తండాలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుర్గ నాగేందర్ మృతి చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం పాలేరు నియోజకవర్గ కన్వీనర్ మూడు గన్యా నాయక్, హలావతు బాసు నాయక్, పాల్గొన్నారు.

ఎస్టీ విభాగం జిల్లా కోఆర్డినేటర్‌గా కృష్ణ

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని లక్ష్మీపురం (రాళ్ల బంజర) గ్రామానికి చెందిన గుగులోతు కృష్ణకు కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ ఎస్టీ విభాగం జిల్లా కోఆర్డినేటర్ గా మంగళవారం రాత్రి నియామకమయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఎస్టీ విభాగం చైర్మెన్ తేజావత్ బెల్లయ్య నాయక్ చేతుల మీదుగా హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో అందుకున్నారు. కల్లూరు మండలంలో కరుడు గట్టిన కాంగ్రెస్ కార్యకర్తగా సుదీర్ఘకాలం పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న మారుమూల అటవీ ప్రాంతానికి చెందిన గుగులోత్ కృష్ణను ఈ పదవి వరించడం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గూగులోత్ కృష్ణ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి సంభాని చేంద్రశేఖర్, పీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, మాజీ సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్కకి, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దామాల రాజు, కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ భూక్య రవీంద్ర పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

తల్లిపాలల్లో ఔషధ గుణాలు ఉన్నాయని, అవి బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్వైజర్ సరిత తల్లులకు సూచించారు. మండల పరిధిలోని బనిగండ్లపాడు అంగన్వాడీ సెంటర్ నందు బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారులకు ప్రీ స్కూల్ కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, వైద్య సిబ్బంది కాంతమ్మ, రాణి, అంగన్వాడి టీచర్లు, మేరీ కాంతం, ఉమామహేశ్వరి, మహాలక్ష్మి, మేరీ జ్యోతి, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.



మోటర్లు కాలిపోయిన రైతులకు పరిహారం అందించాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణ-వైరాటౌన్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాలిమూడి బ్యాక్ వాటర్ వల్ల మండలంలోని దాచాపురం, గన్నవరం రైతులకు చెందిన 70 వ్యవసాయ విద్యుత్ మోటర్లు కాలిపోయాయని, చెరకు తోటలకు ఇసుక, చెత్త మేటలు వేసిందని, వరదలు వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం కాలిన మోటర్లు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ వరదలు వల్ల జరిగిన నష్టంపైన సర్వే కూడా చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరద నష్ట సహాయం 500 కోట్లు సరిపోదని, పెంచాలని డిమాండ్ చేశారు. కాలిపోయిన ప్రతి మోటర్ మరమ్మతుకు రూ.7 వేలు ఖర్చు అవుతుందని అన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మాగంటి తిరుమలరావు, వేల్పుల రోశయ్య, జువాజి శ్రీనివాసరావు, గరిడేపల్లి కృష్ణ, మడుపల్లి రాయప్ప, వేల్పుల మైసయ్య, మాగంటి నవీన్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీని సన్మానించిన మున్నూరు కాపు నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణిని మున్నూరు కాపు సంఘం రాష్ట్రం, జిల్లా నాయకులు బుధవారం ఖమ్మం ఏసీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి దేవేందర్, జిల్లా నాయకులు తాళ్లూరి హనుమంత రావ్, కేదాసు నరసయ్య , కార్పొరేటర్లు మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం, పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు మారిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే వంటబంద్

నవతెలంగాణ-మధిర

మధిర మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, 9, 10, 11 తేదీలలో వంట బంద్ చేసి సమ్మె నిర్వహిస్తామని సమ్మె నోటీస్‌ను మధిర ఎంఈఓ ఆఫీస్ నందు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం బిల్లులు జులై నుండి ఇస్తామని ప్రభుత్వం చెప్పినా రావటం లేదని, వెంటనే తమ స్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వంట సరుకులు ప్రభుత్వమే ఇచ్చేలా చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు ఇచ్చేవరకు పెండింగ్ బిల్లులు ఇచ్చేవరకు, ఆగస్టు 9,10,11, తేదీలలో వంటలు బంద్ చేసి సమ్మె చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పడకంట మురళి, వీరాచారి, కృష్ణకుమారి, చిన్ని, రమాదేవి, ధనలక్ష్మి, సీతారామ, కనకలక్ష్మి, పర్వీన్ బేగం, మస్తాన్ బీ మధ్యాహ్న భోజనం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జీకే బంజారా, డోర్నకల్ రూటు బస్సులను కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-గాంధీచౌక్

జీకే బంజార, డోర్నకల్ రూట్‌లో గతంలో కొనసాగిన బస్సులను కొనసాగించాలని డిఎం ఆఫీస్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడుతూ గతంలో ఈ రూట్లో బస్సులు కొనసాగాయని, ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఆర్టీసీ అధికారులు ఈ బస్సులను ఆపేస్తున్నారని, మళ్ళీ విద్యార్థులు ఏదో నిరసన కార్యక్రమం చేపట్టడం లేదా వినతిపత్రాలు అందజేస్తే బస్సులను నడుపుతున్నారని, ఈ రూట్లో కోయిచలక, కోటపాడు, చిమ్మపూడి, పాపటపల్లి పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు వందమందికి పైగా రోజు విద్యాభ్యాసన కోసం ఖమ్మంకు వస్తున్నారని, బస్సులను ఆర్టీసీ అధికారులు ఆపేయడం వలన విద్యార్థులు నానా అవస్థలకు గురవుతున్నారని ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లో బస్సును ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు సాధిక్, లక్ష్మీ, రమ్య, యాకూబ్ పాషా, వెంకటేష్, శ్రీను, మురళి, నందు, మహేష్, వీరబాబు, ఉపేంద్ర చారి, వంశీ, సంజు, నీరజ్, రఘు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ నులిపురుగులు నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాలతి

నవతెలంగాణ- ఖమ్మం

జాతీయ నులిపురుగులు నివారణ కార్యక్రమంలో బాగంగా గురువారం 1-19 వయస్సు గల పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండ్ జోల్) మింగించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అన్ని ప్రభుత్వ ప్రైవేట్ స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కాలేజీలో పిల్లలకు మాత్రలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆమె చెప్పారు. అలాగే జిల్లా కేంద్రంలో స్థానిక ఇందిరానగర్ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనానంతరం పిల్లలకు మాత్రలు అందించి కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తారని ఆమె చెప్పారు. జిల్లాలో సుమారు 3,11,317 మంది పిల్లలను గుర్తించి వారికి ఈ మాత్రలు మింగిస్తారని, మిగిలిన వేసుకోని పిల్లలందరికీ 10వ తేదీన మాపస్ రౌండ్ ప్రోగ్రామ్ ద్వారా మింగిస్తారని చెప్పారు. జిల్లాలో పిల్లల తల్లి తండ్రులు, ప్రైవేట్ ఆర్గనైజేషన్ సభ్యులు, మహిళా సంఘాలు బాధ్యత తీసుకొని తమ పిల్లలు రక్తహీనతకు గురి కాకుండా కాపాడుకొనేందుకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలకపాత్ర

- జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలకపాత్ర అని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులకు కలెక్టర్ మొదటి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా సెక్టార్ అధికారుల నియామకం చేసి, వారికి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. సెక్టార్ అధికారులు రిటర్నింగ్ అధికారులకు కేటాయించబడతారన్నారు. సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారికి క్షేత్ర స్థాయిలో కళ్ళు, చెవుల లాంటి వారన్నారు. ఒక్కో రిటర్నింగ్ అధికారి క్రింద 20 నుండి 30 సెక్టార్లు ఉంటాయని, ఒక్కో సెక్టార్ అధికారికి 10 నుండి 20 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందని అన్నారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఇస్తారన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని వసతులు, ఓటర్లకు అనుకూలతలు పరిశీలించాలని అన్నారు. తమ పరిధిలోని ప్రాంతంలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ పరిస్థితులు ఎలా ఉన్నాయో చూడాలన్నారు. బూత్ లెవల్ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్హెచ్ఓలను పరిచయం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించి, సమస్యలు చర్చించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల నిర్వహణపై సెక్టార్ అధికారులకు అవగాహన



కల్పించి, ఈవీఎంలపై హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్ నాయక్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

రవీందర్‌ను సత్కరించిన తమ్మినేని

నవతెలంగాణ-వైరాటౌన్

హైద్రాబాద్‌లో మంగళవారం జరిగిన నవతెలంగాణ 8వ వార్షికోత్సవం సభలో సీపీఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు, వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్, నవతెలంగాణ కాలమిస్టు బోడపట్ల రవీందర్‌ను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శాలువా కప్పి, మెమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. బోడపట్ల రవీందర్ నవతెలంగాణ కాలమిస్టుగా ప్రతి శనివారం సైద్ధాంతిక, రాజకీయ, సామాజిక అంశాల పైన వ్యాసాలు రాస్తున్నారు. ఆయన రాసిన వ్యాసాలు ఆంధ్రప్రదేశ్ ప్రజాశక్తి పత్రికలో కూడా రెగ్యులర్ గా ప్రచురిస్తున్నారు. గత పది సంవత్సరాలుగా వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ గా పనిచేస్తూ ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టడీ సర్కిల్ నిర్వహిస్తున్నారు. కరోనా వైరస్ విజృంభణ సమయంలో కూడా విరామం లేకుండా స్టడీ సర్కిల్ నిర్వహించారు. దీంతో నవతెలంగాణ 8వ వార్షికోత్సవం సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జీవశాస్త్రవేత్త డాక్టర్ దేవరాజు మహారాజు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు



తెలకపల్లి రవి, కోటేశ్వరరావు, ఉషాకిరణ్, సుధామ, జ్యోతి, చిదంబరం, రవిచంద్ర తదితరులను శాలువా కప్పి, మెమెంటో ఇచ్చి ఘనంగా సన్మానించారు.

కేసీఆర్ సంక్షేమ పథకాల వల్లే చేరికలు

జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్‌రాజ్

నవతెలంగాణ - బోనకల్



సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి వల్లె ప్రజలు బీఆర్ఎస్‌లో పెద్ద సంఖ్యలో చేరుతున్నారని జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన చైర్మెన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో కాంగ్రెస్ నుంచి 20 కుటుంబాలు మంగళవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రామాలు పెద్ద ఎత్తున అభివృద్ధి చెందాయని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత 24 గంటల ఉచిత కరంట్ అమలు చేస్తున్నారన్నారు. రూ.2016 పెన్షన్, గ్రామాల్లో సీసీ రోడ్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు వేదికలు, రైతు బంధు, రైతు బీమా లాంటి గొప్ప పథకాలు తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బంధం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్ రావు, రజక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తమ్మారపు బ్రహ్మయ్య, మాజీ జెడ్పీటీసీ బనావత్ కొండ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు అల్లిక వితరణ

నవతెలంగాణ -కూసుమంచి

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు రెండు తాగునీటి స్టీల్ డ్రమ్ములు, కోక్యా తండా పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ అందజేశారు. కూసుమంచి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నీరు నిల్వ చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయుల ద్వారా ఆయన దృష్టికి రావడంతో పాఠశాలను సందర్శించి రెండు స్టీల్ నీటి నిల్వ డ్రమ్ములను అందజేశారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ప్రముఖ మ్యాథమేటిక్స్ అధ్యాపకుడు శ్రీనివాస్ ఆకస్మిక మృతికి సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ మ్యాథమేటిక్స్ అధ్యాపకుడు ఆకెళ్ళ శ్రీనివాస్ బుధవారం ఆకస్మిక మృతి చెందారు. ఖమ్మం నగరానికి చెందిన శ్రీనివాస్ గత 4 దశాబ్దాలకు పైగా వేలాది మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి దోహద పడ్డారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఆర్‌జేసి విద్యాసంస్థల అధినేత, యస్‌బిఐటి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ఎస్‌బీఐటీలో జావా ఫౌండేషన్ శిక్షణ

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ వారి సౌజన్యంతో ఒరాకిల్ అకాడమీ వారి 9 రోజుల జావా ఫౌండేషన్ సర్టిఫికెట్ ప్రోగాం ప్రారంభమైనదని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. 195 మంది సియస్‌సి ద్వితీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారని తెలిపారు. ఇందులో భాగంగా ఆబ్జెక్ట్ ఓరియంటెడ్ కాన్సెప్ట్, ఎక్సెప్షన్ హాండ్లింగ్, ఇంటర్ఫేసెస్ మొదలైన వాటిపై ప్రోగ్రామింగ్ నైపుణ్యాలపై శిక్షణ పొందుచున్నారని తెలిపారు. తొలిసారిగా ప్రోడక్ట్ డిజైన్డ్ కంపెనీల ద్వారానే వారు రూపొందించిన టెక్నాలజీలపై శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేయటం జరిగిందని, దానిలో భాగంగా ఒరాకిల్ సంస్థ అభివృద్ధి పర్చిన జావా ఫౌండేషన్ ప్రోగ్రామింగ్‌ను సర్టిఫికెట్ ప్రోగ్రామింగ్గా శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి మాట్లాడుతూ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్లలో విజయం సాధించడం కోసం అవసరమైన అన్ని అవకాశాలను అన్వేషించి వారికి ఉపయోగపడేలా టెక్నాలజీ డెవలప్ చేసిన కంపెనీల ద్వారానే విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి సరైన ప్లేస్మెంట్ సాధించాలంటే సరైన శిక్షణ అవసరమని, అందుకు అనుగుణంగా అత్యున్నత శిక్షణ అందించే సంస్థలతో పాటు టెక్నాలజీ డెవలప్ చేసిన సంస్థలతోనే శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇలాంటి శిక్షణల ద్వారా గత సంవత్సరం 293 ప్లేస్మెంట్స్ సాధించామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంధం శ్రీనివాసరావు, ఎకడమిక్ డైరెక్టర్స్, డాక్టర్ ఎవివి శివప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ జి.సుభాష్ చందర్, డాక్టర్ జె.రవీంద్రబాబు, టిపిఒలు ఎన్.సవిత, ఎ.మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలెం గ్రామాన్ని సందర్శించిన సెంట్రల్ టీం సభ్యులు

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామాన్ని సెంట్రల్ టీం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామంలో కలియతిరిగారు. గ్రామంలో ఉన్న బిసి, ఎస్సి, ఎస్టీ కాలనీలలో ఉన్న గృహాలు పరిశీలించారు. ఇంకుడుగుంతలు, టాయిలెట్స్‌ని వాడే విధానాన్ని చూశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆఫీస్, చర్చ్, మసీదు, సైడ్ కాలువలకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను, పాఠశాల పరిసరాలు, అంగన్వాడీ సెంటర్ పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ జాక్రియా స్వచ్ఛ సర్వక్షణ టిం సభ్యులు పి.రాజేష్‌లతో పాటు గ్రామ సర్పంచ్ చిలుకూరి నాగేంద్రమ్మ, ఎంపీటీసీ అనూష, వైస్ ప్రెసిడెంట్ భద్రమ్మ, ఎంపీడీవో ఆర్.రమాదేవి, ఎంపీఓ, ఏపీయం, ఈసీ సునీల్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు సంఘీభావం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

గత 28 రోజుల నుండి నిరసన నిరాహార దీక్ష చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం సిగ్గు చేటుగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మల్లెల లక్ష్మణరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద టెంటు వేసి తమ న్యాయమైన డిమాండ్‌ల కొరకు చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడేటి బాబురావు, దేవరకొండ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దేవరకొండ అనిల్ కుమార్, బాణవతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ పశు వైద్యకేంద్రంలో పశువులకు గాలికుంటు, నట్టల నివారణ టీకాలు, మందు పంపిణీను ఎంపీపీ సామినేని హరిప్రసాద్ బుధవారం లాంఛనీయంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, పశువైద్యాధికారి పి.అశోక్, పశువైద్య సిబ్బంది తోట యాదగిరి, ఇందిరా, శేఖర్ గోపాలమిత్రులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ

నవతెలంగాణ-తల్లాడ



పాత పినపాక గ్రామంలో బుధవారం పలు కుటుంబాలను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తేలపుట్ల స్వరాజ్యం, ఉప సర్పంచ్ వజ్రాల రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాళ్లూరు నరసింహారావు, సొసైటీ డైరెక్టర్ కాంపాటి జములయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుండి బీఆర్‌ఎస్‌లో పలు కుటుంబాల చేరిక

పాత పినపాక గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన 60 కుటుంబాల వారు ఎంఎల్‌ఏ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వీర మోహన్ రెడ్డి, పెనుబల్లి మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు, కల్లూరు జడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, రైతుబంధు మండలాధ్యక్షులు డి వెంకట్ లాల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.భద్రరాజు, సర్పంచ్ సేలం కోటారెడ్డి, మాజీ సర్పంచ్ మువ్వా మురళి, కంపాటి జములయ్య, మోదుగు ఆశీర్వాదం, వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు మధు కృష్ణ తదితరులు పాల్గొన్నారు,

కర్నాటక సీఎంను కలిసిన కామేపల్లి జెడ్పీటీసీ

నవతెలంగాణ-కామేపల్లి

ఇల్లందు నియోజకవర్గ నాయకులు, జెడ్పీటీసీ బానోత్ వెంకట ప్రవీణ్ కుమార్ నాయక్ గురువారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సిద్ధ రామయ్య , ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిశారు. ఇల్లందు నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఇల్లందులో రెండుసార్లు కాంగ్రెస్ లో గెలిచి పార్టీ మారిన పరిస్థితులను వివరించడంతోపాటు రెండు దపాలుగా మోసపోయి వెనుకబడిన నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.



వీఆర్ఏలకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి

సండ్ర వెంకట వీరయ్యకు ఘన సన్మానం

నవతెలంగాణ-కల్లూరు

వీఆర్ఏలకు విముక్తి కలిగించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఏఎంసీ కార్యాలయం ఆవరణలో వీఆర్ఏలు బుధవారం శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యని ఘనంగా సన్మానించారు. కార్యాలయం ఆవరణలోకి పూలు జల్లుకుంటూ ఘన స్వాగతం పలికారు. అంతరం జరిగిన సభలో వీఆర్ఏల జేఏసీ చైర్మన్ ఎస్‌కే అజీజ్ మాట్లాడుతూ అనేకసార్లు అసెంబ్లీలో తమ సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన సండ్రా కృషి ఎనలేనిదని, మా జీవితాల్లో వెలుగు నింపిన మహా నాయకుడు అని అభివర్ణించారు. ప్రభుత్వానికి సండ్ర వెంకట వీరయ్యకి తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకారంతో ప్రభుత్వానికి అన్ని విధాలుగా ఉపయోగపడుతూ అండగా నిలవాలని కోరారు. తమ జీవితాల్లో వెలుగు నిలిపిన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలంటే పనిచేసే ప్రభుత్వానికే మీ సహకారం అవసరం ఉన్నారు. తనకు ఇంత భారీ ఎత్తున సన్మానం చేసిన వీఆర్ఏలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య, లక్కినేని రఘు, ఎండి ఇస్మాయిల్, వీఆర్ఏ నాయకులు చల్లా లింగరాజు, షేక్ అన్వర్, రమాదేవి, వీరబాబు, బి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్డిఎం టీమ్ లీడర్ సూరంపల్లి

నవతెలంగాణ-కొణిజర్ల

ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల లీడర్ షిప్ డెవలప్‌మెంట్ ఇంచార్జిగా జిల్లా కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ సూరంపల్లి రామారావుని నియమించారు. ఈ మేరకు ఏఐసిసి కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుక చౌదరి చేతులమీదుగా నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి చాలా పెద్ద బాధ్యత గల పదవికి ఎంపిక చేసినందుకు టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకా చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తి, నాయక్ కాంగ్రెస్ నాయకులు ఒక్కంతుల నాగార్జున, రాజేశ్వరరావు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.50 వేలు విరాళం

అండగా ఉంటానన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మాతిపొగు రవికి రెండు కిడ్నీలు పూర్తిగా పాడయిపోయి డయాలసిస్ సహాయంతో రోజులు గడుపుతున్న బాధితున్ని, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య రూ.50 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. రవికి కిడ్నీ దాతలు ఎవరైనా ముందుకు వస్తే శాస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చులు ప్రభుత్వ సహాయంతో చేపిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తన కుటుంబ అవసరాలు, మందులకు అయ్యే ఖర్చులు ఇబ్బందులు పడకుండా ఏర్పాటు చేస్తానని అన్నారు. ధైర్యంగా ఉండాలనీ చెబుతూ త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో రై.స.స. మండల కన్వీనర్ డా.లక్కినేని రఘు, ఎఎంసి వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెడకంటి రామకృష్ణ, బీఆర్ఎస్ మండల సెక్రెటరీ కొరకొప్పు ప్రసాద్, రాచమళ్ళ నాగేశ్వరరావు, చారుగుండ్ల కిరణ్, సందీప్, సర్పంచ్ లు నందిగాం ప్రసాద్, కువ్వారపు విజయరావు, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి బొక్కా వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి స్వరూప రమేష్, దార్ల నరసింహారావు, రామవరపు ప్రసాద్, కట్టా ఆర్లప్ప, ఎనుమల రాంబాబు, నాయకులు మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, యంగల పెంటయ్య, వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా ప్రతినిధులు కిరణ్, ఏనుగుల అంజి, ఇర్ఫాన్, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, నీలాద్రి డైరెక్టర్ బాణోత్ బాలు, మల్లాది బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎంఎంహెచ్‌హెచ్ ఆధ్వర్యంలో ముంపు బాధితులకు నిత్యావసర కిట్లు

నవతెలంగాణ - ఖమ్మం రూరల్

మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ (ఎంఎంహెచ్ హెచ్) ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను నిర్వాహకులు బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని పోలేపల్లి పంచాయతీ నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీతో పాటు రాజీవ్ గృహకల్ప కాలనీలో సుమారు 400 కిట్లను బాధితులకు అందజేశారు. వరద ప్రభావిత ప్రాంతవాసుల దుస్థితి హృదయ విదారకంగా ఉందని, అందుకే వారికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చామని ఎంఎంహెచ్‌హెచ్ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ పంపిణీలో నరేష్, అజయ్, షేక్ అఫ్జల్, నరసింహారావు, కృష్ణమూర్తి, రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ- కల్లూరు

చాలీచాలని జీతాలతో ఇల్లు గడవక ఇబ్బందులు పడుతూనే ప్రభుత్వం ఇచ్చిన పనులన్నీ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, అంగన్వాడి టీచర్లు, ఆయాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు సహకారం అందించాలని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యకి అంగన్వాడి టీచర్లు, ఆయాలు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్ర అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.



శాశ్వత పరిష్కారం చూపండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- పాల్వంచ మురికివాడల్లో పర్యటించిన నేతలు

నవతెలంగాణ-పాల్వంచ

ఇటీవల కురిసిన భారీ వర్షాలు వలన పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నాయని ప్రధానంగా నవభారత్ నుండి శేఖరం బంజర వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని, అధికారులు కంటి తుడుపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సీపీఐ బృందం స్థానిక నవభారత్ నుండి శేఖరం బంజర వరకు దెబ్బతిన్న రహదారిని కల్వర్టను పరిశీలించి స్థానిక ప్రజలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి నిధుల మంజూరిపై ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు. ఇప్పటికే ఇక్కడ ప్రజలు తాగు నీరు లేక, వీధి దీపాలు లేక, రహదారుల ధ్వంసమై, డ్రైనేజ్ వ్యవస్థ సరిగ్గా లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే నవభారత్ నుండి శేఖరం బంజర వరకు ఉన్న బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని కూనంనేని దృష్టికి తీసుకొని రాగా ఆయన మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా ప్రజల సమస్యలను తెలపగా వెంటనే స్పందించిన కమిషనర్ అతి త్వరలో ప్రత్యేక నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, డి.సుధాకర్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, జకరయ్య, బిక్కులాల్, రామకృష్ణ, బాలు, గోపాలరావు, వై.వెంకట్రామయ్య, మాలు జ్యోతి, లక్ష్మి, భద్రమ్మ, రాములమ్మ బద్రు, శ్రీను తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లి పాలే పిల్లలకు బలం

నవతెలంగాణ-ఇల్లందు

పిల్లల ఆరోగ్యానికి తల్లి పాలే పిల్లలకు బలమని 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కడకంచి పద్మ అన్నారు. 13వ వార్డులో బుధవారం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు విజయ కుమారి, నాగమణి, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, అంగన్వాడీ ఆయా ఏఎన్ఎంలు విజయ, నిర్మల, ఆశ వర్కర్, లత పాల్గొన్నారు.

వలస ఆదివాసీ గ్రామంలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-పినపాక

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పినపాక పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గా భవాని సూచించారు. బుధవారం పినపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చింతలపాడు మారుమూల వలస ఆదివాసీ గిరిజన గ్రామంలో డాక్టర్ సింధుజ సుమారు 2 కి.మీ దూరం నడుచుకుంటూ వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ గిరిజనులను పరీక్షించి మందులు అందజేశారు. అనారోగ్యానికి గురయితే దగ్గరలోని ఆశా, ఏఎన్ఎం, హెచ్ఏల వద్ద పరీక్షలు చేయించుకోవాలని, వారి సూచనలు మేరకు వైద్యులను సంప్రదించాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుగుణ దేవి, హెచ్ఏ ప్రవీణ్, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవిద్య పాఠశాలలో ఘనంగా రెడ్ కలర్ డే

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం కూనవరం రోడ్‌లో గల శ్రీవిద్య పాఠశాలలో రెడ్ కలర్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ ఎరుపు రంగు దుస్తుల్లో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నెక్కల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రంగులు నిజానికి ప్రకృతి చిరు నవ్వులని అన్నారు. అమాయక ముఖాలు మెరుస్తూ, ప్రకాశం, ఆనందం, ప్రేమ మరియు ఆనందాన్ని ప్రతిబింబిస్తూ మెరిసిపోయే రోజన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్చార్జి రమ్యశ్రీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి త్రివేణి, హారిక, చిన్నారి ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'తొలి మెట్టుపై' ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-భద్రాచలం

పట్టణంలోని జీహెచ్ఎస్‌లో తొలిమెట్టు రెండు రోజుల వృత్యంత శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. 2, 3 తేదీల్లో తెలుగు, 4,5 తేదీల్లో గణితం, 7,8 తేదీల్లో ఇంగ్లీష్ శిక్షణ ఇస్తారు. తొలి రోజు ప్రారంభమైన శిక్షణ శిబిరాన్ని జిల్లా ఏఎంఓ ఏ.రాజ నాగ శేఖర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.సమ్మయ్య, రిసోర్స్ పర్సన్‌లు ఎం.రమేష్ చందు, వై.వెంకటేష్, టి రామకృష్ణ, కే.జ్యోతి కుమార్, విక్టోరియా మహారాణి, అరుణ, సీఆర్పీలు గోపికృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి

- విప్ రేగాకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని గిరిజన రైతుల ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును కోరారు. బుధవారం మణుగూరు పట్టణంలో గల ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి అసైన్డ్ భూముల సర్వే నంబర్ల నకళ్లను ఆయనకు అందజేశారు. రెండవ విడత సర్వే నిర్వహించి పోడు భూములకు పట్టాలు రాని పోడుసాగుదారులందరికీ పట్టాలు అందజేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలన్నారు. పెద్దనల్లబల్లి పోడుసాగుదారులకు గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా వారి పేర్లు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాలేదని దాని మూలంగా గ్రామ పోడుసాగుదారులకు పట్టాలు మంజూరు కాలేదని వారికి పట్టాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయనకు విన్నవించారు. రేగాను కలసిన వారిలో ఎంపీపీ రేసులక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రదాన కార్యదర్శి కణితి రాముడు, మండల అధికార ప్రతినిధి యండి జానీపాషా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు ఇర్పా చంటి, దిశ కమిటీ సభ్యులు మట్టా వెంకటేశ్వరరావు, నాయకులు దామెర్ల శ్రీనివాస్, కణితి లక్ష్మణ్, కొత్త మల్లేశ్వరరావు(అడ్వకేట్), పొడియం సుబ్బారావు, జిలకర గంగరాజు, పర్ణశాల ఉపసర్పంచ్ వాగె ఖాదర్‌బాబు, వాగె రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

వరద నష్ట పరిశీలనకు కేంద్ర కమిటీ రాక : జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

నవతెలంగాణ-పాల్వంచ

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు వల్ల దెబ్బతిన్న నష్టాన్ని పరిశీలించేందుకు జిల్లాలో కేంద్ర కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం ఐడీఓసి కార్యాలయంలో కేంద్ర కమిటీ పర్యటనపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. మండలం, క్లస్టర్ వారిగా జరిగిన నష్టాలపై వ్యవసాయ, ఉద్యాన, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని చెప్పారు. దెబ్బ తిన్న పంటలపై విస్తీర్ణం, సర్వే నంబర్ వారిగా సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డిఓ మధుసూదన్ రాజు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, డీపీఓ రమాకాంత్, పశుసంవర్ధక శాఖ డిడి పురందర్, వ్యయసాయ శాఖ అధికారి అభిమన్యుడు, ఉద్యాన అధికారి మరియన్న, ఆర్ అండ్ బి భీమ్లా, పిఆర్ ఈఈ మంగ్యా, గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ తానాజి, మిషన్ బగీరథ ఈ ఈ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



- బూర్గంపాడు కొత్త ఎస్ఐకు సవాళ్లు
- చాప కింద నీరులా గంజాయి విక్రయాలు
- అడ్డూ అదుపు లేని అక్రమ ఇసుక రవాణా
- సారపాక, లక్ష్మీపురంలో ట్రాఫిక్ కంట్రోల్ సాధ్యమేనా..?!

బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు కొత్త ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాజ్ కుమార్‌కు మండలంలో నెలకొన్న సమస్యలు సవాళ్ళుగా మారనున్నాయా అంటే అవుననే సమాధానం వస్తున్నది. ఈ గోదావరి, కిన్నెరసాని నది ప్రవాహాల మధ్య బూర్గంపాడు మండలం విస్తరించి ఉండటంతో మండలం పారిశ్రామిక ప్రాంతం కావడం పోలీసులకు ప్రతిసారి సవాళ్ళతో కూడిన సమస్యలా తలెత్తుతున్నాయి. బూర్గంపాడు మినహా సారపాక, లక్ష్మీపురం, మోరంపల్లి బంజర, సంజీవరెడ్డిపాలెం, నకిరి పేట తదితర ప్రాంతాలు పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాలు అభివృద్ధితో పాటు సమస్యాత్మకంగా శాంతి భద్రతలకు ఇబ్బందికరంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజ్ కుమార్, మండలంలో తన మార్కును ప్రదర్శిస్తారా? అనే చర్చ మండలంలో విస్తృతంగా సాగుతోంది.. దీనిపై 'నవతెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం..

నవతెలంగాణ-బూర్గంపాడు

వీటికి కళ్లెం పడేనా..?

బూర్గంపాడు మండలంలో గంజాయి విక్రయాలు చాపకింది నీరులా సాగుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. ప్రధానంగా సారపాక కర్మాగారంలో పని చేసే కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి వారు జీవనం సాగిస్తున్నారు. ఈ సమయంలో సారపాకలో చత్తీస్‌గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ ఉంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సారపాక ప్రాంతాన్ని మినీ భారత్‌గా పిలుస్తుంటారు. అదే సమయంలో గాంధీనగర్ అనే ప్రాంతం గంజాయి విక్రయాలకు అడ్డాగా నిలిచిందని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ నివాసం ఉండటంతో గంజాయి మత్తుపదార్థాలు చాప కింద నీరులా సాగుతున్నాయనేది అందరికీ తెలిసినా బహిరంగ రహస్యం. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి పట్టుకుంటే ఆ పట్టుబడిన వారిలో ఒకరు, ఇద్దరు, ముగ్గురు, గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన వారు ఉండటం గమనార్హం. ఈ మధ్యకాలంలో గంజాయికి పట్టుబడ్డ వారిలో ఈ గ్రామానికి చెందిన వారు ఎక్కువగా దొరకటం విశేషం. ఇది ఇలా ఉండగా ఈ గ్రామానికి చెందిన ఇరువురు సేవా భావంతో కూడిన పనులు చేస్తూ పోలీసులకు సన్నిహితంగా ఉండడంతో గంజాయి విక్రయాలు చాప కింద నీరులా సాగుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఈ ఇరువురు ఎప్పుడు చూసినా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండటం, పోలీసులకు అతి సన్నిహితంగా ఉంటూ ఉండటంవల్ల వారి పని (విక్రయాలు) సజావుగా సాగుతుందని విమర్శలు వెలబడుతున్నాయి. గతంలో పనిచేసిన ఎస్సైలు గంజాయి విక్రయాలపై ఉక్కు పాదం మోపినప్పటికీ అది చాప కింద నీరులా కొనసాగటం కోసమెరుపు. గాంధీనగర్ నుంచి ఈ గంజాయి విక్రయాలు చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో ఇర వెండి , బూర్గంపాడు, లక్ష్మీపురం, రెడ్డిపాలెం తదితర ప్రాంతాలకు చేరుతున్నాయని తెలుస్తోంది. గతంలో పోలీసులు జరిపిన దాడుల్లో ఈ గ్రామాలలో చిన్న చిన్న షాపులలో కూడా గంజాయి ప్యాకెట్లు లభ్యమైన విషయం విధితమే.

అడ్డూ అదుపు లేని అక్రమ ఇసుక రవాణా

మండలంలో అడ్డు అదుపు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా సాగుతున్నప్పటికీ పోలీస్ శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా సారపాక, బూర్గంపాడు, సోంపల్లి ప్రాంతాల్లో ఇసుక రవాణా ట్రాక్టర్ల ద్వారా సాగుతోంది. ఈ రవాణా ఎలా సాగుతుందంటే రాత్రి, పగలు అని తేడా ఉండదు, వర్షం, ఎండ అనే తేడా కూడా ఉండదు. పోలీసులతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఈ ఇసుక అక్రమాలు చేయడం వల్ల పోలీసులపై ప్రధానంగా వెలువ డుతున్న విమర్శ ఇదే..

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సాధ్యమేనా..?

మండలంలో సమస్యాత్మక గ్రామాలపై కొత్త ఎస్ఐ ప్రత్యేక దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కృష్ణ సాగర్, టేకుల చెరువు, సోంపల్లి, పాండురంగా పురం రైల్వే స్టేషన్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, ఉప్పుసాక తదితర ప్రాంతాలు గ్రామాలు సమస్యాత్మక పరిధిలో ఉన్నాయి. అదేవిధంగా సారపాక, లక్ష్మీపురం, మోరంపల్లి బంజర గ్రామాలలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా లక్ష్మీపురం, సారపాక గ్రామాలలో సారపాక ఐటీసీకి ముడి సరుకులు తెచ్చే లారీలు రోడ్డు పక్కనే రోజులు తరబడి ఉండటంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడిన సంఘటనలు ఉన్నాయి.

ఎస్సై మార్కు సాధ్యమేనా?

గతంలో బూర్గంపాడు ఎస్ఐలుగా పని చేసిన పలువురులు తమదైన శైలిలో తమ మార్కును ప్రదర్శించి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పనిచేశారు. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన మండలంలో ఎస్సైగా పనిచేయాలంటే కత్తి మీద సాము లాంటి దని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో గతంలో ఇక్కడ పని చేసిన పలువురు ఎస్సైలు రాజకీయ ఒత్తుడులకు గురై సస్పెండ్ అయిన విషయం కూడా ఇక్కడ జరిగింది. అదేవిధంగా పోలీస్ స్టేషన్ లో జరిగే ప్రతి విషయాన్ని బయటికి చేరవేయటంలో సొంత సిబ్బంది హస్తం ఉందనే విషయం పలుమార్లు బయటపడింది. దీనిపై నూతన ఎస్సై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా వివిధ అక్రమాలకు పాల్పడే కొందరు సన్నిహితంగా పోలీసులతో వ్యవహరించడం.. వారితోనే ఎక్కువగా ఉండటం కూడా పోలీసు వ్యవస్థపై కొంత అపకీర్తిని తెచ్చిపెడుతుందనే విమర్శలు లేకపోలేదు. అటు ప్రతిపక్షాలతోనూ.. ఇటు అధికారపక్షంతోను.. వామపక్షాలతోనూ... అనునిత్యం ఒత్తిడి ఉండే ఈ పోలీస్ స్టేషన్ కు ఎస్ఐ రాజ్ కుమార్ తన మార్కును ప్రదర్శిస్తారా? లేదా? వేచి చూడాల్సిందే...!

కూలి రేట్లు పెంచే వరకు పోరాడాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్
- మూడవ రోజు కొనసాగుతున్న సమ్మె
- కూలీలను అడ్డుకున్న శ్రీనివాస్ పై దాడికి యత్నం
- తిరగబడ్డ వ్యవసాయ కార్మికులు

నవతెలంగాణ-పాల్వంచ

కూలి రేట్లు పెంచే వరకు పోరాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ కూలీలకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ శివారులోని కరకవాగు గ్రామంలో వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె 3వ రోజుకి చేరుకుంది. మూడవ రోజు ఇతర గ్రామాల నుంచి వస్తున్న కూలీలను సంఘం ఆధ్వర్యంలో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్‌లో కూలీలను తీసుకువస్తున్న వ్యక్తి సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ పై దాడికి ప్రయత్నించాడు. దాడికి యత్నించిన వ్యక్తిపై వ్యవసాయ కార్మికులు తిరగబడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, గ్రామాల్లో టంకా వేయించి కూలి రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి, పెన్షన్ 5వేలు ఇవ్వాలి, వ్యవసాయ కార్మికులకు 5 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని, 55 ఏళ్ళు దాటిన వారికి 5వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెక్కల కష్టమే ఆధారంగా బతుకుతున్న పేదలకు ప్రభుత్వం ఏం సాయం చేసిందని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దొడ్డ రవికుమార్ మాట్లాడుతూ సంపద ఉన్నవారికే ప్రభుత్వం సహకరిస్తుంది తప్ప పేదలను



పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సహాయం అందకపోవడంతో వ్యవసాయ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు బుజ్జి, విజయ, రాణి, భవాని, సుభద్ర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు సోయం వీరస్వామి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మారాయిగూడెం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా పని చేసిన అమరజీవి సోయం వీరస్వామి ప్రజా నాయకుడు అని ఆయన స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అమరజీవి సోయం వీరస్వామి ప్రథమ వర్ధంతి సభ ఆయన స్వగ్రామమైన భీమవరం గ్రామంలో గల స్థూపం వద్ద కోడి వీరస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వీరస్వామి చిత్రపటానికి పార్టీ శ్రేణులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ మండల కమిటీ సభ్యుడిగా



కొనసాగుతున్న సమయంలో గత ఏడాది సోయం వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరం అన్నారు. పోడు భూములకు పట్టాలు, తాగు, సాగునీరు, విద్య, వైద్యం కోసం అనేక పోరాటాలు ముందుండి నడిపించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్, భద్రాచలం డివిజన్ కో కన్వీనర్ కారం పుల్లయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, మారాయిగూడెం సర్పంచ్ తొడెం తిరుపతిరావు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోయం జోగారావు, మాజీ వైస్ ఎంపీపీ సోయం నాగమణి, చిట్టిబాబు, సత్యం పాల్గొన్నారు.

కండ్ల కలకలకు భయపడాల్సిన పని లేదు

- దుమ్ముగూడెం వైద్యాధికారి పుల్లారెడ్డి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



కండ్ల కలకలు వచ్చిన వారు భయపడాల్సిన పని లేదని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వద్ద డ్రాప్స్ అందుబాటులో ఉన్నట్లు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పుల్లారెడ్డి అన్నారు. బుధవారం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆర్లగూడెం బాలుర వసతి గృహంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు కండ్ల కలకలు వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కలకలు వచ్చిన వారికి ఆరోగ్య కేంద్రంలో మందులు, డ్రాప్స్ అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సాగర్, హెచ్‌వి శ్యామలత, ఏఎన్ఎం నర్సమ్మ, గంగమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మండలంలోని నర్సాపురం వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం నర్సాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డెంగ్యూ సోకిన జ్వరపీడితులను కలసి వారి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. నర్సాపురం, రేగుబల్లి, డబ్బు రేగుబల్లి గ్రామాల్లో సబ్ యూనిట్ అధికారి హన్మంతు ఆధ్వర్యంలో ఫైరిత్రం స్ప్రే నిర్వహించి యాంటి లార్వాల సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రామకృష్ణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు..

స్వల్పంగా పెరిగిన ఆయిల్ ఫాం గెలలు ధర

నవతెలంగాణ-అశ్వారావుపేట

గత రెండు నెలలగా తగ్గుతున్న ఆయిల్ ఫాం గెలలు ధర ఆగస్టులో స్వల్పంగా పెరిగింది. ఈ పెరిగిన ధర జులైలో సేకరించిన గెలలకు చెల్లుబాటు చేస్తారు. ఈ ఏడాది లో టన్ను గెలలు ధరలు వేలల్లో

నెల	ధర	హెచ్చు తగ్గులు
జనవరి	13781	
ఫిబ్రవరి	13961	180
మార్చి	13943	18
ఏప్రిల్	14205	262
మే	13346	859
జూన్	12623	714
జులై	13091	468

ఆయిల్ ఫాం రైతులు ఈ ఏడు నెలల్లో ఫిబ్రవరి, మే, జూన్ నష్టాలను చవి చూడగా, మార్చి, ఏప్రిల్, జులైలో స్వల్పంగా పెరుగుదలను చూశారు. కనీసం ధర టన్నుకు రూ.15 వేలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

నర్సాపురం సూదిరెడ్డి ఆదిలక్ష్మమ్మ జిల్లా పరిషత్ మెమోరియల్ పాఠశాలలో పాద్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించే వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఏఎమ్ఓ(అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) ఏ.నాగరాజశేఖర్ సందర్శించారు. కోర్స్ డైరెక్టర్ కెవి కాంతారావు, రిసోర్స్ పర్సన్‌లు ఏజె ప్రభాకర్, వి శ్రీనివాస్, ఎస్ రత్నాకర్, ఎస్ కృష్ణార్జున్‌తో పాటు ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు అండగా నిలుస్తున్న దాతలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని కాటాయిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థిని కొర్సా లక్ష్మి ఉన్నత చదువుల కోసం దాతలు తమ దయా హృదయాలను చాటుతూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. విద్యార్థిని పాట్నాలోని ఐఐటీ(ఈఈఈ)లో సీటు సాధించిన సంగతి పాఠకులకు తెలిసిందే. బుధవారం కాటాయిగూడెం గ్రామానికి చెందిన కోడి వెంకటేశ్వరరావు, రమాదేవి, శీలం వీరస్వామి సునీత, గాజుల నాగరాజు, నీలిమ, కుంజా రామారావు, సుజాత, కొర్సా అరుణ, ఆరిఫ్, కొర్సా రమేష్, నాగమణి దంపతులు విద్యార్థిని ఉన్నత చదువుల కోసం రూ 20 వేలు అందజేయగా, కొర్సా సమ్మమ్మ రూ.2 వేలు, నర్సాపురం ప్రభుత్వ వైద్యశాల స్టాఫ్ నర్స్ మాధవి రూ.5 వేలు అందజేశారు. ఐటీసీ బీపీఎల్ వారు విద్యార్థి ఉన్నత చదువుల కోసం పూర్తి బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి

నవతెలంగాణ-మణుగూరు

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని, అంగన్వాడీ టీచర్ హెల్పేర్ సమస్యలు పై ప్రభుత్వం స్పందించాలని బుధవారం అంగన్వాడి టీచర్లు విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒష్టంలో గల అంగన్వాడీ టీచర్ హెల్పేర్‌లు 48 ఏళ్లగా గౌరవ వేతనం పొందుతూ చాలి చాలని వేతనం పొందుతున్నారని అన్నారు. ప్రమోషన్, రిటైర్డ్ మెంట్, బెనిఫిట్స్ పెన్షన్-2016 నుండి పెండింగ్‌లో ఉన్నాయని ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ రానున్న అసంబ్లీ సమావేశాల్లో సీఎంకు వివరిస్తానన్నారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ హెల్పేర్‌లతో శ్రమ దోపిడీ గురి చేస్తూ అదనపు పనులు కేటాయిస్తూ ఇబ్బందులు పాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెర్పుల మల్లికార్జున్, అక్కి నరసింహారావు, తోట రమేష్, నాయకులు కోరేం శ్రీలత, అరుణ, తోడేటి రాజేశ్వరి, సరోజినీ, హంసవేణి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.



బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రెడ్ పంపిణీ

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం పట్టణంలో గోళ్ళగట్ట రోడ్‌లో నిర్వహిస్తున్న కారుణ్య చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉంటున్న 45 మంది విద్యార్థినీ, విద్యార్థులకు బండారు చంద్రారావు (బీసీఆర్) ట్రస్టు ఆధ్వర్యంలో బ్రెడ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ రాష్ట్ర నిర్వాహకులు మచ్చా వెంకటేశ్వర్లు విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ ట్రస్ట్ చేస్తున్న సేవలు వివరించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు గడ్డం స్వామి, సున్నం గంగా, జి.లక్ష్మీకాంత్, జి.రామరాజు, సంస్థ నిర్వాహకులు ఏ.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన బానోత్ చంద్రావతి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరాలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి బుధవారం పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన కొమ్ము దానేలు, దేవరకొండ కొప్పు స్వామి, దంతాల శ్రీను కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని అన్నారు.

మండలానికి నూతన అంబులెన్స్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండలానికి నూతనంగా అంబులెన్స్ రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా వచ్చిన అంబులెన్స్‌ను మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ పద్మ, సబ్ ఇన్స్పెక్టర్ షాహీన, ఎంపీపీ లలిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు ఆరోగ్య కేంద్రానికి వెళ్ళడానికి ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటికి అంబులెన్స్ వస్తుందని నూతన మండలానికి కొత్త అంబులెన్స్ రావడం చాలా సంతోషం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాధర్, వెంకట్,వనమా గాంధీ, భీముడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాట్లు వేసిన ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని మసి వాగు గ్రామపంచాయతీ ధర్మా తండా రోడ్డు మార్గంలో వరి పొలంలో మహిళా రైతు కూలీలను ఆప్యాయంగా పలకరించి కూలీలతో కలిసి రైతు కూలీగా ఎమ్మెల్యే హరిప్రియ నాట్లు వేశారు. మహిళా రైతు కూలీలు ఆనందం వ్యక్తం చేస్తూ ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే ఒక సాదాసీదా మహిళగా తమతో పాటు వరి పొలంలో నాటు వేసినందుకు గానూ ఆనందం వ్యక్తం చేశారు.

మణుగూరు సీఐగా బాలాజీ వరప్రసాద్

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు సీఐగా బాలాజీ వరప్రసాద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావుని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

అందుబాటులోకి వచ్చిన క్రీడా సామగ్రి

నవతెలంగాణ-అశ్వారావుపేట



గ్రామీణ యువతీ, యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఇప్పటికే ప్రతీ ఆవాసం లోనూ రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఆటలకు అనువైన క్రీడా ప్రాంగణాలకు ఎస్ఏటీఏ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్) ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఒక్క క్రీడా ప్రాంగణానికి క్రికెట్ కిట్లు 2, వాలీ బాల్ కిట్లు 2, డంబెల్స్ 3, డిస్క్ త్రో, టెన్నికాయిట్ రింగ్, స్కిప్పింగ్ రోప్‌తో పాటు 75 స్పోర్ట్స్ టి.షర్ట్‌లతో కూడిన సామగ్రిని సరఫరా చేస్తుంది. వీటిని డీఎస్ఏ (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ) ద్వారా మండల కేంద్రాలకు సరఫరా చేస్తుంది. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలం క్రీడా ప్రాంగణాలకు అవసరం అయిన క్రీడా సామగ్రి బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. ఈ సామగ్రిని ఎంపీడీఓ శ్రీనివాస రావు, ఏపీఓ నరేష్‌లు ఆ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎస్ఏ ఆదేశాలు మేరకు సామగ్రిని సంబంధి కార్యదర్శులకు అందజేస్తామని తెలిపారు.

ఎస్సైని కలిసిన నాయీ బ్రాహ్మణ సోదరులు



నవతెలంగాణ-చంద్రుగుండ

పోలీస్ స్టేషన్‌కు నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మాచినేని రవిని నాయి బ్రాహ్మణ సంఘం తరపున మర్యాదపూర్వంగా బుధవారం కలిశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ మండల అధ్యక్షుడు కొలిపాక అప్పారావు (అభి), జిల్లా గౌరవ సలహాదారుడు దడిగల మల్లేష్, జిల్లా ఆర్గనైజేషన్ రాచకొండ నాగేశ్వరరావు, కుదురుపాక నరసింహారావు, దడిగల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ బయ్యారం సీఐగా శివప్రసాద్

నవతెలంగాణ-పినపాక



ఏడూళ్ళ బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కాగితోజు శివ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడూళ్ళ బయ్యారం ఎస్ఐ పఠాన్ నాగుల్ మీరా ఖాన్ నూతన సీఐ శివ ప్రసాద్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు. పినపాక, కరకగుడెం మండలాల సర్కిల్ పరిధిలో ఏడూళ్ళ బయ్యారం, కరకగుడెం పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. నూతన సీఐ శివ ప్రసాద్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పినపాక, కరకగూడెం మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులు, అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పఠాన్ నాగుల్ మీరా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

- విలేకరుల సమావేశంలో సీఐ రవీందర్

నవతెలంగాణ-అశ్వాపురం



శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని అశ్వాపురం సీఐ రవీందర్ కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత మద్యం మత్తు వంటి వ్యసనాలుకు అలవాటు పడి విలువైన జీవితాలను అన్యాసనం చేసుకోవద్దన్నారు. యువత మద్యం మత్తులో రాత్రులంత గ్రామాలలో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులే అని చట్టాలపై అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి : ఎంపీపీ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



మండలంలో వర్షాలు కురవడంతో పేరుకుపోయిన చెత్తాచెదారం వలన సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున అన్ని గ్రామ పంచాయతీలలో శానిటేషన్ పనులు విరివిగా చేపట్టాలని తెలియజేసిన ఎంపీపీ భూక్య సోనా అన్నారు. బుధవారం ఆమె సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శానిటేషన్, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి మండలంలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల నుంచి దూరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సకినాల రమేష్, ఎంపీఓ శ్రీనివాసరావు, ఏపీవో వీరన్న, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి గాలి కుంటునివారణ టీకాలు

- మండల పశు వైద్యాధికారి రమేష్ బాబు

నవతెలంగాణ-దమ్మపేట



ఈ నెల 7 నుంచి గాలి కుంటు నివారణ టీకాలు వేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మన్యం రమేష్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో గేదెలకు తెల్ల పశువులకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువుల్లో వ్యాధి నిరోధక టీకాలు చేసే ముందు నట్టల నివారణ మందుల కార్యక్రమం చేపడితే ఆ టీకా ఎక్కువ కాలం నిరోధక శక్తి పెంపొందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముష్టిబండ, నాచారం, ముద్దుల గూడెం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న

నవతెలంగాణ-కొత్తగూడెం



వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్ పరిధిలో ఉన్న ఎంసిఎచ్ జీజీహెచ్, మెడికల్ కాలేజ్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌కి, అసుపత్రి సూపరింటెండెంట్‌కి కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ సహారా సెక్యూరిటీ సర్వీస్ ప్రారంభమై 10 నెలలు కావస్తుందని 10 నెలల నుండి కూడా ఈఎస్ఐ, పీఎఫ్ లెక్కలు తేల్చకుండా తాస్సారం చేస్తున్నారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు అనిల్, ఆది, సుగుణ, డి.లక్ష్మీ, కమల, శివారెడ్డి, శ్రీలక్ష్మి, రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం

- 28వ రోజు సమ్మెను ప్రారంభించిన జిల్లా జేపీసీ చైర్మెన్ ఏజే రమేష్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని జిల్లా జేపీసీ చైర్మెన్ ఏజే రమేష్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ ఆఫీస్ ముందు జేపీసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మెకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుక అధ్యక్షతన జరిగినది. ఈ సభను ఏజే రమేష్ ప్రారంభించి మాట్లాడుతూ 28 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె నడుస్తున్నా భద్రాచలం పట్టణం, గోదావరి ప్రభావిత మండలాలలో గోదావరి వరదలు దృష్టిలో పెట్టుకొని, ప్రజల శ్రేయస్సు కోసం మానవతా దృక్పథంతో నిన్నటి వరకు కార్మికులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని విధులకు హాజరవ్వడం జరిగిందన్నారు. వరదలు పూర్తిగా తగ్గిన తరువాత తిరిగి మళ్లీ సమ్మెలోకి వచ్చిన కార్మికులకు అభినందనలు, మీ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పట్టుదలతో సమ్మెను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం, రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా ఏఐటీయూసీ, జిల్లా నాయకులు, ఆకోజుసునీల్ కుమార్, మాట్లాడారు. సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ ప్రముఖ లాయర్, పి.తిరుమల రావు, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శులు సభ్యులు బండారుశరత్ బాబు పాల్గొని సంఘీభావం తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, జిల్లా నాయకులు, నాగరాజు, రామకృష్ణ, డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు సతీష్, ప్రేమ్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు రవి, చెన్నకేశవులు, పి.శ్రీనువాసు, ప్రేమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : పోటీ కార్మికులను పెట్టి పారిశుద్ధ్య పనులు చేయించాలని అధికారులు చూస్తున్నారని, పోటీ కార్మికులను జీపీ కార్మికులు బుధవారం అడ్డుకొని వాళ్ళని వెనుకకు పంపించారు. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 28 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వం మాకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 31 జీపీ కార్మికులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె సమయంలో బతుకమ్మ ఆడి కార్మికులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ కార్మికులు తమ చాలీచాలని వేతనాలతో బతకలేమని తమ ఆకలి మంటలతో నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు వెళ్లకుండా గ్రామపంచాయతీ కార్మిక జేపీసీని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు కామేశ్వరరావు, అప్పన్న, రాజపుత్ర రంజిత్ సింగ్ (నందు), విజయ్, మహేష్, భూషణం, బుజ్జమ్మ, దీనమ్మ, పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలని మెచ్చాకి వినతి

నవతెలంగాణ-దమ్మపేట



వీవోఏల తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ గ్రామాల్లో పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న వీవోఏల పట్ల చిన్నచూపు తగదని అన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, శ్రీలత, పద్మ, శ్రీదేవి, చెన్నమ్మ, కృష్ణకుమారి, దేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బదిలీ

నవతెలంగాణ-అశ్వాపురం

మండల తహశీల్దారుగా పనిచేస్తున్న ఎంఏ రాజు బదిలీ అయ్యారు. ఆయనను ఖమ్మం జిల్లా వేంసూరు మండల తహశీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. గత కొన్ని నెలలుగా మండలంలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన తనదైన శైలిలో ప్రజలకు సేవలు అందించారు.

ప్రాణాలు పోయినా స్థలాలు వదలం

- విలేకరుల సమావేశంలో గుడిసె వాసులు

నవతెలంగాణ-ఇల్లందు



దశాబ్దాలుగా గూడు లేక అద్దె ఇండ్లలో ఉంటున్నాం. కులిపనులు చేసుకుని బతుకుతున్నాం. ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నప్పటికీ మాకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు గాని డబల్ బెడ్ రూమ్ కానీ ఖాళీ స్థలాలు ఇవ్వడం చేయలేదు. దీంతో మండలంలోని మల్లు స్వరాజ్యం నగర్ (బాలాజీ నగర్)లో గత యేడాది 25 మంది 15గుంటల స్థలంలో గుడిసెలు వేసుకున్నారని వారికి అండగా నిలిచినందుకు వైస్ ఎంపీపీ ప్రమోద్, వాళ్ళ అన్న కలిసి దౌర్జన్యం చేస్తు కేసులు పెడుతు హింసిస్తున్నారని భూ పోరాట నాయకురాలు జరిపోతుల శాంతమ్మ, వంగూరి నాగమ్మ మరో 25 మంది గుడిసె వాసులు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వైస్ ఎంపీపీ ప్రమోద్ ఆధ్వర్యంలో రాములు, శంకర్, పద్మ, కుమారి, మల్లేష్, ఉపసర్పంచు తదితరులు దౌర్జన్యం చేసి గుడిసెల మీదికి పంపుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. స్థలాలు ఖాళీ చేయాలని కాగితాలు ఉన్నాయంటూ రకరకాలుగా ఒత్తిడిలు చేస్తున్నారని అన్నారు. పోరాట కేంద్రం స్థలంలో ఇళ్ళు కూల్చి పంచాయతీ ఆఫీసు కట్టాలని చెబుతూ రోడ్డును మరికొంత స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ఎత్తులు వేస్తున్నారని తెలిపారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉండి జనాలను మీదికి తీసుకువచ్చి కొట్టడానికి వస్తు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. నా ప్రాణాలు పోయినా సరే ప్రాణాలైనా ఇస్తాం భూములు వదలమని పేదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.



ఇప్పటికే అనేక కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఫైన్‌లు కూడా కట్టామని, పోలీసుల నుంచి ఫోన్లు వస్తున్నాయని స్టేషన్కు రమ్మని పిలుస్తున్నారని, నోటీసులు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనశ్శాంతిగా ఉండనీయకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. భూములు స్థలాలు ప్రభుత్వానికి చెందిన వని వైస్ ఎంపీపీ వాళ్ళ అన్నకు ఇతరులకు సంబంధం లేని విషయం అని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వీళ్ళ ఆగడాలు అరికట్టాలని భూములన్ని పేదలకు చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. విలేకరుల సమావేశంలో పాయం రాధమ్మ, సోలం సుక్కమ్మ, జరుపల సుజాత, మల్లం కమలమ్మ, సోలం సరస్వతి, బెజ్జంకి స్వరూప, జయతుం, సలేంద్రా లక్ష్మీ, వన్ పొన్నం త్రివేణి, ఏలూరు స్రవంతి తదితర గుడిసె వాసులు పాల్గొన్నారు.

బొగ్గురవాణా కుంటుపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఏరియాల జనరల్ మేనేజర్లతో సమీక్ష సమావేశంలో ఎన్.శ్రీధర్

నవతెలంగాణ-ఇల్లందు



వర్షాలు వల్ల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తెలంగాణ, ఇతర రాష్ట్రాలలో గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా ఏరియాల వారీగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సింగరేణి సంస్థ చైర్మెన్, ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన సంస్థ డైరెక్టర్లు, అడ్వైజర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బుధవారం బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో నిలిచిన నీటిని తోడి బయటకు పంపించడానికి ఇంకా అవసరమైతే మరిన్ని పంపులను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆగస్టు నెలలో రోజుకు కనీసం 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 1.95 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని, రోజుకు కనీసం 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని, అందుకు ప్రణాళికబద్ధంగా తగు చర్యలు చేపట్టాలని ఏరియాల జీఎంలను ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే నిర్దేశిత రోజువారి బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా లక్ష్యాలు సాధించాలని, ఈ ఆర్థిక సంవత్సరం చివరి కల్లా కనీసం 720 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని దాటాలని పిలుపునిచ్చారు. కొత్త గనులను కూడా సకాలంలో ప్రారంభించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన ఏరియా జీయంలను కోరారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయనతో పాటు డైరెక్టర్ ఈఅండ్ఎం శ్రీ డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్.వి.కె.శ్రీనివాస్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ శ్రీ జి.వెంకటేశ్వర్ రెడ్డి, అడ్వైజర్ మైనింగ్ డి.ఎన్.ప్రసాద్, అడ్వైజర్ ఫారెస్ట్రీ సురేంద్ర పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జె.ఆల్విన్, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎం.సురేష్, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు జక్కం రమేష్ (సీపీపీ), సుబ్బారావు (ఎంపీ), అన్ని ఏరియా నుంచి ఏరియాలో జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

- 10న మాప్ అప్ డే కార్యక్రమం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు

నవతెలంగాణ-కొత్తగూడెం

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని గురువారం జిల్లాలో నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎంత మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణిచేయాలనే విషయంలో ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏఏ వయసు వారికి ఎంత మోతాదులో మందులు పంపిణీ చేయాలని విషయంలో వైద్య సిబ్బందికి పూర్తిఅవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు మాత్రలు మింగలేని పరిస్థితి ఉన్నందున వారికి మందును ద్రవరూపంలోకి మార్చి వారికి అందించేందుకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా 1సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం మొత్తం 3,36,136 పిల్లల్లో నులిపురుగుల నివారణకు ట్యాబ్లెట్లు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

3,36,136 మందికి మాత్రల పంపిణీకి సిద్ధం

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ నిర్వహణకు జిల్లాలోని 2060 అంగన్ వాడీ కేంద్రాలు, 1676 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 88 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 86 ట్రైబల్ వెల్ఫేర్, 30 సోషల్ వెల్ఫేర్, 17 బిసి వెల్ఫేర్, 12 మైనారిటీ వెల్ఫేర్, 27 టెక్నికల్ ఎడ్యుకేషన్ కళాశాలలలో ట్యాబ్లెట్లు అందించేందుకు సిద్దం అయ్యారు. మొత్తం 1754 పాఠశాలలు, కళాశాలల్లో మొత్తం 3,36,136 మందికి మాత్రను పంపిణీ చేయుటకు ప్రణాళిక సిద్ధం చేయటం జరిగింది. ఈ కార్యమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వి.ఎల్ శిరీష, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బాలాజీ నాయక్ కోరుతున్నారు.

రైతు బంధు పైకాన్ని పాత బకాయిల కింద జమ చేసుకోవద్దు

- ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ



రైతుల బాగోగుల కోసం పెట్టుబడి సాయం కింద కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాకరంగా చేపట్టిన రైతుబంధు సాయాన్ని బ్యాంకు అధికారులు పాత బకాయిల కింద జమ చేసుకోవడం అన్యాయమని, పైకాన్ని వెంటనే రైతులకు చెల్లించకపోతే ఆందోళన చేస్తామని ఉమ్మడి ఖమ్మం జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలం పరిధిలోని సోములగూడెం పంచాయతీ కమ్మరిగూడెం గ్రామ రైతులకు ఇటీవల మంజూరు అయిన రైతుబంధు పైకం పాల్వంచ యూనియన్ బ్యాంకులో ఉన్న రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. రైతుబంధు పైకం కోసం రైతులు బ్యాంకు చుట్టూ తిరిగిన, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడాన్ని రైతులు కొత్వాల దృష్టికి తీసుకువెళ్లారు. విషయం విన్న వెంటనే స్పందించిన కొత్వాల బుధవారం యూనియన్ బ్యాంకుకు వెళ్ళి మేనేజర్ శ్రీకాంత్‌ను నిలదీశారు.

ఈ విషయమై స్పందించిన బ్యాంకు అధికారులు, రైతుల ఖాతాల్లో జమ అయిన అన్ని రకాల పథకాల పైకాన్ని వెంటనే అందజేస్తామని, కొత్వాల సాక్షిగా పైకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జమ్ముల వీరస్వామి, కందుకూరి రాము, సోయం రాజేష్, బొందిల రాంబాబు, లీలాకృష్ణ, వెంకట్రావు, సొసైటీ సీఈఓ జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి చేరుకున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

నవతెలంగాణ-టేకులపల్లి



ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలో జులై 25 నుండి ఆగస్టు 7వ తేదీ వరకు జరిగే సంఘర్షణ సైకిల్ యాత్ర బుధవారం టేకులపల్లి మండలం కేంద్రానికి చేరుకున్నది. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భయ్యా అభిమన్యు అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యాసంక్షేమమే ధ్యేయంగా ప్రకటించిందని, అధికారం చేపట్టి నేటికీ 9 సంవత్సరాలు పూర్తవుతున్నా సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం చేసిన పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్ కుమార్, ఉపాధ్యక్షుడు భూపేందర్, బోడా అభిమిత్ర, పాటల గోపి, నాగ కృష్ణ, వెంకటేష్, రామ్ చరణ్, ప్రవీణ్, పవన్, అనిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసాత్మక దాడులకు నిరసన

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మణిపూర్‌లో స్త్రీలపై హింసాత్మక ఘటన చాలా దుర్మార్గమని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు అందరూ కలసి బుధవారం ప్రధాన సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యల నుండి రక్షించండి

- పీడిని వేడుకున్న బాధిత మహిళలు
- న్యాయం జరగని పక్షంలో పోరాటం : ఐద్వా

నవతెలంగాణ-కొత్తగూడెం



ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఆర్పీలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వారి నుండి రక్షించాలని ఇల్లందు మెప్మా ఇన్‌చార్జీ, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘును బాధిత మహిళలు వేడుకున్నారు. బుధవారం ఈ మేరకు వారి బాధలను వివరిస్తూ ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు.

న్యాయం చేయాలి : ఐద్వా

బాధిత మహిళ విషయంలో విచారణ జరిపి వేదింపులు నుండి విముక్తి కల్పించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళన చేయాల్సి వస్తుందని జిల్లా ఐద్వా సహాయ కార్యదర్శి సందకూరి లక్ష్మీ హెచ్చరించారు. బాధితురాలితో కలిసి మున్సిపల్ కమిషనర్ రఘుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఆర్పిలు కనకరాజుల సుధారాణి, శెట్టి సునీత, సరస్వతి ఉన్నారు.



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు హాజరు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విద్యార్థులకు విద్యా రంగానికి విద్యార్థి సంఘాలను దూరం చేయలేరని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం పీడీఎస్‌యు డివిజన్ కార్యదర్శి మునిగిళ్ళ శివప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాజకీయ పార్టీలు ప్రజా పంథా పార్టీ డివిజన్ కార్యదర్శి కెచేల కల్పన, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి సరేలా నరేష్, భద్రాచలం జేఏసీ కన్వీనర్ నాగేశ్వరరావు, ప్రజా సంఘాలు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజు, టీపీటీఎఫ్ మునిగడప రామాచారి, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్, మాజీ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా నాయకులు, ఉపాధ్యాయదర్శిని సంపాదకవర్గ సభ్యులు రైతు సంఘం డివిజన్ కార్యదర్శి కొండ చరణ్, వ్యకాస దాసరి సాయి తదితర ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో గర్ల్స్ ఆశ్రమ పాఠశాలలో బాయ్స్ టీచర్స్‌ని ఉండవద్దని విద్యార్థులకు న్యాయమైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం ప్రజాపంథా పార్టీ పోరాటంలో ముందుంటామని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తామన్నారు.

సీతారామయ్య మృతి తీరని లోటు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న రామకృష్ణ సాయి మిల్లు యాజమాన్యం మల్లాడి సీతారామయ్య అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీ వెంకటేశ్వర కార్పెంటర్ యూనియన్ ఆధ్వర్యంలో సీతారామయ్య మృతదేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు అనుగోజు మధుసూదనాచారి మాట్లాడుతూ... మల్లాడి సీతారామయ్య వారి సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమం దీక్షలు నరసింహ చారి, అప్పారి రాము, బొద్దు శ్రీను, సత్యనారాయణ, శ్రీను, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధ పడొద్దు...

అమ్మాయిలు చిన్న చిన్న విషయాలకే బాధపడిపోతుంటారు. ఇలా మాట్లాడితే.. ఇలా చేస్తే.. ఎవరైనా ఏమన్నా అనుకుంటారేమోనని ఇబ్బంది పడడం, మదన పడటం సాధారణం.. అయితే శరీరం గురించి కానీ.. చుట్టూ ఉన్నవాళ్ల గురించి కానీ.. లేదా మాట్లాడే మాటలు, చేసే పనులు.. ఇలా దేని గురించైనా సరే.. ఇబ్బంది కానీ బాధ కానీ పడాల్సిన అవసరం ఏ మాత్రం లేదు. మరి, ఎక్కువ మంది అమ్మాయిలు ఏ విషయంలో ఇబ్బంది పడతారో.. దాని గురించి అసలు అంతగా పట్టించుకోవాల్సిన అవసరం ఎందుకు లేదో తెలుసుకుందాం...

నో చెప్పడం... : పనంతా పూర్తిచేసుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతూ ఉండగా కొలీగ్ "కాస్త ఈ పని చేసి పెట్టవా.. నాకు చాలా పని ఉంది" అంటూ అడగగానే.. ఇంట్లో అర్జంట్ పని ఉన్నా.. ఒప్పుకోకపోతే అవతలి వ్యక్తి ఏమనుకుంటారో అని ఇబ్బందిపడుతూ ఒప్పుకుంటారు. తన పనిని మీకు అప్పగించిన కొలీగ్ మాత్రం కాసేపట్లో ఇంటికి వెళ్లిపోతే.. తన పనిని భుజాలపై వేసుకొని మీరు రాత్రి వరకూ పనిచేస్తూ ఉండిపోతారు. అందుకే పని విషయంలోనే కాదు, నచ్చని విషయం ఏదైనా సరే.. దానికి ఖరాఖండీగా నో చెప్పేయండి. అవతలివారు ఏమనుకుంటారో, భవిష్యత్తులో మీకు ఏదైనా ఇబ్బంది ఎదురవుతుందేమో, అంటూ ఇలా రకరకాల కారణాలు మీకు మీరే చెప్పుకొని నచ్చని పని చేయవద్దు. కొన్నిసార్లు ఎదుటివాళ్లు మీరు మంచివాళ్లు కాదనుకున్నా సమస్యలేదు. వారి అవసరం అలా మాట్లాడిస్తుందంతే.

నచ్చని ఉద్యోగం : కొందరు చేసే ఉద్యోగం నచ్చకపోయినా చేయాల్సి వస్తోంది అని బాధపడుతూ ఉంటారు. కానీ చేసే ఉద్యోగం పెద్దగా నచ్చకపోయినా మనం చేసే ప్రతి పని మనకు ఎన్నో పాఠాలను నేర్పుతుంది. అందుకే పాఠాలను నేర్చుకుంటూ నచ్చిన ఉద్యోగం కోసం వెతుక్కోవాలే తప్ప.. మనసులో బాధ నింపుకోకూడదు.

కాస్త సమయం.. : జీవితంలో ఎత్తుపల్లాలుంటాయి. కొంత మందికి వైవాహిక బంధం అద్భుతంగా ఉందనుకున్నా కొన్ని రోజులకే వివిధ కారణాల వల్ల విడిపోవాల్సి రావచ్చు. ఇది మనసుకు బాధనిపించడం సహజమే. ఇలాంటి సందర్భాల్లో ఏడిస్తే మనం బలహీనులమని ఎదుటివారు ఎక్కడ అనుకుంటారో అని ఇబ్బందిపడితే నష్టం మనకే. కాబట్టి మీలోని బాధను కన్నీళ్ల రూపంలో బయటకు పంపించేయండి. మర్చిపోవడానికి మీకంటూ కాస్త సమయాన్ని ఇచ్చుకోండి. త్వరగా మర్చిపోలేకపోతుంటే మీరు బలహీనులని భావించొద్దు. మీరు అవతలి వ్యక్తిని అంత బలంగా ప్రేమించారు కాబట్టి మర్చిపోవడానికి కాస్త సమయం పడుతుందని భావించి జీవితంలో ముందుకెళ్లండి.

బరువు : కాస్త బరువు పెరిగితే చాలు... చాలామంది అమ్మాయిలు తెగ బాధపడిపోతుంటారు. అయితే ఆ బరువు నచ్చిన రెస్టారెంట్‌లో, ఎంతో ఇష్టమైన వ్యక్తులతో కలిసి కూర్చొని తినడం వల్ల పెరిగారని గుర్తుచేసుకోండి. ఆ అందమైన జ్ఞాపకాల ముందు ఈ కొద్దిపాటి బరువు ఏపాటిది? అందుకే దీని గురించి బాధపడడం మానేసి, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బరువు తగ్గించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టండి.



మనసు తేలిక : కొందరు బ్రేకప్‌ని తట్టుకోవడానికి స్నేహితులతో ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు. లేదంటే కొన్ని వ్యసనాలకు బానిసలౌతుంటారు. కోపంతో అతడికి ఫోన్ చేసి తిట్టి.. తర్వాత బాధపడుతూ కూర్చోవద్దు... ఇవన్నీ మనసు ఎప్పటి నుంచో ఫీలవుతున్న విషయాలు... అందుకే అలా బయటకొచ్చేశాయి. కాబట్టి ఇలాంటి చిన్న విషయాల గురించి ఆలోచించి బాధపడకుండా, మనసు తేలిక పడిందని ఆనందించాలి.

మీ కోసం... : చాలామంది కుటుంబం కోసం ఖర్చు చేయడానికి ఏ మాత్రం వెనుకాడరు. కానీ తమ కోసం ఏదైనా కొనాలంటే మరీ ఎక్కువ ఖర్చు చేస్తున్నామని బాధపడుతూ ఉంటారు. అయితే మీరు ఖర్చు చేసేది మీరు కష్టపడి సంపాదించిన డబ్బు. దాన్ని మీ కోసం ఖర్చు చేయడంలో ఏ మాత్రం తప్పు లేదని గుర్తుంచుకొని బాధపడడం మానేయండి.

తప్పు కాదు : మీ బెస్ట్‌ఫ్రెండ్, మీరు కొన్నేళ్ల నుంచి కలిసి ఉన్నారు. కానీ మీ ముందు బాగుంటూ మీ వెనుక మీ గురించి తప్పుగా చెబుతోందని తెలిసిందా? లేక మీ ఇద్దరి మధ్యా ఏదైనా గొడవ వచ్చి విడిపోయారా? అయితే దీని గురించి తప్పుగా మాట్లాడే వ్యక్తితో విడిపోవడం మీకే మంచిది. కొన్ని రోజులు స్నేహితురాలు లేని లోటు తెలుస్తుంది. కానీ తనని వదులుకోవడం మీ తప్పు కాదు కాబట్టి బాధపడకండి.

సక్సెస్ సాధించడం : ఒక మహిళ సక్సెస్ సాధిస్తోందంటే కేవలం పని వల్లే కాదని.. ఇంకేదో చేస్తోందని అనే వాళ్లు ఎంతో మంది ఉంటారు. కానీ ఎలాంటి పనులు చేశారో మీకు తెలుసు కాబట్టి ఎవరో అనే మాటలను పట్టించుకుని బాధపడాల్సిన అవసరం లేదు. మీరు పడే కష్టానికి వచ్చే ప్రతి విజయాన్ని ఆస్వాదిస్తూ ముందుకు సాగండి.

వడలు తిందామా..!



మిల్లెట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. వీటితో అనేక రకాల పిండి వంటలను చేసుకోవచ్చు. అందులో వడలు చాలా రుచిగా ఉంటాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంతో ఇష్టంగా తినే ఈ వంటకాలు ఇంట్లో సులువుగా చేసుకోవచ్చు. ఆరోగ్యానికి ఆరోగ్యం.. రుచికి రుచి.. ఇప్పుడే ట్రై చేయండి..

జొన్నలతో...

కావలసిన పదార్థాలు : జొన్న పిండి - కప్పు, ఉల్లికాడ - అర కప్పు, ఉల్లిగడ్డ - రెండు, కరివేపాకు - రెండు రెమ్మలు, ఉప్పు - రుచికి సరిపడా, అల్లం వెల్లుల్లి పేస్ట్ - చెంచా, జిలకర - చెంచా, గరం మసాలా - అర చెంచా, కారం - అర చెంచా, పసుపు - అర చెంచా, పచ్చి శనగ పప్పు లేదా స్వీట్ కార్న్ - అర కప్పు, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం : ఒక గిన్నెలోకి సన్నగా తరిగిన ఉల్లిగడ్డ ముక్కలు, ఉల్లికాడలు (లేకపోతే స్కిప్ చేయండి) వేయాలి. అందులోనే సన్నగా తరిగిన కరివేపాకు, పచ్చిమిర్చి, జీలకర్ర, పసుపు, కారంపొడి, ఉప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద అన్ని వేసి బాగా కలుపుకోవాలి. నీటిని వాడకుండానే పిండి మొత్తాన్ని కలపాలి. కలిపే క్రమంలో అవసరాన్ని బట్టి కొంచెం నీటిని యాడ్ చేసుకోవాలే తప్ప ముందు పోయకూడదు. పిండి మొత్తం బాగా కలిసిన తర్వాత పది నిమిషాలు పక్కకు పెట్టుకోవాలి. తర్వాత స్టవ్ మీద కడాయి పెట్టి అందులో నూనె పోసి పిండిని చిన్న చిన్న ముద్దలుగా విభజించుకుని వడల్లా చేసుకుని నూనెలో వేయాలి. దోరగా వేగాక తీసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

అలసందలతో....

కావలసిన పదార్థాలు : అలసందలు - రెండు కప్పులు, పచ్చిపప్పు - ముప్పావు కప్పు, బచ్చలికూర లేదా మునగ ఆకులు - రెండు కప్పులు (ఆకులు చిన్నగా కట్ చేసుకోవాలి), ఎర్ర మిరపకాయలు - రెండు లేదా మూడు (కారాన్ని బట్టి) పచ్చిమిర్చి - రెండు లేదా మూడు (కారాన్ని బట్టి), అల్లం, వెల్లుల్లి పేస్టు - చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, ఉల్లిగడ్డ - రెండు (మీడియం సైజు), కరివేపాకు - రెండు రెమ్మలు, కొత్తిమీర - పావు కప్పు, నూనె - వేయించడానికి సరిపడా.



తయారు చేసే విధానం : ఒక గిన్నెలోకి వడలు తీసుకోని కడిగి నాలుగు నుంచి ఐదు గంటలు నాననివ్వాలి. కొంత మందికి పొట్టు ఉంటే నచ్చదు. అలా నచ్చని వాళ్ళు పొట్టు పోయేదాకా కడిగేసుకుని పక్కన పెట్టుకోవాలి. పచ్చి పప్పును ఒక గంట నానబెట్టి, కడిగేసి పక్కన పెట్టుకోవాలి. ఈ రెండింటిని కలిపి మిక్సి జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. వేరొక జార్‌లో ఎర్ర మిరపకాయలు, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, ఉప్పు వేసి గ్రైండ్ చేసి అందులో కలపాలి. ఇందులోనే ఉల్లిగడ్డ, కరివేపాకు, కొత్తిమీర తరుగు, బచ్చలికూర లేదా మునగ ఆకుల తరుగు వేసి బాగా కలపాలి. స్టవ్ మీద కడాయి పెట్టి ఫ్రైకి సరిపడా నూనె పోసి వేడయ్యాక, పిండిని వడల్లా చేత్తో వత్తి నూనెలో వేయాలి. బంగారు గోధుమ రంగు వచ్చే వరకు వేయించుకుని తీసేయాలి.

ఉదలతో...

కావలసిన పదార్థాలు : పచ్చిపప్పు - ముప్పావు కప్పు, ఊదలు - కప్పు, దనియాలు - రెండు చెంచాలు, అల్లం - అంగుళంన్నర ముక్క, పచ్చిమిర్చి - రెండు లేదా మూడు, ఉల్లిగడ్డలు - రెండు, జీలకర్ర - చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - వేయించడానికి సరిపడ, తినే సోడ - కొద్దిగా

తయారు చేసే విధానం : ఊదలు నాలుగైదు గంటలు నానబెట్టాలి. పచ్చిపప్పు గంట పాటు నాననివ్వాలి. రెండింటినీ నీటి నుండి వేరు చేసి వేరొక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో రెండు చెంచాల దనియాలు, చిన్న ముక్కలుగా కట్ చేసుకున్న అల్లం వేసి అన్నింటిని బాగా కలపాలి. వీటిని మిక్సి జార్‌లోకి తీసుకుని పేస్టులా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమంలోకి సన్నగా తరిగిన ఉల్లిగడ్డ ముక్కలు, జీలకర్ర, తినే సోడా వేసి కలపాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని బాగా కలిపి పక్కన ఉంచుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి అందులో నూనె పోసి బాగా వేడయ్యాక కలిపి పక్కన పెట్టుకున్న మిశ్రమాన్ని తడి చేసుకుంటూ వడల మాదిరిగా చేసుకోని నూనెలో వేసి దోరగా కాల్చుకోవాలి. అంతే... ఊదల వడలు రెడీ.



మాన్‌సూన్ డిలైట్స్

కరకరలాడే తెలంగాణ రుచులు

తొలకరి జల్లు పడగానే మనసును రంజింపచేసేలా వచ్చే మట్టి వాసన, పులకింప జేసే చిటపట చినుకులు, చెంపలను ముద్దాడుతూ గిలిగింతలు పెట్టె చిరుగాలి... వర్షాకాలం వచ్చేసిందనడానికి ఇంతకు మించినది ఏముంటుంది ? తెలంగాణలోకి రుతుపవనాల రాకతో పాటు ఉ్రరూతలూగించే రుచుల శ్రేణిని కూడా వెంట తీసుకువచ్చింది. ఈ వర్షాకాలంలో తెలంగాణా లో అత్యంత ప్రాచుర్యం పొందిన కొన్ని రుచికర వంటకాలు ఉన్నాయి. అవేంటంటే...



గోల్డ్ డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా మాట్లాడుతూ, "తెలంగాణలో వర్షాకాలంలో వైవిధ్యమైన, నోరూరించే ఆహారాలను అన్వేషిస్తున్నప్పుడు, ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది– ఈ సీజన్ ఆహారపరంగా పండుగ సమయం. కరకరలాడే ఫ్రైల నుండి మనస్ఫూర్తిగా ఆస్వాదించే పానీయాల వరకు, ఆహ్లాదకరమైన ట్రీట్‌లను ఆస్వాదించడంలోని ఆనందాన్ని గుర్తుచేస్తుంది. స్వాద్ జో జిందగీ సే జడ్ జాయే" అని అన్నారు. తెలంగాణ వానాకాలం వంటల అద్భుతాలను వేడుక జరుపుకుందాం!



కోడి కొర్రల బజ్జి (చికెన్ వింగ్స్ బజ్జి) : మాంసాహార ప్రియులకు, వర్షాకాలం తనతో పాటు కోడి కొర్రల బజ్జి లేదా చికెన్ వింగ్స్ బజ్జీ ఆనందాన్ని తెస్తుంది. చికెన్ వింగ్స్‌ను తెలంగాణ ప్రత్యేకమైన స్పైసీ మిశ్రమంలో మెరినేట్ చేసి డీప్ ఫ్రై చేస్తారు.



వడలు, దాల్ వడలు : బయట వర్షం కురుస్తున్న కొద్దీ, వేయించిన చిరుతిళ్లను తినాలనే కోరిక తీవ్రమవుతుంది. వడలు, దాల్ వడలను రుచి చూడండి. ఈ స్నాక్స్ కొబ్బరి చట్నీ లేదా సాంబార్‌తో బాగా ఆస్వాదించవచ్చు.

రోస్టెడ్ మొక్కజొన్న : వేయించిన స్నాక్స్ ఆకర్షణ కాదనలేనిది. అయితే, కొన్నిసార్లు వర్షాకాలంలో అతి చిన్న ఆనందం కూడా ప్రత్యేకంగానే ఉంటుంది. కాల్చిన మొక్కజొన్న అటువంటి ఆనందం అందిస్తుంది.



పులిహోర : పులౌరా, పూలోరి అని కూడా పిలవబడే పులిహోర ఒక సంతోషకరమైన అనుభూతి అందిస్తుంది. పులౌరాలను చట్నీలతో వేడిగా వడ్డిస్తారు.



మసాలా చాయ్ : మసాలా చాయ్ ప్రస్తావించకుండా తెలంగాణలో ఏ వర్షాకాల వంట ప్రయాణం పూర్తి కాదు. బ్లాక్ టీ ఆకులు, ఏలకులు, అల్లం, లవంగాల వంటి సుగంధ ద్రవ్యాలు, పాలు, పంచదారతో కలిపి సృష్టించే ఈ మసాలా చాయ్ అసమానమైన ఆనందాన్ని అందిస్తుంది.

మొక్క జొన్న చాట్ (కార్న్ చాట్) : వర్షాకాలపు వైభవాన్ని అద్భుతంగా ఒడిసి పట్టే వంటకం ఇది. తాజాగా ఉడకబెట్టిన మొక్కజొన్న గింజలతో మసాలా దినుసులు, తరిగిన ఉల్లిపాయలు, టమోటాలు, చింతపండు చట్నీతో కలిపి తయారు చేస్తారు. అస్సలు వదులుకోకూడదనే ఈ వంటకం మాత్రమే కాదు చిటపట చినుకులు పడుతున్నవేళ మరింత ఆనందాన్ని అందిస్తుంది.

చితికిన చిన్నారి..

(మొదటిపేజీ తరువాయి)

గుంత వల్ల స్కూటీ స్కిడ్ అయి కింద పడిపోయిన చిన్నారిపై నుంచి స్కూల్ బస్సు వెళ్లడంతో పసికందు విలవిల్లాడి ప్రాణం విడిచింది. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బాచుపల్లి నివాసితుడు కిషోర్ కూతురు దీక్షిత(8) బౌరంపేట్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 3వ తరగతి చదివేది. రోజూ కిషోర్ స్కూటీపై దీక్షితను స్కూల్‌కి తీసుకెళ్తాడు. అదేవిధంగా బుధవారం ఉదయం కూడా వెళ్తుండగా

బాచుపల్లి రెడ్డిల్యాబ్స్ వద్ద గుంతల రోడ్డుపై స్కూటీ కొంత అదుపుతప్పడంతో దీక్షిత కింద పడిపోయింది. అదే సమయంలో వెనుకాల వేగంగా వచ్చిన భాష్యం స్కూల్ బస్సు స్కూటీని ఢీకొట్టి చిన్నారిపై నుంచి వెళ్లింది. బస్సు వేగంగా ఉండటం వల్ల డ్రైవర్ రహీం అదుపు చేయలేకపోయారు. దాంతో దీక్షిత అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె తండ్రి చేయి విరిగింది. స్థానికులు వెంటనే బాచుపల్లి పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్కూల్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీక్షితను గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సర్కారు బడుల్లో సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సీడీపీ నిధుల నుంచి మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయలతో బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ మరమ్మతుల పనులకు వారు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్తు ఎంపీటీసీ నిధులు రెండు లక్షల రూపాయలతో పద్మశాలి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నేలపట్లలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. సౌకర్యాలు, సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిథిలమైన ప్రాథమిక పాఠశాల బిల్డింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. శిథిలమైన స్కూల్ బిల్డింగ్ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. కొత్త భవనం నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి, విద్య, వైద్యం అందించకుండా మతం పేరుతో అల్లర్లు సృష్టిస్తోందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దాడులు, హత్యలు, లైంగికదాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ మతోన్మాదం ముసుగులో యువతను మోసం చేస్తోందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రాజకీయ లబ్ది కోసం ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌట వేణుగోపాల్‌గౌడ్, నేలపట్ల ఎంపీటీసీ తడక పారిజాతమోహన్, చిన్నకొండూరు ఎంపీటీసీ చెన్నబోయిన వెంకటేశం, ఉపసర్పంచ్ రంగం అంబాలుకేశవులు, సింగిల్‌విండో డైరెక్టర్ పబ్బతి వెంకటేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మణి, కోఆప్షన్ సభ్యులు పాలమాకుల యాదయ్య, సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి దబ్బటి బక్కయ్య, సహాయ కార్యదర్శి ఎనమాల సంజీవ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

నేను నిర్దోషిని..

(మొదటిపేజీ తరువాయి)

తీర్పుపై సుప్రీం కోర్టులో సవాల్ చేసిన రాహుల్ గాంధీ తాజాగా అఫిడవిట్ దాఖలు చేశారు.తాను ఎలాంటి నేరానికీ పాల్పడలేదని రాహుల్ గాంధీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తానేమీ శిక్షార్హమైన నేరానికి పాల్పడలేదని తెలిపారు. ఒకవేళ క్షమాపణ చెప్పాల్సి వస్తే అదే అతిపెద్ద శిక్ష అవుతుందని పేర్కొన్నారు. ఒకవేళ క్షమాపణే అయితే ఈ పాటికే చెప్పేవాడినని పేర్కొన్నారు. తాను క్షమాపణ చెప్పడానికి నిరాకరించినందువల్లే తాను 'అహంకారి' అని పూర్ణేశ్ మోడీ పేర్కొన్నారని తన అఫిడవిట్‌లో తెలిపారు. ఏ తప్పూ చేయకపోయినా ప్రజాప్రాతినిధ్య చట్టం కింద క్రిమినల్ నేరాలు మోపి బలవంతంగా క్షమాపణ చెప్పించాలనుకోవడం న్యాయ వ్యవస్థ సమయాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. తనపై విధించిన శిక్షపై స్టే విధించి వర్షాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతివ్వాలని రాహుల్ గాంధీ కోరారు.

మణిపూర్‌లో శాంతి స్థాపనకు జోక్యం చేసుకోండి

- అక్కడి అసాధారణ పరిస్థితిని పరిష్కరించాలి
- ఇంటర్నెట్ నిషేధం అపనమ్మకాన్ని పెంచింది
- పార్లమెంట్‌లో చర్చపై తాము ఇచ్చిన నోటీసులు తిరస్కరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో ఆలస్యం చేయకుండా శాంతి స్థాపనకు జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రతిపక్ష నేతలు విజ్ఞప్తి చేశారు. మణిపూర్ రాష్ట్రం ఎదుర్కొంటున్న అసాధారణ పరిస్థితిని వీలైనంత త్వరగా పరిష్కరించి, తక్షణమే సాధారణ స్థితికి తీసుకురావాలని కోరారు. రెండు రోజుల పాటు మణిపూర్‌లో పర్యటించిన 21 మంది ఎంపీలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతి పత్రం సమర్పించారు. "గత కొన్ని వారాలుగా మణిపూర్‌లో పరిస్థితి క్లిష్ట స్థితికి చేరుకుంది. శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆన్‌లైన్‌లో వెలువడిన షాకింగ్ వైరల్ వీడియో దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ పరిస్థితుల్ని వెంటనే పరిష్కరించడంలో రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ, పోలీసులు విఫలమయ్యారని స్పష్టంగా తెలుస్తుంది. విచారణ చేపట్టి నిందితుల్ని పట్టుకునేందుకు రెండు నెలలకు పైగా ఆలస్యంగా స్పందించడం సమస్య తీవ్రతను మరింత పెంచింది. మహిళలపై లైంగికదాడులకు సంబంధించిన అనేక కేసుల్లో ఒక ఘటన మాత్రమే అని వెలుగులోకి వచ్చింది" అని తెలిపారు. "బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఇండియా కూటమి పార్టీలకు చెందిన 21 మంది పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందం జులై 29-30 తేదీల్లో రెండో రోజుల పాటు మణిపూర్‌లోని హింసా ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, మణిపూర్ ప్రజలకు సంఘీభావ సందేశాన్ని ఇచ్చి, వాస్తవికతను అంచనా వేసింది. మహిళలు, పిల్లలతో సహా ప్రజలు ఎదుర్కొంటున్న విధ్వంసం, కష్టాలను ఎంపీలు చూశారు. భయంకరమైన, పరిస్థితుల గురించి దేశానికి తెలియజేశారు. ఇంతకు ముందు మణిపూర్ గవర్నర్‌ను ప్రతినిధి బృందం కలిసి వాస్తవ పరిస్థితులను తెలియజేసింది. ఆమెకు వినతిపత్రం సమర్పించింది" అని పేర్కొన్నారు.

"హింసతో మణిపూర్ వినాశకరంగా మారింది. 200 కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. 500 మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. 5 వేల కంటే ఎక్కువ ఇళ్లు దగ్ధం అయ్యాయి. 60 వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సహాయక శిబిరాల్లో దుర్భరమైన పరిస్థితుల్లో బాధితులు నివసిస్తున్నారు. చురచంద్‌పూర్, మోయిరాంగ్, ఇంఫాల్‌తో సహా మూడు విభిన్న సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లోని సహాయక శిబిరాలను ప్రతినిధి బృందం సందర్శించింది. అక్కడ బాధితులతో సంభాషించింది. వారి సమస్యలను విన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల జీవన పరిస్థితులను వారు ప్రత్యక్షంగా చూశారు. సహాయక శిబిరాల్లో ఉన్న ప్రజల ఆహారం, సహాయక సామాగ్రి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు భయం, అభద్రతా స్థితిలో జీవిస్తున్నారు. వారి జీవితాలను పునర్నిర్మించుకోవడానికి సురక్షితమైన, న్యాయమైన పునరావాసం అవసరం. రాష్ట్రంలో మూడు నెలల పాటు ఇంటర్నెట్ నిషేధం వివిధ వర్గాల మధ్య అపనమ్మకాన్ని మరింత పెంచింది. తప్పుడు సమాచారం వ్యాప్తికి అనుమతించింది. దాదాపు మూడు నెలల పాటు పాఠశాలలు, కళాశాలలను సుదీర్ఘంగా మూసివేయడం మణిపూర్‌లో పిల్లలు, యువత విద్యపై ప్రతికూల ప్రభావం చూపింది" అని వినతిపత్రంలో తెలిపారు.

"ఈ సందర్భంలోనే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి, ఇండియా కూటమి పార్టీలు ప్రధాని నుంచి ప్రకటనను డిమాండ్ చేస్తున్నాయి. ఆ తరువాత అత్యంత జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ అంశంపై వివరణాత్మక, సమగ్ర చర్చ జరగాలని కోరుతున్నాయి. సంబంధిత నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చినప్పటికీ, ఈ డిమాండ్లు పార్లమెంట్ ఉభయ సభల్లో తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ అంశంపై అర్థవంతమైన చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారు. రాజ్యసభలో ప్రజల గొంతుకకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్ష నేత నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారు. తాము మాట్లాడకుండా మైక్ కట్ చేస్తున్నారు. దీన్ని మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కొత్తగా తీసుకురావడం చాలా ఆందోళన కలిగిస్తుంది" అని అన్నారు.

"ఇకనైనా ఆలస్యం చేయకుండా రాష్ట్రంలో శాంతి సామరస్యాలను నెలకొల్పేందుకు దయతో జోక్యం చేసుకోండి. గత 92 రోజులలో జరిగిన విధ్వంసానికి బాధ్యులను గుర్తించాలి. బాధిత వర్గాలకు న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రెండూ తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితులపై పార్లమెంట్‌లో అత్యవసరంగా ప్రసంగించవలసిందిగా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలి. ఆ తరువాత ఈ విషయంపై వివరణాత్మక, సమగ్రమైన చర్చ జరగాలి" అని కోరారు. మణిపూర్ ప్రజల బాధలను తగ్గించడంలో, రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో మీ మద్దతు, జోక్యం చాలా కీలకమని కోరారు. ఈ కీలకమైన అంశంపై శ్రద్ధ వహించాలనీ కోరారు.

అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ తాము మణిపూర్ సమస్యను రాష్ట్రపతికి వివరించామని చెప్పారు. మణిపూర్‌లో మహిళలపై దురాగతాలు జరుగుతున్నాయని, పునరావాస కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేవని చెప్పామని తెలిపారు. ప్రధాని మోడీ మణిపూర్‌లో పర్యటించి, శాంతిని పునరుద్ధరించేందుకు కృషి చేయాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని అన్నారు. మణిపూర్‌లో పర్యటించిన 21 మంది ఎంపీలతో పాటు శరద్ పవర్ (ఎన్‌సీపీ), సుదీప్ బందోపాధ్యాయ (టీఎంసీ), తిరుచ్చి శివ (డీఎంకే), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), వైకో (ఎండీఎంకే), జోష్ కె. మణి (కేరళ కాంగ్రెస్), ఎఎ రహీం సీపీఐ(ఎం), సంజయ్ సింగ్ (ఆప్), సంజయ్ రౌత్ (శివసేన ఠాక్రె), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పీ) తదితరులు పాల్గొన్నారు.

హింస - విద్వేష ప్రసంగాలు వద్దు : సుప్రీం

(మొదటిపేజీ తరువాయి)

నెలకొనాలి." అని జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. ప్రదర్శనల సందర్భంగా శాంతి భద్రతల పరిస్థితులకు విఘాతం కలగకుండా చూసేలా కేంద్ర, రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి, సంప్రదించుకోవాలని కోర్టు ఆదేశించింది. జరిగే ప్రదర్శనలు, సంఘటనలకు సంబంధించి సిసిటివి వీడియోలు తీయాలని, వాటిని భద్రపరచాలని కోరింది. బందోబస్తును పెంచాలని కోరింది. విద్వేష ప్రసంగాలు చేసేవారిపై ఎఫ్ఐఆర్‌లు

విద్వేష ప్రసంగాలు ఎవరైనా చేసిన పక్షంలో వారిపై ఫిర్యాదు దాఖలవడం కోసం వేచి చూడకుండా వెంటనే తమ తాముగా పరిగణనలోకి తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా పోలీసులను, రాష్ట్రాల అధికారులను కోరుతూ గతేడాది అక్టోబరు 21న జారీ చేసిన ఆదేశాలను బెంచ్ ఈ సందర్భంగా కేంద్రానికి గుర్తు చేసింది.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు కేంద్రం శాయశక్తులా కృషి చేస్తుందని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు హామీ ఇచ్చారు. కోర్టు ఆదేశాలకు తాము కట్టుబడి వుంటామని చెప్పారు.

పొరుగునున్న హర్యానాలో హింస జరుగుతోందని, రాజధానికి 23 నిరసన ప్రదర్శనలు వస్తున్నాయని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సి.యు.సింగ్ తెలిపారు. ఆ కార్యక్రమాలను ప్రదర్శనలుగా పేర్కొన్నప్పటికీ ఇప్పటికే విద్వేష ప్రసంగాలు చోటు చేసుకున్నాయని అన్నారు. 'విద్వేష ప్రసంగాలు జరుగుతున్నాయి. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో మరో ఐదు ప్రదర్శనలు జరగనున్నాయి' అని సింగ్ చెప్పారు.

ఎక్కడా హింస పెచ్చరిల్లకుండా అధికారులు ముందు జాగ్రత్తతో వ్యవహరించాలని జస్టిస్ ఖన్నా సూచించారు. తమ అధికార పరిధిలో జరిగే ఎలాంటి హింసనైనా ఏ ప్రభుత్వమూ ఇష్టపడదని అన్నారు.

సుప్రీం కోర్టు అత్యవసరంగా ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ న్యాయవాది సింగ్ రెండు వేర్వేరు బెంచ్‌ల ముందు ఈ పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ప్రాధాన్యతా ప్రాతిపదికన కేసును విచారణకు స్వీకరించారు. తిరిగి శుక్రవారం స్పెషల్ బెంచ్ దీనిపై విచారణ జరపనుంది.

రైతు రుణమాఫీ షురూ

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయాభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఎన్ని కష్టాలొచ్చినా రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని తెలిపారు. కేంద్రం తీసుకున్న నోట్లరద్దు నిర్ణయం వల్ల ఏర్పడిన మందగమనం, కరోనా పరిస్థితుల్లో తలెత్తిన ఆర్థిక సమస్యలు, ఎఫ్ఆర్‌బీఎం నిధులను విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన కక్షపూరిత చర్యలు...తదితర కారణాలతో రుణమాఫీ కొంత ఆలస్యమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తిరిగి చక్కదిద్దుకున్న నేపథ్యంలో రుణమాఫీపై నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రైతులకు అందిచాల్సిన రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీరు వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో నిరాఘాటంగా కొనసాగిస్తున్నదని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికే చెప్పినట్టు ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా, ఆరునూరైనా రైతుల సంక్షేమాన్ని, వ్యవసాయాభివృద్ధిని విస్మరించే ప్రసక్తేలేదన్నారు. పైగా వ్యవసాయాభివృద్ధి కోసం ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు వంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. తద్వారా రైతు సాధికారతను సాధించే వరకు వారిని ఆర్థికంగా ఉన్నతంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించబోనని సీఎం వివరించారు.

నేటి నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

చెల్లదంటూ సమీప ప్రత్యర్థి జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా హైకోర్టు తీర్పు ప్రకటించిన నేపథ్యంలో సభకు ఎవరు హాజరవుతారనే గందరగోళం నెలకొంది. ఈ సారి సమావేశాలను నెలరోజుల పాటు నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి. దీనిపై స్పీకర్ అధ్యక్షతన జరిగే శాసనభా వ్యవహారాల కమిటీ (బీఏసీ)లో స్పష్టతరానుంది.

హిందూ ట్రిక్స్ !

(మొదటిపేజీ తరువాయి)

కారిడార్ నిర్మాణ పరిసరాలలోని అనేక కట్టడాలను ఇప్పటికే కూల్చేశారు. 2019 డిసెంబర్‌లో అయోధ్య వివాదంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ శక్తులకు మరింత ప్రేరణ ఇచ్చింది. హిందూ దేవాలయాలను కూల్చివేసి, ఆ స్థానంలో మసీదులు నిర్మించారంటూ వాదనలను తెర పైకి తెచ్చి న్యాయస్థానాలలో అనేక వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఇప్పుడు ఆ మసీదులను కూలదోసి, తిరిగి దేవాలయాలను నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓడరేవుల్లో పేరుకుపోయిన బియ్యం నిల్వలు

- ఎగుమతులపై నిషేధమే కారణం

న్యూఢిల్లీ : దేశంలోని ఓడరేవుల వద్ద బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. ప్రస్తుతం ఓడరేవుల వద్ద రెండు లక్షల టన్నుల బియ్యం నిలిచి ఉంది. దేశంలో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు మోడీ ప్రభుత్వం గత నెల 20న బాసుమతి యేతర బియ్యం ఎగుమతులపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయం కారణంగా బియ్యం ఎగుమతులకు కస్టమ్స్ అనుమతులు నిలిచిపోయాయి. అప్పటికే కస్టమ్స్ అనుమతులు పొందిన సరుకును ఓడల్లోకి ఎక్కించి పంపించారు. తెల్ల బియ్యం ఎగుమతులపై నిషేధం విధిస్తూ విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ 20వ తేదీ సాయంత్రం నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సరకు రవాణాను ఆపేశారు. దీంతో రెండు లక్షల టన్నుల బియ్యం ఇప్పటికీ ఓడరేవుల్లోనే నిలిచి ఉంది. కొల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో ఐదు వేల టన్నుల బియ్యం నిల్వ ఉంది. బియ్యం ఎగుమతులపై భారత్ నిషేధం విధించడంతో ప్రపంచ ఆహార ధరల ద్రవ్యోల్బణం పెరిగిందని ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్త పయరీ–అలివియర్ గౌరించాస్ చెప్పారు. భారత్ నిర్ణయం కారణంగా బియ్యం ధరలు ఈ సంవత్సరం 10-15 శాతం పెరగవచ్చునని తెలిపారు.

సిరీస్ సొంతమాయె

• విజృంభించిన శార్దూల్, ముకేశ్ • 200 పరుగుల తేడాతో భారత్ గెలుపు

కరీబియన్లపై భారత్ అప్రతిహాత రికార్డు కొనసాగుతుంది. 2006 నుంచి ఆ జట్టుపై వరుసగా వన్డే సిరీస్ విజయాల కార్డు మరింత మెరుగైంది. పేసర్లు శార్దూల్ ఠాకూర్ (4/37), ముకేశ్ కుమార్ (3/30) నిప్పులు చెరగటంతో భారీ ఛేదనలో వెస్టిండీస్ 151 పరుగులకే కుప్పకూలింది. భారత్ 200 పరుగుల తేడాతో గెలుపొందింది. 2-1తో వన్డే సిరీస్ టీమ్ ఇండియా సొంతమైంది.

నవతెలంగాణ-టరౌబ

కరీబియన్ గడ్డపై కుర్రాళ్ల కేక. రెండో వన్డేలో తడబడినా.. కుర్ర జట్టుతోనే బరిలోకి దిగిన టీమ్ ఇండియా 200 పరుగుల భారీ తేడాతో వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. వన్డే సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. 352 పరుగుల భారీ ఛేదనలో వెస్టిండీస్ 151 పరుగులకే కుప్పకూలింది. పేసర్లు శార్దూల్ ఠాకూర్ (4/37), ముకేశ్ కుమార్ (3/30) నిప్పులు చెరిగే ప్రదర్శనకు కుల్దీప్ యాదవ్ (2/25) మాయజాలం తోడైంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 351 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (88), ఇషాన్ కిషన్ (77), సంజు శాంసన్ (51), హార్దిక్ పాండ్య (70 నాటౌట్) అర్థ సెంచరీలు సాధించారు. గిల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. మూడు వన్డేల్లోనూ అర్థ సెంచరీలు బాదిన ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు.

పేసర్ల ప్రతాపం

2019 తర్వాత భారత్‌పై వన్డే విజయం రుచి చూసిన కరీబియన్లు.. సిరీస్ డిసైడర్‌లోనూ అదే జోరు చూపించాలని తపించారు. కానీ కొత్త బంతితో పేసర్ ముకేశ్ కుమార్ నిప్పులు చెరిగాడు. ముకేశ్ కుమార్ దెబ్బకు విండీస్ 50/6తో దారుణ పరాజయ కోరల్లో కూరుకుంది!. బ్రాండన్ కింగ్ (0), కైల్ మేయర్స్ (4), హోప్ (5) ముకేశ్ స్వింగ్‌కు దాసోహం అయ్యారు.



కార్టీ (6), హెట్‌మయర్ (4), షెఫర్డ్ (8) సైతం క్రీజులో నిలువలేకపోయారు. మరో పేసర్ శార్దూల్ ఠాకూర్ మిడిల్, లోయర్ ఆర్డర్‌పై ప్రతాపం చూపించాడు. అల్జారీ జోసెఫ్ (26), మోటీ (39 నాటౌట్), యానిక్ (19) మెరుపులతో విండీస్ 151 పరుగులు చేసింది. 88/8తో వందలోపే కుప్పకూలేలా కనిపించినా.. టెయిలెండర్ల మెరుపులతో కరీబియన్లు 35.3 ఓవర్ల పాటు పోరాడారు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ రెండు వికెట్లు పడగొట్టగా.. శార్దూల్ 4, ముకేశ్ 3 వికెట్లు చొప్పున ఖాతాలో వేసుకున్నారు.



వన్డే సిరీస్ ట్రోఫీతో టీమ్ ఇండియా క్రికెటర్లు

దంచి కొట్టారు

టాస్ నెగ్గిన విండీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. రెండో వన్డేలో తడబడిన కుర్రాళ్లు.. నిర్ణయాత్మక పోరులో దంచి కొట్టారు. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (77), శుభ్‌మన్ గిల్ (85) తొలి వికెట్‌కు 143 పరుగుల భారీ భాగస్వామ్యం అందించారు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 43 బంతుల్లోనే కిషన్ అర్థ సెంచరీ సాధించగా.. ఎనిమిది ఫోర్ల అండతో 51 బంతుల్లో గిల్ అర్థ సెంచరీ కొట్టాడు. ఓపెనర్లు నిర్మించిన గట్టి పునాదిపై మిడిల్ ఆర్డర్ చెలరేగింది. రుతురాజ్ గైక్వాడ్ (8) నిరాశ పరిచినా.. సంజు శాంసన్ (51), కెప్టెన్ హార్దిక్ పాండ్య (70 నాటౌట్) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. సూర్యకుమార్ (35) తనదైన ఇన్నింగ్స్ ఆడే ప్రయత్నం చేశాడు. నలుగురు బ్యాటర్లు అర్థ సెంచరీల మోత మోగించటంతో భారత్ 351 పరుగుల భారీ స్కోరు సాధించింది. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి చివరి వన్డేకూ దూరంగా ఉన్నారు.

నేడు భారత్, వెస్టిండీస్ తొలి టీ20. హార్దిక్ సారథ్యంలోని టీమ్ ఇండియా నేడు టరౌబలో కరీబియన్లతో పొట్టి సిరీస్ వేటను షురూ చేయనుంది. రాత్రి 8 గంటలకు మ్యాచ్ ఆరంభం

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : కిషన్ (స్టంప్డ్) హోప్ (బి) యానిక్ 77, గిల్ (సి) యానిక్ (బి) మోటీ 85, రుతురాజ్ (సి) కింగ్ (బి) జోసెఫ్ 8, శాంసన్ (సి) హెట్‌మయర్ (బి) షెఫర్డ్ 51, హార్దిక్ నాటౌట్ 70, సూర్య (సి) యానిక్ (బి) షెఫర్డ్ 35, జడేజా నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 17, **మొత్తం : (50 ఓవర్లలో 5 వికెట్లకు) 351.**

వికెట్ల పతనం : 1-143, 2-154, 3-223, 4-244, 5-309.

బౌలింగ్ : జేడెన్ 8-0-75-0, మేయర్స్ 4-0-25-0, జోసెఫ్ 10-77-1, మోటీ 10-1-38-1, షెఫర్డ్ 10-0-73-2, యానిక్ 8-0-58-1.

వెస్టిండీస్ ఇన్నింగ్స్ : కింగ్ (సి) కిషన్ (బి) ముకేశ్ 0, మేయర్స్ (బి) ముకేశ్ 4, అతానేజ్ (బి) కుల్దీప్ 32, హోప్ (సి) గిల్ (బి) ముకేశ్ 5, కార్టీ (సి) గిల్ (బి) జైదేవ్ 6, హెట్‌మయర్ (సి) సూర్య (బి) శార్దూల్ 4, షెఫర్డ్ (సి) జైదేవ్ (బి) శార్దూల్ 8, యానిక్ (ఎల్బీ) కుల్దీప్ 19, జోసెఫ్ (సి) కిషన్ (బి) శార్దూల్ 26, మోటీ నాటౌట్ 39, జేడెన్ (బి) శార్దూల్ 1, ఎక్స్‌ట్రాలు : 7, **మొత్తం : (35.3 ఓవర్లలో ఆలౌట్) 151.**

వికెట్ల పతనం : 1-1, 2-7, 3-17, 4-35, 5-40, 6-50, 7-75, 8-88, 9-143, 10-151.

బౌలింగ్ : ముకేశ్ 7-1-30-3, హార్దిక్ 4-1-13-0, శార్దూల్ 6.3-0-37-4, జైదేవ్ 5-0-16-1, కుల్దీప్ యాదవ్ 8-3-25-2, జడేజా 5-1-29-0.

మంజునాథ్ సంచలనం

• వరల్డ్ నం.7పై మెరుపు విజయం • సింధు, శ్రీకాంత్, ప్రణయ్ ముందంజ

ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్



సిడ్నీ (ఆస్ట్రేలియా) : భారత బ్యాడ్మింటన్‌లో ఎప్పుడూ వినిపించని, కనిపించని ఓ షట్లర్ సిడ్నీలో సంచలనం సృష్టించాడు. వరల్డ్ నం.7, నాల్గో సీడ్ కీన్ యే లోహ్ (సింగపూర్)పై కండ్లుచెదిరే విజయం నమోదు చేశాడు. వరల్డ్ నం.50 మిథున్ మంజునాథ్ 21-19, 21-19తో వరుస గేముల్లో సింగపూర్ షట్లర్‌ను చిత్తు చేశాడు. 41 నిమిషాల్లోనే లాంఛనం ముగించి మెన్స్ సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. యువ షట్లర్ లక్ష్యసేన్ గాయంతో పోటీ నుంచి తప్పుకున్నాడు. సహచర షట్లర్ కిరణ్ జార్జ్‌తో తొలి గేమ్‌లో 0-5తో ఉండగా లక్ష్యసేన్ వాకోవర్ ఇచ్చాడు. మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ 21-18, 21-7తో వరుస గేముల్లో కెంటా నిషిమోట (జపాన్)పై గెలుపొందాడు. హెచ్.ఎస్ ప్రణయ్ సైతం మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొంది ప్రీ క్వార్టర్స్‌కు చేరాడు. 21-18, 16-21, 21-15తో లీ చెక్ యు (హాంగ్‌కాంగ్)పై ప్రణయ్ నెగ్గాడు. ప్రియాన్షు రజావత్ 21-12, 21-16తో ఆసీస్ షట్లర్ నాథన్ టాంగ్‌ను ఓడించాడు.

మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ పి.వి సింధు రెండో రౌండ్లోకి చేరుకుంది. సహచర షట్లర్ అష్మిత చాలిహాపై 21-18, 21-13తో సింధు తొలి రౌండ్లో గెలుపొందింది. ఆకర్షి కశ్యప్ 21-15, 21-17తో మలేషియా అమ్మాయి జి వేపై విజయం సాధించింది. మాళవిక బాన్సోద్ 20-22, 11-21తో చైనీస్ తైపీ షట్లర్ చేతిలో ఓటమి చెందింది. నేడు ప్రీ క్వార్టర్స్‌లో పి.వి సింధు, ఆకర్షి కశ్యప్ ముఖాముఖి ఢీకొట్టనున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్, సిక్కి రెడ్డి జంట 14-21, 18-21తో వరల్డ్ నం.5 జోడీ చేతిలో ఓటమిపాలైంది.

భారత్, పాక్ పోరు అక్టోబర్ 14న!

షెడ్యూల్ మార్పునకు పీసీబీ అంగీకారం

ముంబయి : 2023 వన్డే వరల్డ్‌కప్‌లో దాయాదుల మెగా మ్యాచ్ అక్టోబర్ 14న జరుగనుంది. ఈ మేరకు ఐసీసీ, బీసీసీఐ త్వరలోనే రీ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నాయి. తొలుత అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లో భారత్, పాక్ షెడ్యూల్ చేసినా.. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆ రోజు భద్రతా ఏర్పాట్లు కష్టసాధ్యమని స్థానిక పోలీసులు బోర్డుకు లేఖ రాశారు. అయితే, అక్టోబర్ 12న హైదరాబాద్‌లో శ్రీలంకతో మ్యాచ్ ఉండటంతో తొలుత పాకిస్థాన్ షెడ్యూల్ మార్పునకు అంగీకరించలేదు. కానీ శ్రీలంక, పాకిస్థాన్ మ్యాచ్‌ను అక్టోబర్ 10కి రీ షెడ్యూల్ చేయనున్నారు. దీంతో భారత్‌తో మ్యాచ్‌కు పాకిస్థాన్‌కు ఆశించిన సమయం ఉంటుంది. ఇక అక్టోబర్ 14న ఇప్పటికే రెండు మ్యాచులు షెడ్యూల్ చేయగా.. వాటిలో ఓ మ్యాచ్‌ను ముందు రోజు (13)కు మార్చనున్నారు. వంద రోజుల కౌంట్‌డౌన్‌తో ఎంతో ఆలస్యంగా షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ.. ఇప్పుడు టోర్నీకి రెండు నెలల ముంగిట షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు పూనుకుంది. మ్యాచ్ టికెట్లు, ధరలపై సైతం బోర్డు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవటంతో అభిమానులు విమర్శలు చేస్తున్నారు.


భారత్, పాక్ కెప్టెన్లు రోహిత్, బాబర్

హైదరాబాద్ కిరాక్ షో

ప్రొ పంజా లీగ్ సీజన్ 1



న్యూఢిల్లీ : ప్రొ పంజా లీగ్ (ఆర్మ్ రెజ్లింగ్)లో కిరాక్ హైదరాబాద్ మళ్లీ గెలుపు బాట పట్టింది. బుధవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో కోచి కెడి'ఎస్‌పై కిరాక్ హైదరాబాద్ 18-10తో ఘన విజయం సాధించింది. ప్రొ పంజా లీగ్ తొలి సీజన్‌లో కిరాక్ హైదరాబాద్‌కు ఇది రెండో విజయం. తొలుత అండర్ కార్డ్ మ్యాచుల్లో కిరాక్ హైదరాబాద్ స్వీప్ చేసింది. 3-0తో ఆధిక్యం దక్కించుకుంది. షాహిల్ హుస్సేన్, మధుర కెఎన్, రాహుల్ మహర్‌లు 1-0తో విజయాలు సాధించారు. ఇక మెయిన్ కార్డ్‌లో స్టీవ్ థామస్ 10-0తో గెలుపొంది హైదరాబాద్‌కు 13-0 ఆధిక్యాన్ని అందించాడు. కానీ ఆ తర్వాత మ్యాచ్‌లో అహ్మద్ ఫైజల్ అలీ 0-10తో నిరాశపరిచాడు. చివరి మ్యాచ్‌లో నవీన్ అదరగొట్టాడు. 5-0తో కిరాక్ హైదరాబాద్‌కు ఘన విజయాన్ని కట్టబెట్టాడు. నేడు జరిగే మరో మ్యాచ్‌లో ముంబయి మజిల్‌తో కిరాక్ హైదరాబాద్ పోటీపడనుంది. కోచి కెడి'ఎస్‌పై ఆకట్టుకునే ప్రదర్శన చేసిన ఆర్మ్ రెజ్లర్లను కిరాక్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యజమాని నెదురుమల్లి గౌతం రెడ్డి, సీఈవో త్రినాథ్ రెడ్డి అభినందించారు.

ఇంగ్లాండ్, ఆసీస్‌కు స్లో ఓవర్ రేట్ వ్యథ!

వరుసగా 19, 10 పాయింట్ల కోత పెట్టిన ఐసీసీ

దుబాయ్ : ఆధునిక క్రికెట్‌లో 2023 యాషెస్ సిరీస్ అత్యుత్తమం అని క్రికెట్ పండితులు అంటున్నారు. ఆద్యంతం రసవత్తరంగా సాగిన ఐదు టెస్టుల సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. యాషెస్‌లో అద్వితీయ ప్రదర్శన చేసిన ఆనందం ఇరు జట్లలోనూ ఎంతోసేపు నిలువలేదు. స్లో ఓవర్ రేట్ రూల్స్ ప్రకారం ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాపై ఐసీసీ కొరడా ఝులిపించింది. నాలుగు టెస్టుల్లో స్లో ఓవర్ రేట్‌కు ఇంగ్లాండ్‌కు 19 పాయింట్లు, ఓ టెస్టులో స్లో ఓవర్ రేట్‌కు ఆస్ట్రేలియాకు 10 పాయింట్ల కోత విధించింది. ఐసీసీ నూతన రూల్స్ ప్రకారం స్లో ఓవర్ రేట్‌కు ప్రతి ఓవర్‌కు ఓ పాయింట్, 5 శాతం మ్యాచ్ ఫీజు కోత విధిస్తారు. ఎడ్జ్‌బాస్టన్‌లో రెండు ఓవర్లు, లార్డ్స్‌లో 9 ఓవర్లు, మాంచెస్టర్‌లో మూడు ఓవర్లు, ది ఓవల్‌లో ఐదు ఓవర్లు ఇంగ్లాండ్ వెనుకంజలో నిలువగా.. మాంచెస్టర్‌లో ఆస్ట్రేలియా ఏకంగా పది ఓవర్లు వెనుకంజ వేసింది. దీంతో యాషెస్ సిరీస్‌లో ఇరు జట్లు రెండు విజయాలు, ఓ డ్రాతో 28 పాయింట్లు సాధించగా.. ఇంగ్లాండ్ 19 పాయింట్లు, ఆసీస్ 10 పాయింట్లు కోల్పోయింది. మ్యాచ్ ఫీజులో ఆసీస్ ఆటగాళ్లు 50 శాతం కోల్పోగా.. ఇంగ్లాండ్ క్రికెటర్లు వరుసగా 10, 45, 15, 25 శాతం కోల్పోయారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ ఖాతాలో 9 పాయింట్లు, ఆస్ట్రేలియా ఖాతాలో 18 పాయింట్లు ఉన్నాయి.


యాషెస్ సిరీస్ ట్రోఫీతో బెన్ స్టోక్స్, పాట్ కమిన్స్

నవచిత్రం

చిరంజీవి నటిస్తున్న మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కథానాయికగా, చిరంజీవి సోదరిగా కీర్తి సురేష్ నటిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. ఆగస్టు 11న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన డడ్లీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు.

అద్భుతమైన విజువల్ ట్రీట్


డడ్లీ

'ఇది నా తొలి తెలుగు సినిమా. దర్శకుడు మెహర్ రమేష్, నేను పదేళ్ళుగా మంచి స్నేహితులం. లాక్ డౌన్ పీరియడ్‌లో ఓ రోజు కాల్ చేసి మనం ఒక ప్రాజెక్ట్ చేస్తున్నామని చెప్పారు. హీరో ఎవరని అడిగాను. గెస్ చేయమని చెప్పారు. నేను ఏవో రెండు పేర్లు చెప్పాను. 'మెగాస్టార్ చిరంజీవి గారు' అని ఆయనే రివీల్ చేశారు. నాకు చాలా షాక్ అండ్ సర్ప్రైజ్‌గా అనిపించింది. చాలా థ్రిల్ అయ్యాను. వెంటనే ముంబై నుంచి వచ్చి మిగతా వాటి గురించి చర్చించాం. అలా ఈ సినిమా జర్నీ మొదలైంది. చిరంజీవి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ఒక ఎన్సైక్లోపీడియా. పర్‌ఫెక్షనిస్ట్. ఆల్ ఇన్ వన్ ప్యాకేజ్. ఇది 'వేదాళం' చిత్రానికి రీమేక్. చిరంజీవితో చర్చించి సమిష్టిగా మార్పుల విషయంలో నిర్ణయాలు తీసుకున్నాం. ఇది మెగాస్టార్ స్టయిల్‌లో ఉంటుంది. లుక్, టేకింగ్ పరంగా మెగాస్టార్ స్టయిల్‌కి తగట్టు మార్పులు చేశాం. ఒరిజినల్ కంటే బెటర్‌గా ఉంటుంది. ఒక డీవోపీగా రీమేక్ సినిమా చేయటం చాలా కష్టం. ఎందుకంటే ఒరిజినల్‌ని మ్యాచ్ చేస్తే సరిపోదు దాని కంటే ప్రతి విషయంలోను ఒక అడుగు బెటర్‌గా ఉండాలి. ఇది బిగ్ ఛాలెంజ్. అందుకే ఈ సినిమా విజువల్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉన్నాం. దీనికోసం చాలా పెద్ద సెట్స్ వేశాం. సినిమా అంతా గ్రాండ్‌గా విజువల్ ట్రీట్‌గా వుంటుంది. ఇందులో యాక్షన్ పార్ట్‌కి కాంటాక్ట్ కెమెరాని వాడాం. కలకత్తా, స్విట్జర్లాండ్‌లో కూడా చిత్రీకరణ జరిపాం. యాక్షన్, సాంగ్స్ చాలా బావుంటాయి. భోళా శంకర్ ఫుల్ ప్యాకేజీ ఆఫ్ మాస్ ఎంటర్ టైనర్. కన్నుల పండగలా ఉంటుంది. ఈ సినిమా జర్నీ చాలా సరదాగా జరిగింది' అని తెలిపారు.


మాల్వీ మల్హోత్రా, రాజ్ తరుణ్

తిరగబడర సామీ రిలీజ్‌కి రెడీ

రాజ్ తరుణ్ కథానాయకుడిగా ఎ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ రామానాయుడు స్టూడియోలో జరుగుతోంది. హీరో, హీరోయిన్, రాజా రవీంద్రపై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో రాజ్ తరుణ్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్. రవికుమార్ చౌదరి గత సినిమాల్లానే యాక్షన్ కామెడీ, రొమాన్స్ ఎక్కడా తగ్గకుండా ఉంటాయి' అని అన్నారు. 'ఇది నా గత సినిమాలకు తగ్గకుండా ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, నా మార్క్ ఎమోషన్‌తో పాటు ఇందులో యూత్ ఫుల్ రోమాన్స్ కూడా టచ్ చేశాను. ఒక పాయింట్‌గా చెప్పాలంటే.. ఒక బంధాన్ని నిలుపుకోవడం కోసం భార్యాభర్తలు, ప్రేమికులు ఎంతవరకూ వెళ్తారనేది చాలా వినోదాత్మకంగా చూపించాం. చాలా అద్భుతమైన లొకేషన్స్ ఉంటాయి' అని దర్శకుడు ఎ ఎస్ రవికుమార్ చౌదరి అన్నారు. నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ,'దాదాపు చిత్రీకరణ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చివరి దశలో ఉన్నాయి. ఈ సినిమా మా బ్యానర్‌కి మంచి పేరు తీసుకొస్తుంది. రవికుమార్ చౌదరి గత చిత్రాల్లానే మంచి సినిమాగా నిలుస్తుంది. రాజ్ తరుణ్ 'సినిమా చూపిస్తా మామ' లాంటి విజయవంతమైన చిత్రాల కోవలోకే ఈ సినిమా కూడా చేరుతుంది. ఈ సినిమాని ఈ నెలాఖరకు లేదా వచ్చే నెల మొదటి వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు.

మంచి కుటుంబ కథా చిత్రం

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ హీరో,హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. శ్రీ తేజస్ ప్రొడక్షన్ ప్రై.లి బ్యానర్ పై పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పిఎన్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి సంయుక్తంగా నిర్మించారు. రాజేష్ దొండపాటి తెరకెక్కించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికేట్‌ను పొందింది. ఈనెల 4న ఈ చిత్రాన్ని గ్రాండ్ లెవల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.



'సినిమా ద్వారా మనుషుల్ని కదలించొచ్చు. ప్రతి మనిషి జీవితంలో కథలుంటాయి. కృష్ణ అనే యువకుడి కథే ఇది. తండ్రి కలను నేరవేర్చటానికి కొడుకు పడ్డ కష్టం. తన ప్రేమ, భావోద్వేగాలను అందంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా' అని నిర్మాత పెట్లా రఘురామ్ మూర్తి చెప్పారు. డైరెక్టర్ రాజేష్ దొండపాటి మాట్లాడుతూ, 'మా నిర్మాతకు మంచి గట్స్ ఉన్నాయి. మమ్మల్ని నమ్మి మాకు చాన్స్ ఇచ్చారు. సినిమా అందర్నీ అలరిస్తుంది' అని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, 'చక్కటి కుటుంబ కథా చిత్రంగా సినిమాను విజయవంతంగా పూర్తి చేసిన టీంకి శుభాకాంక్షలు. మా వరంగల్ వాళ్లకి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని అన్నారు. రిష్వి తిమ్మరాజు మాట్లాడుతూ, 'సినిమా చూడండి. నచ్చితే పది మందికి చెప్పండి' అని అన్నారు. విస్మయ శ్రీ మాట్లాడుతూ, 'సత్య లాంటి మంచి పాత్ర మళ్లీ వస్తుందో లేదో తెలియదు. నన్ను నేను నిరూపించుకునేందుకు ఈ పాత్ర దొరికింది' అని తెలిపారు.

తలలో దారిలో ఆర్ఆర్ఆర్

(మొదటిపేజీ తరువాయి)

యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇటీవల బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి సమావేశానికి రాజాసింగ్ రాలేదు. కాదు..కాదు...ఆ సమావేశ ఆహ్వానాన్నే ఆయనకు కిషన్‌రెడ్డి పంపలేదని తెలిసింది. రాజాసింగ్‌పై సస్పెన్షన్ వేటు ఎత్తివేయించే విషయంలో కాస్త చొరవ తీసుకున్న ఈటల రాజేందర్‌పై ఆ పార్టీ కీలక నేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతో అక్షింతలు పడిన విషయం తెలిసిందే. దీంతో రాజేందర్ గమ్మున ఉంటున్నారు. అసెంబ్లీ సమావేశాలను 30 రోజుల పాటు నిర్వహించాలనీ, అన్ని అంశాలపైనా సమగ్రంగా చర్చించాలని ఆ సమావేశంలో తీర్మానించామని ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మీడియా ముందుకొచ్చి చెప్పారు. ఆ సమావేశంలో పాల్గొన్న ఈటల మాత్రం మీడియా సమావేశంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. ఒకానొక దశలో రఘునందన్‌రావును బీజేపీ ఎల్పీ నేతగా నియమించబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే, గతంలో టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆ పార్టీ ఎల్పీనేతగా పనిచేసిన ఈటలను కాదని రఘునందన్‌రావుకు ఇచ్చి కొత్త తలనొప్పి తెచ్చుకోవడం ఎందుకనే భావనలో రాష్ట్ర అధిష్టానం పడ్డట్టు తెలిసింది. ఎన్నికలకు ముందు ఇదే చివరి అసెంబ్లీ సమావేశాలు కావడం, అవి కూడా నాలుగైదు రోజులకు మించి జరగబోవనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చివరి అంకంలో కొత్త పంచాయతీ ఎందుకనే చర్చ ఆపార్టీలో కొనసాగుతున్నది.

జయసుధ చేరిక సరే... మా మాటేందంటున్న బండా

సినీనటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ బీజేపీలో చేరారు. ఆమె సికింద్రాబాద్, ముషీరాబాద్ స్థానాల్లో ఏదో ఒక స్థానం నుంచి పోటీచేస్తారనే లీకులు ఆ పార్టీకి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నది. కాగా, వచ్చే ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యే సీటు ఇస్తామన్న హామీతోనే హైదరాబాద్ మాజీ మేయర్ బండా కార్తీక రెడ్డి బీజేపీలో చేరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జయసుధ చేరికతో బండా దంపతులు డైలామాలో పడ్డారు. కీలకనేతలకు ఫోన్లు చేసి తమకిచ్చిన హామీ మాటేంటని ప్రశ్నిస్తున్నారు. మాటతప్పితే తమ దారి తాము చూసుకుంటామనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి తన కుటుంబ సభ్యులనుగానీ, కుదరకపోతే తన అనుచరుల్లో ఎవరినైనా ఒకరిని నిలపాలనే ఆలోచనలో ఎంపీ లక్ష్మణ్ ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. అదే నియోజకవర్గం నుంచి హిమాచల్ ప్రదేశ్ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి పోటీచేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తన కూతురు రాజకీయ భవిష్యత్తు కోసం దత్తాత్రేయ కూడా జాతీయ స్థాయిలో పైరవీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె ముషీరాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో పలు కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో ఉంటున్నారు. జయసుధతో ఏ లొల్లి లేకుండా ఉండేందుకు చూసుకోవడంలో భాగంగా ఆమెకు జాతీయస్థాయిలో నామినేటెడ్ పోస్టుగానీ, సెన్సార్‌బోర్డు సభ్యురాలిగా నియమించాలనే ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నారు. మొత్తంగా జయసుధ చేరిక ఆ పార్టీలో కొత్త తలనొప్పులను తీసుకొచ్చి పెడుతున్నది.

వరద సాయం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు పర్యటించారని వివరించారు. ఆయా జిల్లాల కార్యదర్శులు, జిల్లా, స్థానిక నాయకత్వం కూడా ఈ పర్యటనలో పాలుపంచుకున్నదని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేసి ఆదుకున్నారని పేర్కొన్నారు. ఆయా బృందాల దృష్టికి వచ్చిన కొన్ని ముఖ్యమైన సమస్యలను సీఎం దృష్టికి తెస్తున్నామని తెలిపారు. సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటికోసం ఉద్దేశించిన భద్రకాళి చెరువుకు తూము లేనందున నీరు బయటకు వదిలే అవకాశం లేదని పేర్కొన్నారు. దానిపైన ఉన్న చెరువు తెగుతుందని అధికారులు ఆ నీటిని భద్రకాళి చెరువులోకి వదలడంతో కట్ట తెగిందని వివరించారు. ఈ చెరువుకు గేట్లు ఏర్పాటు చేస్తామంటూ 2020లో మంత్రి కేటీఆర్ తన పర్యటన సందర్భంగా వాగ్దానం చేసినా నేటికీ ఆ దిశగా ప్రయత్నమేమీ జరగలేదని తెలిపారు. వరంగల్ జిల్లాలో రూ.268 కోట్లు, హన్మకొండ జిల్లాలో రూ.206 కోట్లు మొత్తం రూ.474 కోట్లు వరద నష్టం జరిగినట్టు క్షేత్రస్థాయి పర్యటనలు ఏ ఒక్కచోట చేయకుండానే అధికారులు అంచనాలు వేశారని విమర్శించారు. వాస్తవంగా ఈ నష్టం మరో నాలుగు రెట్లు ఉంటుందని తమ బృందం భావిస్తున్నదని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి

- **అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద నష్టంపై వాస్తవిక అంచనా వేయాలి.**
- **వరి పంటకు ఎకరాకు రూ.20 వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేలు పరిహారమివ్వాలి. అదనంగా భూమి లెవలింగ్ కోసం ఎకరాకు రూ.50 వేలు అందించాలి. రైతును ఆదుకునేలా పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి.**
- **చనిపోయిన వారి కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున ఇచ్చి ఆదుకోవాలి.**
- **ఇండ్లు కూలిపోయిన వారికి డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. పాక్షికంగా ఇండ్లు దెబ్బతిన్నవారికి రూ.3 లక్షల పరిహారం అందించాలి.**
- **ప్రతి కుటుంబానికీ నెల రోజులకు సరిపోయే నిత్యావసరాలు, తిండి సామాగ్రి అందించాలి. మంచినీటి సరఫరా చేయాలి.**
- **భద్రకాళి చెరువుకు గేట్లు నిర్మించాలి. నీట మునిగిన పేదల ఇండ్లకు మరమ్మత్తు చేయించాలి.**
- **దెబ్బతిన్న జాతీయ, ఆర్అండ్‌బీ, పీఆర్ రహదారులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి.**
- **అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిగ్రామానికీ వైద్య బృందాలను పంపి వైద్యంతోపాటు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి.**
- **సీఎం ఇచ్చిన వాగ్దానం ప్రకారం భద్రాచలం కోసం రూ.వెయ్యి కోట్లు వెంటనే విడుదల చేయాలి.**
- **గోదావరి కరకట్టను పటిష్టం చేసి, సుభాష్‌నగర్ వరకు పొడిగించాలి.**

ఆలయాలపై హైకోర్టులో పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయమున్న ఆలయాలను దేవాదాయ,ధర్మాదాయ శాఖ చట్ట పరిధి నుంచి తొలగించాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని విచారించిన జస్టిస్ సుమలత దేవాదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేశారు. అఖిల భారత హిందూ మహా సభ అధ్యక్షులు నాగిళ్ల శ్రీనివాస్, గుంటి రాఘునాథస్వామి ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు గురిగంట్ల రంగయ్య, ధర్మశాల వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మటికె గౌరీ శంకర్ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయమున్న ఆలయాల నుంచి ప్రభుత్వం వివిధ రూపాల్లో వసూళ్లు చేస్తోందనీ, వాస్తవానికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాను చట్ట పరిధి నుంచి మినహాయింపు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. అధికారులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886